


జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజలు నీటి కోసం అల్లాడుతున్నారు. తాగేందుకే కాక సాధారణ అవసరాలకు కూడా నీరు సరిపడా దొరక్క అవస్థలు పడుతున్నారు. మనుషులతోపాటు పశుసంపద కూడా తల్లడిల్లుతున్న పరిస్థితి అనేక గ్రామాల్లో కనిపిస్తోంది. కొన్నిచోట్ల అధికార యంత్రాంగం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నా అది అరకొరగానే ఉంటోంది. ఆ నీటి కోసం ట్యాంకర్ల వద్ద మహిళలు, పిల్లలు యుద్ధాలు చేస్తున్నారు. వేసవి ఆరంభంలోనే సమస్య తీవ్రంగా ఉండగా ఇక మే, జూన్ నెలల్లో పరిస్థితిని ఊహించుకొని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పశ్చిమప్రాంతంలో 'ఆంధ్రజ్యోతి' బృందం మంగళవారం క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించగా నీటి ఇక్కట్ల తీవ్రత కనిపించింది.



దర్శి ఎన్‌ఏపీ పథకం ద్వారా 120 గ్రామాలకు నీరు సరఫరా చేయాల్సి ఉంది. జిల్లాలోనే అతిపెద్ద ప్రాజెక్టు అయిన దీని గురించి గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది. ఫిల్టర్ బెడ్లు ఎంతోకాలంగా మరమ్మతులు చేయక ఇసుక మట్టిగా మారిపోయింది. దీంతో నీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. దాదాపు 20 గ్రామాల్లో సమస్య ఉత్పన్నమైంది. వేసవిలో మరింత అధికమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.


సుంకేసులలో ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలు

పెద్దారవీడు మండలంలో తాగునీటి ఎద్దడి తీవ్రమైంది. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు ట్యాంకర్ల నీరే ఆధారమైంది. ప్రస్తుతం పది ఆవాస ప్రాంతాలకు నిత్యం 156 ట్రిప్పులను ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. మున్ముందు ఈ సంఖ్య భారీగా పెంచాల్సిన అవసరం కనిపిస్తోంది.

ఆంధ్రజ్యోతి ఫోకస్

పశ్చిమ పల్లెల్లో.. దాహం కేకలు

200 గ్రామాల్లో నీటి కష్టాలు

పశ్చిమ ప్రాంతంలోని సుమారు 200 గ్రామాల్లో ఇప్పటికే ప్రజానీకం, పశుసంపద నీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్న పరిస్థితి. చాలా గ్రామాల్లో పొలాల్లో ఉన్న వ్యవసాయ బోర్లపై జనం ఆధారపడుతున్నారు. ఇళ్ల వద్ద డ్రమ్ములు పెట్టుకొని వ్యవసాయ బోర్ల నుంచి ట్యాంకర్లతో తెచ్చి నింపుకొని వాడుకుంటున్నారు. ఇక సమస్య మరింత తీవ్రంగా ఉండి ప్రత్యామ్నాయ మార్గాలు లేని కొన్ని గ్రామాలకు మాత్రమే అధికారులు అరకొరగా ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారు. అలా ప్రస్తుతం తొమ్మిది మండలాల్లోని 69 ఆవాసాలకు రోజుకు 530 ట్యాంకర్ల నీటిని ఇస్తున్నారు. గరిష్ఠంగా వైపాలెం మండలంలో 14 ఆవాసాలకు నీరు తోలుతుండగా పెద్దారవీడులో పది, దొనకొండలో పది, దోర్నాలలో 9, పుల్లలచెరువులో 9 హ్యాబిటేషన్లలో ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నారు. నిజానికి అంతకు రెట్టింపు సంఖ్యలో గ్రామాలకు ట్యాంకర్లతో నీరు అందజేయాల్సిన అవసరం కనిపిస్తోంది.

తాగునీటికే కాక సాధారణ వాడకానికీ తప్పని ఇక్కట్లు

- పశుసంపదకూ తీవ్రంగానే సమస్య
- ట్యాంకర్లతో అరకొరగా సరఫరా
- క్షేత్రస్థాయి పరిస్థితి గుర్తించని యంత్రాంగం
- రూ.కోట్ల పాత బిల్లులు పెండింగ్‌తో ప్రస్తుతం సరఫరాకు వెనకడుగు
- పలు గ్రామాల్లో ట్యాంకర్ల వద్ద నీరు పట్టుకునేందుకు మహిళల అవస్థలు

ఒంగోలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాశ్వత రక్షిత తాగునీటి సరఫరా అంతంత మాత్రం కాగా పశ్చిమ ప్రాంతంలో మరింత అధ్వానం. అధికశాతం గ్రామాల్లో తాగేందుకే కాక సాధారణ అవసరాలకు, పశుసంపదకు కూడా భూగర్భ జలాలే ఆధారం. వెయ్యి అడుగుల లోతున మోటార్లు అమర్చే డీప్ బోర్లు గ్రామాల్లో తాగునీటికి ఉపకరిస్తుండగా సాధారణ అవసరాలకు స్థానికంగా ఉన్న సాధారణ, పొలాల్లో ఉండే వ్యవసాయ బోర్లే దిక్కు. కొన్ని గ్రామాలకు సామూహిక రక్షిత నీటి పథకాల (సీపీడబ్ల్యూ) ద్వారా సరఫరా జరుగుతోంది. అయితే ఎన్‌ఏపీ, చందవరం, ముటుకుల, పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం

మిగతా 6వ పేజీలో


దొనకొండ మండలం కొచ్చెర్లకోటలో ట్యాంకర్ల ద్వారా ఇచ్చే నీటిని పట్టుకునేందుకు ఇళ్ల ముందు ఉంచిన డ్రమ్ములు

బండ భారం
ఏడాదికి
రూ.15కోట్లు

- గ్యాస్ సిలిండర్ ధరను పెంచిన కేంద్రం
- ఒక్కోదానిపై రూ.50 వడ్డింపు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్ ధరను ఒక్కసారిగా రూ.50 పెంచింది. దీంతో ప్రజానీకంపై భారీగా భారం పడనుంది. జిల్లావ్యాప్తంగా మూడు కంపెనీల పరిధిలో సుమారు 7.5 లక్షల గ్యాస్ సిలిండర్లు



ఉన్నాయి. ఒక్కో కుటుంబం ఏడాదికి సగటున నాలుగు సిలిండర్ల వరకు వినియోగిస్తుంది. దీంతో రూ.200 వరకూ ఖర్చు పెరగనుంది. ఆవిధంగా జిల్లావ్యాప్తంగా ప్రజానీకంపై ఏడాదికి రూ.15కోట్ల మేర భారం పడనుంది. పెంచిన ధర మంగళవారం నుంచే అమల్లోకి వచ్చింది. జిల్లాకేంద్రమైన ఒంగోలులో సోమవారం సిలిండర్ ధర రూ.848 ఉండగా మంగళవారం అది రూ.898కి చేరింది. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎప్పుడు ధరలు పెరుగుతాయో కూడా అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గినప్పుడు కూడా ఎక్సైజ్ సుంకాన్ని పెంచుతూ ప్రజలపై ఆర్థికభారం మోపుతున్నారని ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి.



రమణీయం.. రథోత్సవం

శ్రీరామనవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా కొనకనమిట్ల మండలంలోని గొట్లగట్టు, చినమన గుండం గ్రామాల్లో శ్రీరాముని రథోత్సవాన్ని మంగళవారం కనుల పండువలా నిర్వహించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు.

7

ఎస్సీ కార్పొరేషన్‌కు పూర్వవైభవం

ఐదేళ్ల తర్వాత తిరిగి రుణాలు


ఒంగోలులోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

- 11 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఎస్సీల్లో చిగురిస్తున్న ఆశలు
- జగన్ హయాంలో మూలనపడ్డ పథకాలు

ఒంగోలు నగరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లుగా మూలనపడ్డ ఎస్సీ కార్పొరేషన్‌కు కూటమి ప్రభుత్వం పూర్వ వైభవాన్ని తెస్తోంది. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే అప్పటివరకు అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా అమలు చేసిన అన్ని పథకాలను మూలన పడేసింది. ఒక్క ఎస్సీ కార్పొరేషన్ మాత్రమే కాదు బడుగుల ఆర్థికాభివృద్ధి కోసం పనిచేసే బీసీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్లకు కూడా నిధుల లేకుండా చేసింది. వాటి ద్వారా ఎన్నో ఏళ్లుగా అమలవుతున్న అన్నిరకాల పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దుచేసింది. దీంతో రాష్ట్రంలోని బడుగు వర్గాల ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి కూటమికి పట్టం కట్టారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిది నెలల్లోనే కార్పొరేషన్లకు జవసత్వాలు తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే బీసీ కార్పొరేషన్ ద్వారా వేలాది మందికి యూనిట్లను అందించేందుకు లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తిచేసింది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కూడా పేదలకు రుణాలు ఇచ్చేందుకు కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది.

వచ్చేనెల 10 వరకూ దరఖాస్తుల స్వీకరణ

గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా ఉన్న అన్ని పథకాలను అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ముందుగా

మిగతా 6వ పేజీలో


విచారణకు కారులో వస్తున్న డాక్టర్ ప్రభావతి

గాయాలా... నాకు తెలియదే!

- డాక్టర్ ప్రభావతి వింత సమాధానం
- ముగిసిన రెండు రోజుల విచారణ

వివరాలు మెయిన్‌లో..


గంగదొనకొండ వద్ద భూమి విషయమై చర్చించుకుంటున్న రెవెన్యూ, అటవీ శాఖాధికారులు

వాదులాట.. ఆపై సర్దుబాట

- రెవెన్యూ, అటవీ శాఖాధికారుల చర్చలు
- సీబీజీ ప్లాంట్‌కు కేటాయించిన స్థలం పరిశీలన

కురిచేడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కురిచేడు మండలం గంగదొనకొండ గ్రామ సర్వే నంబర్లు 88, 90లలో ఏర్పాటు చేస్తున్న రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు కేటాయించిన స్థలం విషయమై అటవీ, రెవెన్యూ అధికారుల మధ్య చర్చలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఇరు శాఖల అధికారులు ప్లాంట్‌కు కేటాయించిన స్థలం వద్దకు చేరుకుని పరిశీలించారు. ఎవరి హద్దులు వారు చూసుకున్నారు. ఎవరికి వారు నివేదికలు తయారు చేసుకుని ఉన్నతాధికారులకు పంపారు. తహసీల్దార్ రజనీకుమారి, సర్వేయర్లు, ఆర్ఐ, వీఆర్వోలతో రాగా.. అటవీ శాఖ జిల్లా అధికారి వినోద్ కుమార్ తమ సిబ్బందితో వచ్చారు. ప్రారంభంలో ఇరు శాఖాధికారులు స్థలం మాదంటే మాది అని వాదులాడుకొని చివరకు సర్దుకుపోయారు. ఉన్నతాధికారులు ఏం చెప్తే అదే చేద్దామన్న నిర్ణయానికి వచ్చారు. మంగళవారం ఉదయం నుంచి ఎక్స్‌కవేటర్లతో చిల్లచెట్లను తొలగించే పనులు చేపట్టారు. పనులు జరుగుతుండగానే అధికారులు చర్చించుకున్నారు. కార్యక్రమంలో అటవీ శాఖకు చెందిన డీఎఫ్‌వో వినోద్‌కుమార్, అసిస్టెంట్ డీఎఫ్‌వో పి.శ్రీనివాసరావు, ఎఫ్ఆర్‌వో నరసింహారావు, డిప్యూటీ ఆర్‌వో బి.నాయక్, ఎఫ్‌బీవో ధనలక్ష్మి, తహసీల్దార్ రజనీకుమారి, ఆర్ఐ నాగరాజు, వీఆర్వో హనుమంతరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కొనుగోళ్ల పరిశీలన.. రైతులతో భేటీ

పొగాకు వేలం కేంద్రాలను సందర్శించిన బోర్డు ఈడీ విశ్వశ్రీ

- నోబిడ్లు లేకుండా చూడాలని, ధరలు పెంచాలని రైతుల వినతి

ఒంగోలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు పొగాకు వేలం కేంద్రాలను బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) బి.విశ్వశ్రీ మంగళవారం సందర్శించారు. కొనుగోళ్ల తీరును పరిశీలించడంతోపాటు రైతులతో సమావేశాలు నిర్వహించారు. పక్షంరోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన విశ్వశ్రీ తొలిసారి జిల్లాలోని వేలం కేంద్రాల సందర్శనకు రాగా పొగాకు రైతులు ఘనస్వాగతం పలికారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న సమస్యలను కూడా ఆమె దృష్టికి తీసుకెళ్లారు. తొలుత త్రోవగుంట సమీపంలోని ఒంగోలు-2 వేలం కేంద్రానికి వచ్చిన విశ్వశ్రీకి అక్కడి రైతు ప్రతినిధులు వడ్డెళ్ళ వరప్రసాద్, మండవ శివన్నారాయణ, పెనుబోతు సునీల్, యర్రంనేని శేషయ్య, ఇతర అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె అక్కడ పొగాకు కొనుగోళ్లను పరిశీలించారు. ఆతర్వాత టంగుటూరు, కొండపి, ఒంగోలు-1, వెల్లంపల్లి వేలం కేంద్రాలను కూడా సందర్శించారు. కొనుగోళ్ల తీరు, మార్కెట్‌లోకి వస్తున్న పొగాకు బేళ్ల నాణ్యత, లభిస్తున్న ధరలు, ఏ కంపెనీ బయ్యర్లు ఏ తరహా పొగాకు కొంటున్నారు.. తదితర అంశాలను ఆమె పరిశీలించారు. పలుచోట్ల తిరస్కరణకు గురైన బేళ్లను, వాటి గ్రేడ్లను చూసి వివరాలు


త్రోవగుంట వద్ద ఉన్న ఒంగోలు-2 వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను పరిశీలిస్తున్న బోర్డు ఈడీ విశ్వశ్రీ, అధికారులు

అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా వేలం కేంద్రాల్లో నిర్వహించిన సమావేశాల్లో పలువురు రైతు ప్రతినిధులు మాట్లాడుతూ కొన్నిరకాల బేళ్లు తిరస్కరణకు గురవుతున్న విషయాన్ని ఈడీ విశ్వశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఇస్తున్న ధరలు బాగా ఉన్నట్లుగా కనిపిస్తున్నా ఈ ఏడాది ఉత్పత్తి ఖర్చులు గణనీయంగా పెరిగాయన్నారు. ఈనేపథ్యంలో ధరలను మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సగటు ధరలు పెరిగేలా చూడటంతోపాటు నోబిడ్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల వినతిపై స్పందించిన ఈడీ విశ్వశ్రీ.. వచ్చే వారం వ్యాపారప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి ధరల విషయమై చర్చిస్తామని హామీ ఇచ్చారు. నోబిడ్ బేళ్లపై స్పందిస్తూ ప్రస్తుతం మార్కెట్లో కొనుగోళ్లు జరుగుతున్న గ్రేడ్ల రకంను వేలానికి తీసుకురావాలని సూచించారు. పొగాకు బోర్డు వైస్‌చైర్మన్ బ్రహ్మయ్య, బోర్డు సెక్రటరీ దివి వేణుగోపాల్, సభ్యుడు పొద వరప్రసాదరావు, ఆర్ఎం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సవాల్‌గా రామతీర్థం తిరునాళ్ల

- నిధికి ప్రభల తరలింపు విషయమై టెన్షన్
- నేటి నుంచి భారీ ఊరేగింపుగా తడిక ప్రభలు
- పటిష్ట బందోబస్తు ఏర్పాటుకు చర్యలు

7

పీ4తో పేదరిక నిర్మూలన

- చింతన్ శివిర్‌లో మంత్రి డాక్టర్ స్వామి
- అమలుపై ప్రజెంటేషన్

7



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పౌష్టికాహార పక్షోత్సవాలను విజయవంతం చేయాలి

- రోజుకు ఒక కార్యక్రమం నిర్వహించాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- పోస్టర్ ఆవిష్కరణ

7

నాడు ముద్దు.. నేడు వద్దు..!

అద్దంకి పోలీస్ స్టేషన్‌లో అయిష్టంగా సిబ్బంది విధులు

ప్రస్తుతం హెడ్ క్వార్టర్ బాపట్లలో ఉండడమే కారణం

అక్కడకు రవాణా వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో విసుగు

పిల్లల చదువుల పరంగానూ ఇబ్బందులే

అద్దంకి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు అద్దంకి పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్ అంటే సిబ్బందికి ఎంతో ఇష్టంగా ఉండేది... అయితే ప్రస్తుత పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా మారింది. దీనికి కారణం అప్పుడు జిల్లా కేంద్రమైన ఒంగోలుకు సమీపంలో ఉండటంతో పాటు ఎప్పుడూ రవాణా సౌకర్యం ఉండేది. వైసీపీ నిర్వాహకంతో జిల్లాల పునర్విభజనతో అద్దంకి నియోజకవర్గం కాస్తా బాపట్ల జిల్లాలోకి చేరింది. దీంతో మిగతా శాఖలతో పాటు ఆ షాక్ మరింత ఎక్కువగా పోలీస్ శాఖపై పడింది.

సొంత వాహనం ఉంటేనే బాపట్లకు..

బాపట్లకు అద్దంకి నుంచి సరైన రవాణా సౌకర్యం లేకపోవడం, సొంత వాహనం ఉంటే తప్ప త్వరగా చేరుకోలేని పరిస్థితి ఉంది. దీంతో అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో విధులు అంటే పనిష్మెంట్‌గా భావించే పరిస్థితి నెలకొంది. దీంతో సిబ్బంది కేటాయింపు జరిగినా బలవంతంగా వచ్చి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. తప్పని పరిస్థితులలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే విద్యాపరంగా, ఇతర వసతుల కోసం సిబ్బంది అత్యధికశాతం బాపట్ల పరిసర ప్రాంతాలలో స్థిరపడి ఉండడంతో ప్రస్తుతం అక్కడ నుంచి అద్దంకి వచ్చి విధులు నిర్వహించడం కష్టంగా మారిందనే అభిప్రాయం నెలకొంది. ఇక అత్యవసరంగా విధులకు వెళ్లాల్సి వస్తే సిబ్బంది కోసం వెతుక్కోవాల్సి వస్తుందనే అభిప్రాయం నెలకొంది. అద్దంకి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా ఉండడంతో ప్రొటోకాల్‌కు సిబ్బంది వెళ్లాల్సి ఉంటుంది. ఇక అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ కూడా అస్తవ్యస్తంగా ఉండడంతో గాడిలో పెట్టేందుకు సీఐ సుబ్బరాజు



అద్దంకి పోలీస్‌స్టేషన్

అష్టకష్టాలు పడుతున్నారు. దీంతో సాయంత్రం, ఉదయం సమయాలలో సిబ్బంది అందరూ ట్రాఫిక్ విధులు నిర్వహించాల్సి ఉంది. దొంగతనాలు అరికట్టేందుకు కూడా రాత్రి సమయాలో గస్తీ మరింత పెంచాల్సిన అవసరం కూడా ఉంది. పగలు సమయంలో అడపాదడపా బ్యాంక్‌లు, ఆర్టీసీ బస్టాండ్, రామాటాకీస్ రోడ్డు తదితర ప్రాంతాలలో కూడా గతంలో జరిగి ఉండడంతో పగలు సమయంలో కూడా సిబ్బంది నిఘా పెట్టి ఉంచాల్సిన అవసరం ఉంది. ఇలా సిబ్బంది మొత్తం పూర్తి సమయం విధులు నిర్వహించాల్సి రావడంతో వీలైనంత వరకు తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో ఆ ప్రభావం మిగిలిన సిబ్బందిపై పడి వాళ్లు కూడా ముఖం చాటేసే పరిస్థితి వచ్చినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో అద్దంకి పోలీస్ స్టేషన్‌కు మరింత ఎక్కువ మంది సిబ్బందిని కేటాయించే విధంగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇచ్చిన హామీని అమలు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాల పునర్విభజన చేసి మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేస్తామని ఇటీవల మార్కాపురం పర్యటనలో సీఎం చంద్రబాబు చెప్పారు. దీంతో అద్దంకి నియోజకవర్గం మరలా ప్రకాశం జిల్లా పరిధిలోకి చేరే అవకాశం ఉంది. అప్పుడు మరలా సిబ్బంది అద్దంకిలో విధులు అంటే పరుగెత్తే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

మోటార్ సైకిల్ ఢీకొని వ్యక్తికి గాయాలు

అద్దంకి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై నడిచి వస్తున్న వ్యక్తిని వెనుక నుంచి మోటార్ సైకిల్ ఢీకొనడంతో గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తిమ్మాయపాలెం సమీపంలో ఇటుక బట్టీల వద్ద పనిచేసే కట్టమూరి అప్పన్న సోమవారం రాత్రి సమీపంలోని టీ దుకాణంలో మరో వ్యక్తితో కలిసి టీ తాగి వస్తుండగా శంకరాపురం వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని మోటార్‌సైకిలిస్టు ఢీకొని వెళ్లిపోయాడు. క్షతగాత్రుడిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ కు తరలించారు. ఒంగోలు రిమ్స్ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు. అద్దంకి సమీపంలోని కలవకూరు రోడ్డులో మంగళవారం సాయంత్రం మొక్కజొన్నల బస్తాలతో వెళ్తున్న ట్రాక్టర్‌కు ఎక్స్‌కవేటర్ తగలడంతో కొన్ని బస్తాలు రోడ్డుపై పడ్డాయి. అయితే ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవటంతో ఊపిరిపీల్చుకున్నారు.

కేజీబీవీలో వసతి గృహాల నిర్మాణం ప్రారంభం

బల్లికురవ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం రూ.1.20కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో విద్యార్థినుల వసతి గదులను నిర్మాణం చేయనున్నారు. మంగళవారం నుంచి నూతన భవనాల పనులను కాంట్రాక్టర్ ప్రారంభించారు. పిల్లర్ల ఏర్పాటుకు గుంతలు తీసి పనులు ప్రాంభించారు. ఆరు నెలల వ్యవధిలో పూర్తి స్థాయిలో పనులు చేయిస్తామని ఏఈ రాజన్‌బాబు తెలిపారు.

అభయాంజనేయ స్వామి ఆలయాభివృద్ధికి రూ.5లక్షల విరాళం

పర్చూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వై.జంక్షన్‌లో ఏర్పాటు చేసిన 92 అడుగుల శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకొస్తున్నారు. ఇప్పటికే దాదాపు రూ.4కోట్ల వ్యయంతో ఆలయం రూపుదిద్దుకుంది. భక్తులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలన్న సంకల్పంతో ఆలయ కమిటీ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఆలయాభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మంగళవారం మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రావి రంగనాథబాబు ధరపత్ని నాగవర్ధిని రూ.5,25,116లక్షల విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా దంపతులను కమిటీ సభ్యులు అభినందించారు. కోటా హరి ప్రసాద్, కఠారి సురేంద్రబాబు, రంగిశెట్టి ఆంజనేయులు, మంగళగిరి కోటేశ్వరరావు, క్రిష్ణంశెట్టి శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి నరసింహం, రంగిశెట్టి రామాంజనేయులు, తులసి శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

అవిశ్వాసం నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కౌన్సిల్ హాల్లో బుధవారం సాధరణ సమావేశం జరుగనుంది. ఆ సమాచారాన్ని కమిషనర్ అబ్దుల్ రషీద్ అధికారికంగా తెలియజేశారు. ఇటీవల జరిగిన అవిశ్వాసం అంశం తారస్థాయికి చేరిన క్రమంలో జరిగే ఈ సమావేశం ఉత్కంఠగా మారనున్నట్లు తెలుస్తోంది. అజెండాలో పొందుపరిచిన అంశాలతో పాటు ఎలాంటి పరిస్థితులు చోటుచేసుకుంటాయోనని అందరి కళ్లు కౌన్సిల్ వైపు మారాయి.

కొనసాగుతున్న ధ్వజస్తంభం తొలగింపు

మే 19న శింగరకొండలో తిరిగి ప్రతిష్ఠ

అద్దంకి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో 1984లో ఏర్పాటు చేసిన ధ్వజ స్తంభాన్ని మంగళవారం తొలగింపు చర్యలు చేపట్టారు. 4 దశాబ్దాల కిందట పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ శంకరారెడ్డి సహకారంతో ధ్వజ స్తంభం ప్రతిష్ఠ జరిగింది. పూర్తిగా దెబ్బతినడంతో కొత్త ధ్వజ స్తంభం ఏర్పాటుకు వీలుగా సోమవారం పూజలు నిర్వహించి మంగళవారం ఈవో తిమ్మానాయుడు, ఆర్ఐ శంకర్, శింగరకొండపాలెం పంచాయతీ కార్యదర్శి చెన్నయ్య, ఏఎస్సై వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కార్యక్రమం సాగింది.

అయితే ధ్వజస్తంభం అడుగుభాగాన ఉన్న కాంక్రీట్ దిమ్మె పగలక పోవడంతో బుధవారం కంపర్సన్ ద్వారా తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు రూ.7కోట్ల రాతి ముఖ మండప నిర్మాణం పనులు పూర్తి చేసి మే నెల 19వ తేదీ కుంభాభిషేకం జరగనుంది. అదే రోజు మేదరమెట్ల శంకరారెడ్డి సహకారంతో సుమారు రూ.15 లక్షల వ్యయంతో కొత్త ధ్వజ స్తంభం ప్రతిష్ఠ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ధ్వజ స్తంభం చుట్టూ రాతి శిలా మండపం నిర్మాణానికి శింగరాయకొండ మండలం కనుమళ్లకు చెందిన కాట్రగడ్డ అనిల్‌కుమార్ రూ.8లక్షలు ఇప్పటికే అందజేశారు.


శింగరకొండలో ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద ధ్వజస్తంభం తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న ఈవో

ఓటర్ ఎన్‌రోల్‌మెంట్‌పై అభ్యంతరాలు తెలపండి

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఓటు కార్డు నవీకరణ (ఎన్‌రోల్‌మెంట్)లో అభ్యంతరాలు ఉంటే వెంటనే పరిష్కారం పొందాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో అన్ని పార్టీల రాజకీయ ప్రతినిధులతో, ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. నూతన, తొలగింపులు, మార్పులు, చేర్పులపై సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గ పరిధిలోని 218 పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఇప్పటి వరకు వచ్చిన సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీఎల్‌వోలతో మాట్లాడుతూ వచ్చిన అర్జీల్లో సమస్యలు ఉంటే నేరుగా అధికారి దృష్టికి తెచ్చి, సందేహాలను నివృత్తి చేశారు. తహసీల్దార్ గోపీకృష్ణ, మునిసిపల్ డీఈ రఘురామ్, ఎలక్షన్ డీటీ సుశీల పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, పక్కన తహసీల్దార్ గోపీకృష్ణ

జగనన్న పాపం..

స్థలమేకాదు.. ఇల్లు నిర్మించి తాళాలు చేతిలో పెడతామన్నారు...

గుడారాలకే పరిమితం చేశారు

ఆ స్థలాలు కూడా అందరికీ ఇవ్వలేదు

ఇదీ అద్దంకి పట్టణం గుండ్లకమ్మ నది ఒడ్డున ఉంటున్న యానాదుల కుటుంబాల ఆవేదన

ఇచ్చిన వాటిల్లో గుడిసె వేసుకుంటామంటే ఒప్పుకోని అధికారులు

అద్దంకి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని పాత దర్శి రోడ్డులో గుండ్లకమ్మనది ఒడ్డున సుమారు 10 యానాది కుటుంబాల వారు సుమారు 4 దశాబ్దాల నుంచి తాత్కాలిక గుడారాలు వేసుకొని నివాసం ఉంటున్నారు. వారికి కనీసం విద్యుత్, తాగునీటి వసతి కూడా లేదు. వైసీపీ పాలనలో వారికి స్థలాలు కేటాయించి ఇంటిని నిర్మించి తాళాలు చేతకి ఇస్తామని జగన్ చెపితే.. ఇక గుడారాల బతుకులకు తెరపడినట్లేనని వారు భావించారు. కానీ వారి ఆశలు నెరవేరలేదు. ఇళ్ల స్థలాలైతే ఇచ్చారుగానీ, ఇంటి నిర్మాణం చేసి ఇస్తామని చెప్పి మడమ తిప్పారు. ఇళ్ల స్థలాలు ఇవ్వడంలోనూ ఐదారు కుటుంబాలకే ఇచ్చారు. మిగిలిన వారికి ఇవ్వలేదు.


పాత దర్శి రోడ్డులో యానాదుల ఇళ్లు

ఇంటిని నిర్మించే స్థోమత లేదు

కడు బీదవారమైన తాము ఇంటిని కట్టుకునే స్థోమత లేదని, ఆ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటామంటే అధికారులు ఒప్పుకోవడంలేదని యానాదులు వాపోతున్నారు. ఇళ్ల స్థలాలు ఉన్నా.. పాత గుడారాలలోనే బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేసుస్తున్నారు. స్థలాలు ఐదారు కుటుంబాలకే ఇవ్వగా, మిగిలిన వారికి ఇవ్వలేదు. దీంతో అందరూ అక్కడే నివాసముంటున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మిగిలిన కుటుంబాలకు కూడా స్థలాలు కేటాయించడంతో పాటు ఇంటిని నిర్మించి ఇస్తే సొంత గూడు ఏర్పడుతుందని వారు ఆశిస్తున్నారు.

ఇళ్లు కట్టిస్తామని చెప్తే ఆనందించాం.. ఆశ నిరాశైంది


అంజమ్మ

స్థలం ఇచ్చి ఇంటిని కట్టించి ఇస్తామని జగనన్న చెప్తే ఆనందించాం. నాగులపాడురోడ్డులో ఉన్న లేఅవుట్‌లో స్థలం ఇచ్చారు. కానీ ఇంటిని కట్టివ్వలేదు. ప్రభుత్వం ఇచ్చే డబ్బుతోపాటు అదనంగా వేసుకుని ఇల్లు కట్టుకునే స్థోమత లేదు. కనీసం మాకిచ్చిన స్థలంలో గుడారమైనా వేసుకుంటామంటే అధికారులు ఒప్పుకోవడం లేదు. దీంతో ఇక్కడే ఉంటున్నాం.

ఇంటి స్థలం ఇవ్వలేదు


చెంచమ్మ

ఇళ్ల స్థలాలు కొంతమందికే ఇచ్చారు. ఇంకా కొన్ని కుటుంబాలకు స్థలాలు ఇవ్వలేదు. కనీసం కరెంట్, నీళ్లు కూడా లేకుండానే జీవనం సాగిస్తున్నాం. ఇంటి స్థలం కేటాయించి, కట్టిస్తే అందరితో కలిసి ఉంటాం. కనీసం మా పిల్లల జీవితాలైనా బాగుపడేలా చేయండి.

ఏడాదైనా వీడని కేసు మిస్టరీ!

బోయనవారిపాలెంలో ఇసుక డంప్ చేస్తుండగా టిప్పర్‌లో గుర్తుతెలియని మృతదేహం

నేటికీ లేని పురోగతి

చంపారా ? లేక పొరపాటున జరిగిందా?

విచారణ జరుగుతోందంటున్న పోలీసులు

ఈపూరుపాలెం(చీరాల), ఏప్రిల్ 8 : ఇంటి నిర్మాణం కోసం తోలించుకుంటున్న ఇసుక లోడ్‌లో గుర్తుతెలియని సుమారు 40 ఏళ్ల వ్యక్తి మృతదేహం ఉండడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. ఈ ఘటన జరిగి సరిగ్గా ఏడాదైంది. నేటికీ కేసు పురగోతి కనిపించలేదు. ఈపూరుపాలెం పంచాయతీ పద్మనాభునిపేటలో ఈ ఘటన చోటుచేసుకుంది. అప్పటి ఎస్పీ వకుల్ జిందాల్ దీనిపై స్పందించారు. ఇది ఎవరు చేశారనే కోణంతోపాటు అసలు మృతుడు ఎవరనే ఆధారాల కోసం ముమ్మర ప్రయత్నాలు సాగించారు. ఆ క్రమంలో కొందరు ఇసుకాసురుల పలుకుబడితో ఆ అంశం గాలిలో కలిసింది. బాధిత బంధువులు ఎవ్వరూ ముందుకు రాకపోవడం కూడా వాస్తవాలు కనుమరుగునకు కలిసొచ్చింది. ఈ కేసు గుట్టు ఇంకా ఎంత కాలానికి వీడుతుందో చూడాలి.

అసలేమి జరిగింది

ఈపూరుపాలెం పంచాయతీ పద్మనాభునిపేటకు చెందిన ఓ వ్యక్తి తన ఇంటి నిర్మాణం చేపట్టారు. అందుకు అవసరమైన ఇసుకను నింపేందుకు గతేడాది ఏప్రిల్ మొదటి వారంలో సుమారు 10 ట్రక్కుల ఇసుకను తోలించారు. ఆ ఇసుకను నాలుగు రోజుల అనంతరం ఎక్స్‌కవేటర్‌తో బేస్‌మట్టంలో నింపుతుండగా అందులో మృతదేహం కనిపించింది. దీంతో అవాక్కయిన యజమాని విషయాన్ని ఈపూరుపాలెం పోలీసులకు చెప్పారు. అప్పటి సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, ఎస్సై మర్రి శివకుమార్ సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని వెలుపలకు తీయించగా నుజ్జునుజ్జయిన సుమారు 40 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై శివకుమార్(ఫైల్)

విచారించి చర్యలు చేపడతాం

ఎండీ మొయిన్, డీఎస్పీ, చీరాల



అప్పట్లో మృతుని తలభాగం దెబ్బతినడం వలన ఆనవాళ్లు గుర్తించలేని పరిస్థితి. అతని బంధువులు ఎవ్వరూ ముందుకు రాలేదు. అతడి కుడిభుజంపై పచ్చబొట్టు మాత్రమే ఉంది. పూర్తి విచారణ అనంతరం చర్యలు చేపడతాం. నేరస్థులు తప్పించుకోలేరు.

బంగారం చేయిస్తానని టోకరా

అవీఇవీ

- డబ్బులు తీసుకుని ఉడాయించిన వ్యాపారి
- కందుకూరులో పోలీసులను ఆశ్రయించిన బాధితులు

కందుకూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కందుకూరులోని మారెమ్మ మిట్ట ప్రాంతంలో బంగారు ఆభరణాలు తయారు చేసిస్తానని నమ్మబటికి మహిళల వద్ద నగదు తీసుకుని సలీం అనే వ్యక్తి ఉడాయించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బూడిదపాలెంలో ఉంటున్న సలీం బంగారు ఆభరణాలు తయారు చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో తన ఇంటి యజమానితోపాటు మరికొందరు మహిళల వద్ద రమారమి 20 లక్షల రూపాయలకుపైగా ఆభరణాలు చేయిస్తానని చెప్పి అడ్వాన్సులు తీసుకుని నెలక్రితం పరారయ్యాడు. 10, 15 రోజులు సలీం కోసం ఎదురుచూసిన మహిళలు ఆ తర్వాత ఫోనులో సంప్రదించినా అందుబాటులోకి రాలేదు. దీంతో ఒంగోలులో ఉంటున్న సలీం కుమారుడికి ఫోన్ చేయగా ఆభరణాలు తయారు చేస్తున్నాడని, త్వరలో వస్తాడంటూ కొన్నిరోజులు నమ్మబలికి ఆ తర్వాత చేతులెత్తేశాడు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన మహిళలు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదుచేశారు. ఈ విషయమై పట్టణ ఎస్ఐ సాంబశివయ్యను వివరణ అడగ్గా సలీం కోసం గాలిస్తున్నామని త్వరలోనే పట్టుకుని సొమ్ము రికవరీ చేస్తామని తెలిపారు.

పశ్చిమ పల్లెల్లో దాహం కేకలు

(5వ పేజీ తరువాయి)

తదితర తాగునీటి పథకాల నిర్వహణ సరిలేదు. దీంతో వాస్తవంగా ఆ పథకం ద్వారా నీటి సరఫరా చేయాల్సిన వాటిలో సగం గ్రామాలకు కూడా సరిగా అందడం లేదు. నీరు వెళ్తున్న గ్రామాలకు సైతం రోజూ ఇచ్చే పరిస్థితి లేదు. కొన్ని గ్రామాలకు మూడు రోజులకు ఒకసారి మరికొన్ని గ్రామాలకు వారానికి ఒకసారి ఇస్తున్న పరిస్థితి.

అడుగంటిన భూగర్భ జలం

ముండ్లమూరు మండలంలో ఎన్ఏపీ పరిధిలోని పది గ్రామాలకు వారానికి ఒకసారి మాత్రమే నీటి సరఫరా జరుగుతోంది. ఇక మార్కాపురం డివిజన్‌లోని గ్రామాలకు భూగర్భజలమే దిక్కు. కాగా ఆ ప్రాంతంలో రోజురోజుకూ అడుగంటిపోతోంది. జిల్లాలో మార్చి ఆఖరుకు సగటున 16.05 మీటర్లకు చేరింది. గత డిసెంబర్‌లో 11.22 మీటర్లుగా ఉండగా మూడు మాసాలలో సగటుననాలుగు మీటర్లు మేర పడిపోయింది. పశ్చిమప్రాంతంలోని దోర్నాలమండలంలో 66.93 మీటర్లకు వెళ్లింది. డిసెంబరులో అక్కడ 43.27 మీటర్లు ఉండగా మార్చి ఆఖరుకు దాదాపు 24 మీటర్లు తగ్గిపోయింది. గిద్దలూరు మండలంలో 50.48 మీటర్లకు, వైపాలెం మండలంలో 47.76 మీటర్లు, పెద్దారవీడులో 38.17, పుల్లలచెరువులో 34.86, పొదిలిలో 32.75 మీటర్లకు పడిపోగా చాలా మండలాల్లో 20 నుంచి 30 మీటర్ల లోతుకు భూగర్భ జలమట్టం పడిపోయింది. ఐదారు వందల అడుగుల లోతున తవ్విన బోర్లు సైతం ఎండిపోయి నీరు రావడం లేదు. దీంతో సమస్య తీవ్రంగా కనిపిస్తోంది.

పశువుల వలసలు

వైసీపీ పాలనలో రెండేళ్లుగా సరఫరా చేసిన నీటి ట్యాంకర్లకు దాదాపు రూ.21కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో అత్యవసరం అయితే అది కూడా అరకొరగా మాత్రమే అధికారులు సరఫరా చేస్తున్నారు తప్ప క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితిని గుర్తించడం లేదు. జూన్ ఆఖరు వరకు కనీసం 230 ఆవాసాలకు నీటి సరఫరా చేయాల్సి ఉంటుందని, అందుకు రూ.11.20 కోట్లు అవసరమతాయని ప్రభుత్వానికి నివేదించారు తప్ప కార్యాచరణ చేపట్టలేదు. దీంతో ప్రజానీకం పొలాల నుంచి తెచ్చి పోసే ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేసి అవసరాలు తీర్చుకుంటున్నారు. ఇక పశుసంపద పరిస్థితి దారుణంగా ఉంది. పశ్చిమాన అనేక పల్లెల్లో పొలాలకు వెళ్తున్న పశువులకు గుక్కెడు నీరు దొరకని పరిస్థితి నెలకొంది. ఏటా మేత, నీటి కోసం పశ్చిమ ప్రాంతం నుంచి డెల్టా ప్రాంతానికి పశువులు వలసలు ఉంటాయి. ఈ ఏడాది అది అధికమైంది. గత పక్షంరోజుల్లో ఎర్రగొండపాలెం ప్రాంతం నుంచి ఐదారు వేల ఆవులు అలా వలస వెళ్లాయి. తక్షణం అధికారులు, ప్రజాప్రతినిధులు నీటి ఇక్కట్లపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎస్సీ కార్పొరేషన్‌కు పూర్వవైభవం

(5వ పేజీ తరువాయి)

బ్యాంకు లింకేజీతో ఎస్సీలకు పెద్దఎత్తున రుణాలను అందించేందుకు కసరత్తు చేస్తోంది. ఇందుకోసం ఈనెల 11వతేదీ నుంచి ఎస్సీలకు రుణాల మంజూరు కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. రాష్ట్రవ్యాప్తంగా రూ.800కోట్లకుపైగా రుణాల రూపంలో ఎస్సీలకు అందజేయనుంది. మే 10 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తుంది. మే 20వ తేదీలోగా లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తవుతుంది. 60శాతం, 40శాతం సబ్సిడీతో యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం రుణాలను మంజూరు చేయనుంది. రూ.10లక్షలకుపైగా యూనిట్ విలువతో ఇవి మంజూరు కానున్నాయి. ఇందులో లబ్ధిదారుల వాటాగా 5శాతం చెల్లించాల్సి ఉంది. సబ్సిడీ గరిష్ఠంగా రూ.లక్ష అందజేయనున్నారు. రాష్ట్రప్రభుత్వం ముందుగా బ్యాంకు లింకేజీ రుణాలకు దరఖాస్తులను ఆహ్వానించగా కొద్దిరోజుల్లోనే వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన అన్ని పథకాలను తిరిగి పునఃప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

మే 19న శింగరకొండలో మహాకుంభాభిషేకం

ఏర్పాట్లను పరిశీలించిన శృంగేరి పీఠం శిష్య బృందం

అద్దంకి,ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి ముఖమండపం పనులు పూర్తయి మే 19వ తేదీన శృంగేరి పీఠాధిపతి పర్యవేక్షణలో మహాకుంభాభిషేకం జరుగనుంది. ఈ నేపథ్యంలో శృంగేరి పీఠం శిష్యబృందం మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. శమంతకశర్మ, విద్యాశంకర్ రాతి మండపం పనులు, మహాకుంభాభిషేకం సందర్భంగా పూజలు, హోమాలు నిర్వహించే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో తిమ్మానాయుడు, వేదపండితులు హరిశంకరావధాని ఉన్నారు.

హోమియో వైద్యంతో శాశ్వత పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పలు రోగాలకు హోమియో మందులతో శాశ్వత పరిష్కారం ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం రోటరీ కమ్యూనిటీ భవనంలో హోమియో పితామహుడు, శాస్త్రవేత్త డా.శామ్యూల్ హానిమూన్ జయంతి వేడుకలను ముందస్తుగా నిర్వహించారు. చీరాల హోమియో ఫిజిషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హానిమూన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళల నెలసరి, చిన్నారుల ఎదుగుదల, సీజనల్ వ్యాధులపై హోమియో మందుల ప్రభావాన్ని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు డా. శ్రీనివాస్, డేగల శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సురేష్‌బాబు, పోలుదాసు రామకృష్ణ, గవీష్, మురళీకృష్ణ, డా.ప్రదీప్, డా.అశోక్ పాల్గొన్నారు.

శనగల తేమ శాతం 14కి మించరాదు

పంగులూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):పంగులూరు మార్కెట్ యార్డ్‌నందు శనగల కొనుగోలు కేంద్రంలో జేజే-11 రకం శనగలు కొనుగోలు చేస్తున్నట్లు వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి తెలిపారు. శనగల విక్రయంలో పాటించాల్సిన నిబంధనలను మంగళవారం ఏవో సుబ్బారెడ్డి, పీఏసీఎస్ సీఈవో లక్ష్మి రైతులకు వివరించారు. శనగ రైతులు తమ పంట విక్రయానికి రైతు సేవా కేంద్రాలలో తమ పేరు నమోదు చేసుకుని నిర్దేశిత సమయంలో పంటను అమ్ముకునే అవకాశం ఉందని తెలిపారు. క్లీనింగ్ కోసం డీ స్టోన్ చేయించాలని, తేమ శాతం 14కి మించకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో జేజే 11 రకం క్వింటాకు రూ.5,650 ధర నిర్ణయించినట్లు తెలిపారు.

కనుల పండువగా రథోత్సవాలు





మార్కాపురం మండలంలోని బోడపాడు గ్రామంలో వెలిసిన పట్టాభి రామస్వామి రథోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గ్రామంలో శ్రీరామనవమి వేడుకలను ఏటా మూడు రోజులపాటు నిర్వహిస్తారు. మూడో రోజున మంగళవారం సీతారాముల వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులంతా కలిసి పెద్దఎత్తున అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.కొనకనమిట్ల మండలంలోని గొట్లగట్టు, చినమనగుండం గ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాల చివరి రోజు మంగళవారం రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా రథాన్ని శోభాయమానంగా అలంకరించి సిద్ధం చేశారు. ఉత్సవమూర్తులను వేదపండితులు అత్యంత రమణీయంగా అలంకరించారు. అనంతరం సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముల స్వామివారికి పొంగళ్లతో నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథంపై స్వామివార్లను కొలువుదీర్చారు. వేదపండితుల వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు. - **మార్కాపురం/కొనకనమిట్ల, ఆంధ్రజ్యోతి**

11న మార్టూరులో ఉరుసు వేడుకలు

మార్టూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు గ్రామంలో షేక్ హజరత్ కరిముల్లాషా వలి 49వ ఉరుసు వేడుకలను ఈనెల 11వ తేదీ శుక్రవారం నిర్వహించేందుకు కమిటీ సభ్యులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. కొణిదెన రోడ్‌లో ఉన్న దర్గా వద్ద ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ ఉరుసు వేడుకలను తిలకించడానికి ప్రకాశం, పల్నాడు, నెల్లూరు, గుంటూరు జిల్లాల నుంచి భక్తులు విశేషంగా తరలివస్తారు. ముస్లిం మైనారిటీలు వారే కాకుండా ఇతర సామాజిక వర్గాలకు చెందినవారు, మార్టూరు మండలంలోని గ్రామాలకు చెందినవారితోపాటు చుట్టుపక్కల మండలాల వారు ఈ వేడుకలను తిలకించేందుకు వస్తారు. మా సుదూర ప్రాంతాల నుంచి అనారోగ్యం, సంతానం లేనివారు మొక్కుకుంటారు. ఉరుసు వేడుకలు జరిగేరోజు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, రంగులరాట్నాలు తదితర వాటితో భక్తులు కాలక్షేపం చేస్తారు. ఇతర ప్రాంతాల నుంచి వివిధ వస్తువులను అమ్మడానికి దుకాణదారులు రావడంతో కొణిదెన రోడ్డు సందడిగా కనిపిస్తోంది.

అర్ధరాత్రి గుర్రంపై గంధం ఊరేగింపు

ఉరుసు పండుగ రోజున అర్ధరాత్రి దర్గా నుంచి గుర్రంపై స్టీలు బిందెలో గంధాన్ని గ్రామంలోని నలువీధుల్లో ఊరేగిస్తారు. భక్తులు ఈ గంధాన్ని తీసుకోవడానికి ఉత్సాహం చూపిస్తారు. గంధాన్ని ఊరేగించడం ద్వారా గ్రామంలో భూత ప్రేత పిశాచాలు ఉండవని, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని నమ్మకం. శనివారం ఉదయం 10 గంటల వరకు గ్రామంలో గంధం ఊరేగింపు కార్యక్రమం కొనసాగుతోంది.

12 నుంచి నెమలిగుండ్ల రంగనాయకస్వామి
బ్రహ్మోత్సవాలు

రాచర్ల (గిద్దలూరు), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం జెల్లివారి పుల్లలచెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలిసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానంలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి నాగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 12న అంకురార్పణ, పూలంగి సేవ, ధ్వజారోహణం నిర్వహించనున్నారు. స్వామివారు శేషవాహనంపై, హనుమంత వాహనంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 13న ఆదివారం రంగనాయకస్వామి వారి కల్యాణ మహోత్సవం, విష్ణుమూర్తి అలంకారంలో గరుడ వాహనంలో, గజవాహనంలో భక్తులకు దర్శనమిస్తారు. 14న సోమవారం స్వామి వారి తెప్పోత్సవం, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నారు. 15వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా 12న కోలాట ప్రదర్శన, సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకం, 13న కోలాట ప్రదర్శన, పాట కచేరి, చింతామణి పూర్తి నాటకం, 14న కోలాట ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

● ఎడ్ల బలప్రదర్శన పోటీలు

రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా 13న ఆదివారం ఎడ్ల బలప్రదర్శన పోటీలను నిర్వహించనున్నారు. మొదటి నాలుగు బహుమతులు వరసగా రూ.లక్ష, రూ.70వేలు, రూ.50వేలు, రూ.30వేలు నగదు బహుమతులు అందజేయనున్నారు. గుండుపందెం నిర్వహించి విజేతలకు వరుసగా 10 తులాల, 5 తులాల వెండి బహుమతిగా ఇవ్వనున్నారు.

● ప్రత్యేక బస్సులు

రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. గిద్దలూరు, కంభం, మార్కాపురం పట్టణాల నుంచి నేరుగా రంగనాయకస్వామి దేవస్థానం వరకు ప్రతి అరగంటకు ఒక బస్సు సర్వీసు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల సంఖ్యను బట్టి అప్పటికప్పుడు బస్సు సర్వీసులను నడిపేందుకు వీలుగా ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జయహో.. గంగమ్మ తల్లి

● 12న వార్షిక తిరునాళ్లకు భారీ ఏర్పాట్లు ● 6 విద్యుత్ ప్రభలకు సన్నాహాలు

బల్లికురవ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : భక్తుల కొంగు బంగారమైన వీర్ల గంగమ్మ వార్షిక తిరునాళ్లను ఈ ఏడాది పెద్దఎత్తున జరిపేందుకు ఆలయ కమిటీ సన్నాహాలు చేస్తోంది. ఈనెల 12వ తేదీన ఈ తిరునాళ్ల జరగనుంది. దేవాలయం నలువైపులా గ్రానైట్ క్వారీలతోపాటు ఏటికేడూ గంగమ్మ దేవాలయం కూడా అభివృద్ధి చెందుతూ వస్తోంది. నక్కబొక్కలపాడు గ్రామస్థులు ఈ దేవాలయ పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్నారు. ఇప్పటికే ఆ గ్రామానికి చెందిన పెద్దలు కమిటీ ఏర్పాటు చేసుకొని ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

12న వార్షిక తిరునాళ్ల

వీర్ల గంగమ్మ తల్లి వార్షిక తిరునాళ్ల ఈనెల 12వ తేదీన శనివారం చైత్ర పౌర్ణమి నాడు జరగనుంది. ఈ సందర్భంగా దేవాలయానికి పలు ప్రాంతాలకు చెందిన భక్తులు భారీస్థాయిలో తరలిరానున్నారు. మూడేళ్ల కిందట 11 విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. అదే మాదిరిగానే ఈ ఏడాది కూడా బల్లికురవ, నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం గ్రామాల నుంచి భక్తులు 6 విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసేందుకు తిరునాళ్ల ప్రదేశంలో తమ పార్టీల జెండాలను పాతారు. వీర్ల గంగమ్మ దేవాలయం వద్ద దాతలు, గ్రానైట్ క్వారీల నిర్వాహకులు ఇప్పటికే పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. విశ్రాంతి భవనాలు, ఆర్వో ప్లాంటు, భోజనశాల, పొంగలిశాల భవనాలను ఏర్పాటు చేశారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు.


వీర్ల గంగమ తల్లి దేవాలయం

ఆలయ నేపథ్యమిదీ..

వీర్లకొండ పెద్ద బండరాయి కింద క్రీస్తుశకం 12వ శతాబ్దంలో వీర్ల గంగమ్మ దేవాలయం ఏర్పాటైనట్లు చెబుతుంటారు. చరిత్ర ఆధారాల ప్రకారం కొణిదెనకు చెందిన అప్పటి పాలకుడు కాటమరాజు సోదరుడు పల్లికొండకు, ఇతర రాజులకు గంగమ్మ దేవాలయం పరిసరాల్లో యుద్ధం జరిగిందనీ, ఇందులో అనేక మంది వీరులు మృతి చెందారనీ చెబుతుంటారు. మృతుల పేరుతో ఇక్కడ శిలలు ఏర్పాటు చేసినట్టు పండితులు చెబుతున్నారు. ఈ శిలల ఆధారంగా వీర్ల కొండగా ఈ ఆలయానికి నామకరణం చేశారు. అక్కడ గంగమ్మ శిలలను పల్లికొండ రాజు ఏర్పాటు చేసి ఏటా చైత్ర పౌర్ణమి నాడు తిరుణాళ్ల నిర్వహించేవారు. అప్పటి నుంచి వీర్ల గంగమ్మ దేవాలయం వాడుకలోకి వచ్చింది.

కనిగిరిలో నవోదయ స్కూలును ఏర్పాటు చేయాలి

● మంత్రి లోకేష్‌ను కలిసిన ఎంపీ మాగుంట


మంత్రి లోకేశ్‌తో ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కనిగిరిలో నవోదయ స్కూలును ఏర్పాటు చేసే విధంగా చూడాలని ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. మంగళవారం ఉండవల్లిలో విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌ను ఎంపీ మాగుంట మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేట్ స్కూళ్లలో తమ పిల్లలను చదివించలేకపోతున్నారని తెలిపారు. అందువల్ల అక్కడ నవోదయ స్కూలును ఏర్పాటుచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, అక్కడఅన్ని వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆయా అంశాలపై స్పందించిన లోకేష్ త్వరలో కేంద్రంతో మాట్లాడికనిగిరిలో నవోదయ స్కూలు ఏర్పాటు, ఒంగోలులోని విశ్వవిద్యాలయానికి కూడా నిధులు మంజూరు చేస్తానని హామీఇచ్చారని ఎంపి మాగుంట తెలిపారు.

పౌష్టికాహార పక్షోత్సవాలను విజయవంతం చేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మంగళవారం నుంచి 15 రోజులపాటు నిర్వహించనున్న పౌష్టికాహార పక్షోత్సవాల (పోషణ్ పఖ్వాడా)ను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. మంగళవారం నుంచి ఈనెల 22వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రోజుకు ఒక కార్యక్రమంతో స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు చెప్పారు. గర్భస్థ దశ నుంచి రెండేళ్ల వరకు సంరక్షణపై శ్రద్ధ తీసుకోవడం, లబ్ధిదారులు స్వయంగా తమంతట తామే పోషణ్ పోర్టర్‌లో నమోదు చేసుకొనే విధానంపై ప్రచారం చేయాలన్నారు. కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ కార్యక్రమం అమలు చేయడం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపం నివారించడం, పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకొనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా పక్షోత్సవాలకు సంబంధించి పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు.

ఉరేసుకుని యువకుడి మృతి

నెల్లూరు జిల్లా కందుకూరులో దుర్ఘటన

కందుకూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్‌లు, ఇతర వ్యసనాలకు బానిసైన ఓ యువకుడు నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణంలోని ఓ లాడ్జీలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కనిగిరి నియోజకవర్గంలోని పునుగోడుకు చెందిన కల్లూరి శివనాగరాజు (26)గా పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసుల కథనం మేరకు.. బేల్దారి పని చేసుకొంటూ జీవనం సాగించే శివనాగరాజు తండ్రి ఏడేళ్ల క్రితం మృతి చెందగా ఆ తర్వాత దుర్వసనాలు, బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడిన తన స్థోమతకు మించి అప్పులు చేశాడు. గత కొన్నేళ్లుగా పనికి కూడా సక్రమంగా వెళ్లకుండా మేస్త్రీల వద్ద అడ్వాన్సులు తీసుకుని వారికి కనిపించకుండా తప్పించుకుని తిరగడం, బెట్టింగ్‌లు, ఇతర వ్యసనాలతో కాలం గడిపేవాడు. ఈ నేపథ్యంలో ఇటీవలి కాలంలో బెట్టింగ్‌లలో మరికొంత సొమ్ము పోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి ఫోన్ పరిశీలించగా అనేక బెట్టింగ్ యాప్‌లు ఉన్నట్లు గుర్తించామని, క్రికెట్ బెట్టింగ్‌లతో పాటు ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లు ఆడటం, ఇతర దుర్వసనాలు ఉన్నట్లు కుటుంబసభ్యుల ద్వారా తెలిసిందని పట్టణ ఎస్‌ఐ సాంబశివయ్య తెలిపారు.


లాడ్జీలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న శివనాగరాజు

పీ4తో పేదరిక నిర్మూలన

● చింతన్ శివిర్ సదస్సులో మంత్రి స్వామి ● అమలుపై ప్రజెంటేషన్

ఒంగోలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదరిక నిర్మూలన కోసం ప్రత్యేక విజన్‌తో పనిచేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖమంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి అన్నారు. అందుకోసం సీఎం ఆలోచనతో పీ4 విధానాన్ని అమలులోకి వచ్చిందన్నారు. దాని ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. డెహ్రాడున్‌లో రెండు రోజుల పాటు కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ మంత్రిత్వశాఖ నిర్వహిస్తున్న చింతన్ శివిర్ సదస్సులో రెండోరోజైన మంగళవారం మంత్రి డాక్టర్‌స్వామి మాట్లాడారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, సామాజిక రుగ్మతలు రూపుమాపి పేదలకు మెరుగైన వసతుల కల్పనకు చర్యలు, ఇతర పథకాల అమలు తదితర అంశాలపై సదస్సులో కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాల మంత్రులు, అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. పీ4 విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ పథకం రూపకల్పన ప్రధాన ఉద్దేశాలు, అమలు తీరు, తద్వారా పేదరిక నిర్మూలన తదితర అంశాలు వివరించారు. దేశంలో ఎక్కడలేని విధంగా వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ అందజేత, డ్రగ్స్, గంజాయి రూపకల్పన కోసం ఈగల్ వ్యవస్థ, జిల్లా ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలలో డీ అడిక్షన్ సెంటర్ల ఏర్పాటు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు, పారిశుధ్య నిర్వహణకు మిషన్ల ఏర్పాటు తదితర అంశాలను సదస్సు దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో సంక్షేమ వసతిగృహాలకు రూ.143 కోట్లతో మరమ్మతులు చేస్తుండటం, ఇళ్ల నిర్మాణాలకు కేంద్రం ఇస్తున్నదానికి అదనంగా ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు ఇస్తున్నట్లు తెలిపారు. ఇలా పేదవర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాల అమలుకు కేంద్రం ఉదారంగా స్పందించి అధిక నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి స్వామితో పాటు పలువురు రాష్ట్ర అధికారుల బృందం ఈ సదస్సుకు హాజరైంది.

ఎన్టీఆర్ వైద్యసేవలపై దుష్ప్రచారం

● వదంతులను నమ్మొద్దు : డాక్టర్ హేమంత్ కుమార్

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవలు నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో యథావిధిగా కొనసాగుతున్నాయని ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ హేమంత్‌కుమార్ తెలిపారు. ఆమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియాలో రెండు రోజులుగా ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిచిపోయినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. వైద్యసేవలకు ఎలాంటి ఆటంకం లేదని, అందువల్ల ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ నేతల భేటీలో పెండింగ్ బిల్లుల చెల్లింపునకు హామీ కూడా ఇచ్చారన్నారు. అందువల్ల జిల్లాలోని ప్రజలు వారి అవసరాలను బట్టి యథావిధిగా ఎన్టీఆర్ వైద్యసేవలు ప్రైవేటు నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో ఉచితంగా పొందవచ్చని తెలిపారు.

పోలీసులకు సవాల్‌గా రామతీర్థం తిరునాళ్ల

● నిధికి ప్రభల తరలింపుపై ఉత్కంఠ ● నేటి నుంచి భారీ ఊరేగింపుగా ప్రభలు ● పటిష్ట బందోబస్తుకు చర్యలు

చీమకుర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రామతీర్థం తిరునాళ్ల మహోత్సవం ఈసారి పోలీసులకు సవాల్‌గా మారుతుంది. తిరునాళ్ల నిర్వహణను రాజకీయ పార్టీలు తమ ఆధిపత్యపోరుకు వేదికగా ఉపయోగించుకోవటం వల్ల శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందేమో అని పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈనెల 11న చీమకుర్తి పట్టణంలో మందిరాల సంబరాలు, 12న రామతీర్థం గంగమ్మ సన్నిధిలో తిరునాళ్ల మహోత్సవాన్ని అట్టహాసంగా జరుపుకోవటానికి నిర్వాహకులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు తిరునాళ్లలో భాగంగా ముందస్తు సంబరాలు బుధవారం నుంచి జరగనున్నాయి. 12న రామతీర్థంలో జరగనున్న తిరునాళ్లకు టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీల నేతలు భారీ ప్రభలను సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రభల తడకలను రామతీర్థం నిధికి తరలించి నిలబెట్టే కార్యక్రమాన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటాయి. ప్రభలను ఊరేగింపుగా తరలించేందుకు భారీగా కార్యకర్తలను సమీకరించడానికి, తమ ప్రభ ఊరేగింపే ఘనంగా జరిగిందని, ఎక్కువమంది జనం పాల్గొన్నారని నిరూపించుకోవటానికి పార్టీలు ప్రయత్నాలు చేస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఊరేగింపునకు ఒక్కో పార్టీకి ఒక్కో రోజును కేటాయించారు. గతంలో రెండు పార్టీల ప్రభల ఊరేగింపు ఒకేరోజు జరగటంతో ఘర్షణ తలెత్తింది. దీనిని నివారించటానికి ఒక్కో పార్టీకి ఒక్కో రోజును పోలీసులు కేటాయించారు. 9వ తేదీన వైసీపీ, 10న టీడీపీ, 11న జనసేన ప్రభలు ఊరేగింపుగా తరలి నిధికి వెళ్లనున్నాయి. అయితే చీమకుర్తి పట్టణం మధ్య నుంచి వెళ్తున్న కర్నూల్‌రోడ్డుకి ఇరువైపులా భారీస్థాయిలో ఒకపార్టీకి చెందిన నాయకుని పుట్టినరోజు సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ప్రభల ఊరేగింపు ఇదే మార్గంలో వెళ్తున్నందున ఆకతాయిలు ఫ్లెక్సీలు చించివేయటం లాంటి చర్యలు చేపడితే ఉద్రిక్తతలు తలెత్తి శాంతిభద్రతలపై ప్రభావం చూపుతుందని మున్సిపల్ అధికారులు, పోలీసులు భావించారు. ఆ ఫ్లెక్సీలతోపాటు అన్ని రకాల ఫ్లెక్సీలను తొలగించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రభల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కమిషనర్ వై.రామకృష్ణయ్య, సీఐ సుబ్బారావు పాల్గొని ఫ్లెక్సీలను తక్షణమే స్వచ్ఛందంగా తొలగించాలని పార్టీల నేతలను కోరారు. తిరునాళ్లను భక్తిపూర్వకంగా జరుపుకోవాలే కాని రాజకీయ బలప్రదర్శనలకు వేదిక చేయకూడదని నిర్వాహకులకు తెలిపారు. శాంతిభద్రతల విషయంలో గట్టిగా వ్యవహరిస్తామని, అందరూ సహకరించాలని పోలీసులు కోరారు. మరోవైపు ప్రభల ఊరేగింపులో ఆయా పార్టీలకు చెందిన కీలకమైన నాయకులు పాల్గొననుండటంతో బందోబస్తును సైతం పటిష్టంగా ఏర్పాటు చేస్తున్నారు.


ప్రభల నిర్వాహకులతో మాట్లాడుతున్న కమిషనర్, సీఐ

అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి

సంతనూతలపాడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పేర్నమిట్టలో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఆదిలక్ష్మి మంగళవారం పరిశీలించారు. పేర్నమిట్టలో 86, 89, 95, 96, 97 పోలింగ్ కేంద్రాల్లో 1200 ఓట్ల కంటే అధికంగా ఉండటంతో అదనపు పోలింగ్ ఏర్పాట్ల నిమిత్తం రెవెన్యూ బృందంతో కలిసి సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు, బీఎల్‌వోల సమస్యలపై ప్రత్యేకంగా చర్చించి పరిష్కరిస్తానన్నారు. అనంతరం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర సెక్రటరీ స్వాములు, మండల అధ్యక్షుడు హరిబాబు పాల్గొన్నారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు



గాయపడిన హరిబాబు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని మోటార్‌సైక్లిస్టుకు గాయాలైన సంఘటన నాగులుప్పలపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదురు గల జాతీయ రహదారిపై జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. చదలవాడ గ్రామానికి చెందిన బేల్దారి మేస్త్రీ బిక్కసాని హరిబాబు మంగళవారం రాత్రి మోటార్‌సైకిల్‌పై నాగులుప్పలపాడు నుంచి స్వగ్రామం వెళుతున్న క్రమంలో బాపట్ల వెళుతున్న కారు ఎదురుగా ఢీకొంది. దీంతో హరిబాబు కిందపడి గాయాలపాలయ్యారు. దీంతో స్థానికుల సమాచారం మేరకు 108వాహనంలో క్షతగాత్రుడిని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

వైభవంగా శేషవాహన సేవ

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చదలవాడ గ్రామంలోని ప్రసిద్ధ శ్రీరఘునాయకస్వామి వారి 240వ వార్షిక కల్యాణ మహోత్సవాలలో భాగంగా రెండవ రోజు మంగళవారం ఉదయం స్వామివార్లకు విశేష అలంకరణలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారికి ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి బలిహరణ, తిరుచ్చి ఉత్సవం నిర్వహించి ప్రత్యేక అలంకరణలో శేషవాహనంపై గ్రామోత్సవం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పేర్నమిట్టకు చెందిన క్రాంతి కోలాట బృందం ప్రదర్శించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకొంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ ఈవో దొంతా అనిల్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పశుసంవర్ధకశాఖ అధికారుల సంఘం నూతన కమిటీ



డీఏహెచ్‌వో బేబీరాణికి బొకేను అందజేస్తున్న కార్యవర్గ సభ్యులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ పశుసంవర్ధకశాఖ ఆఫీసర్స్ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పశుసంవర్ధకశాఖ సమావేశపు హాలులో మంగళవారం జరిగిన ఎన్నికలకు డాక్టర్ టి.మోహన్‌రావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ సీహెచ్.వెంకట్రామిరెడ్డి (ఏడీ , ఐఎస్‌డీపీ, ఒంగోలు), ప్రధానకార్యదర్శిగా కెజెసుధీర్‌బాబు(ఏడీ, ఏవీహెచ్, టంగుటూరు), కోశాధికారిగా ఎన్.శ్రీరాములు (త్రిపురాంతకం), ఉపాధ్యక్షులుగా పి.శ్రీరాములు (ఏడీ, డిప్యూడీ డైరెక్టర్, కందుకూరు), జాయింట్ సెక్రటరీగా బి.బసవశంకరరావు (ఏడీ, ఏవీహెచ్ త్రోవగుంట)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పశుసంవర్ధకశాఖ సంచాలకులు డాక్టర్ బేబీరాణిని కలిసి బొకే అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు.

క్విస్ అధ్యాపకురాలికి డాక్టరేట్



ప్రవీణకు డాక్టరేట్‌ను అందజేస్తున్న సూర్యకల్యాణచక్రవర్తి

ఒంగోలు విద్య, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ కళాశాలలో సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్‌కు చెందిన దాయనేని ప్రవీణ డాక్టరేట్‌ను అందుకున్నారు. చెన్నైలోని భారత్ విశ్వవిద్యాలయం నుంచి ఆమె డాక్టరేట్‌ను పొందారు. డేటా సైన్స్ ఎనాలసిస్ యూజింగ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ ఇన్ మైనింగ్ బయలాజికల్ డేటా అంశంపై ప్రవీణ పరిశోధన చేశారు. భారత్ యూనివర్శిటీ సీఎస్ఈ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ శివరామన్ గైడెన్స్‌లో ఆమె పరిశోధన చేశారు. ఈ సందర్భంగా మంగళవారం డాక్టరేట్ పొందిన ప్రవీణను క్విస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ శ్రీగాయత్రి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమంతరావు, బుజ్జిబాబు పాల్గొన్నారు.

ఏపీటీసీఏ అధ్యక్షుడిగా అజయ్‌కుమార్



అజయ్‌కుమార్

ఒంగోలు విద్య, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్(ఏపీటీసీఏ) జిల్లా నూతన అధ్యక్షుడు గాగేరా అజయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఒంగోలులో ఏపీటీసీఏ రాష్ట్ర నాయకుడు, ఎన్నికల పరిశీలకులు మాంటిస్సోరి ప్రకాష్‌బాబు నూతన అధ్యక్షుడిని ప్రకటించారు. ఐపీపీ కృష్ణసాయి హైస్కూలు కరస్పాండెంట్ పిడుగు జాలిరెడ్డి, ఆంధ్ర హైస్కూలు కరస్పాండెంట్ బి.శ్రీనివాసరావులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. కాగా నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన అజయ్‌కుమార్‌ను పలువురు కరస్పాండెంట్లు అభినందించారు.

వెలిగండ్ల ఎస్ఐగా కృష్ణపావని

ఒంగోలు క్రైం, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): వెలుగండ్ల ఎస్ఐగా జి.కృష్ణపావనిని నియమిస్తూ ఎస్పీ ఏఆర్.దామోదర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె ఒంగోలు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నారు. వెలిగండ్ల ఎస్ఐగా బాధ్యతలు తీసుకోవాలని ఉత్తర్వులలో ఎస్పీ ఆదేశించారు.

వినతులు పెండింగ్ లేకుండా చూడాలి: జేసీ

ఒంగోలు(రూరల్), ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ వినతులు పెండింగ్ లేకుండా చేయాలని జేసీ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

ఉపాధి హామీ కూలీలకు ఊరట

● పెరిగిన రోజువారీ కూలి



సంతనూతలపాడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలు ఉపాధి నిమిత్తం వలస వెళ్లకుండా వారికి పల్లెల్లోనే పనులు కల్పించేందుకు కేంద్రప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేస్తోంది. ఈ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు కేంద్రం స్వల్ప ఊరటనిచ్చింది. వీరికి వేసవిలో ప్రత్యేక భత్యం ఇవ్వనందున ఆలోటును భర్తీ చేసేందుకు దినసరి కూలీ పెంచింది. ఇప్పటివరకు రూ.300 ఇస్తుండగా ఇకపై రూ.307లకు పెంచారు. ఈ పెంపుదల ఈనెల 1వ తేదీ నుంచే అమల్లోకి వచ్చినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. కాగా సంతనూతలపాడు మండలంలో 18 పంచాయతీల్లో 7507 మందికి జాబుకార్డులు జారీచేసినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకం కింద నమోదైన కూలీలు 11,041మంది ఉన్నారు. వీరిలో ప్రస్తుతం 50 శాతం మాత్రమే పనులకు వస్తున్నట్లు సమాచారం. కాగా కూలి ధర పెంపుదల నిర్ణయంతో ఉపాధిపనులకు ఎక్కువగా వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. మూడేళ్ల క్రితం ఫిబ్రవరి నుంచి జూన్ వరకు కూలీలకు 15 నుంచి 30శాతం వరకు వేసవి భత్యం అదనంగా ఇచ్చేవారు. దీనికి తోడు పనుల కోసం తీసుకెళ్లే గడ్డపార, తదితర పరికరాల కోసం, తాగునీరు, మజ్జిగకు సంబంధించి అదనపు భత్యం ఉండేది. ప్రస్తుతం అది ఇవ్వకపోగా, పనిప్రదేశాల్లో వసతులు ఉండటం లేదు. కూలి డబ్బులు కూడా సరిగా ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొలతల ప్రకారం పని చేయాలి

ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇచ్చిన కొలతల ప్రకారం కూలి చెల్లిస్తారు. తక్కువ పనిచేస్తే తక్కువ కూలి దక్కుతుంది. కూలీలకు కూలి డబ్బులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకున్నాం.

- డి.సురేష్‌బాబు, ఎంపీడీవో, సంతనూతలపాడు

మార్కెట్‌కు అనుగుణంగా బేళ్లను తీసుకురావాలి

● బోర్డు ఈడీ విశ్వశ్రీ



కొండపిలో పొగాకు కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఈడీ విశ్వశ్రీ

కొండపి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పొగాకు నాణ్యత దెబ్బతినకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని బోర్డు ఈడీ విశ్వశ్రీ సూచించారు. మార్కెట్‌లో ఏరకం బేళ్లకు డిమాండ్ ఉందో పరిశీలించి అందుకు అనుగుణంగా వేలానికి తీసుకురావాలని కోరారు. మంగళవారం ఆమె కొండపి వేలం కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు. పొగాకు మండెల్లో దెబ్బతినకుండా మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. నోబిడ్స్ లేకుండా బేళ్లను కొనుగోలు చేయాలని కంపెనీల ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు వైస్‌చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, బోర్డు ఇన్‌చార్జి సెక్రటరీ ఎం.లక్ష్మణరావు, వేలం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ పాల్గొన్నారు. అంతకుముందు టంగుటూరులో వేలాన్ని ఈడీ పరిశీలించారు. కార్యక్రమంలో అక్కడి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరలు కల్పించాలి

ఒంగోలు(రూరల్): పొగాకు పంట సాగుకు ఈ ఏడాది ఖర్చులు బాగా పెరిగాయని, అందువల్ల గిట్టుబాటు ధరలు కల్పించాలని బోర్డు ఈడీ విశ్వశ్రీని రైతులు కోరారు. మంగళవారం ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో జరుగుతున్న వేలాన్ని పరిశీలించేందుకు ఈడీ విచ్చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రైతులు మాట్లాడుతూ పొగాకు సాగులో పెట్టుబడులు బాగా పెరిగాయని, అందువల్ల గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. దీనిపై ఈడీ విశ్వశ్రీ మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు వచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్, ఆర్ఎం ఎం.లక్ష్మణరావు, వేలం నిర్వహణాధికారి తులసి, బోర్డు వైస్ చైర్మన్ బొడపాటి బ్రహ్మయ్య, సభ్యులు పొద వరప్రసాదరావు, నాయకులు వడ్డెల వరప్రసాద్, పెనుబోతు సునిల్, చెరుకూరి వాసు, దొడ్డా సీతారామయ్య, చెరుకూరి వాసు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొగాకు రైతు మహిళలు బోర్డు ఈడీని స్వాగతించి శాలువాలతో సన్మానించారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహిళాసెల్ చైర్‌పర్సన్‌గా రజిత

● ఏకగ్రీవంగా ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రజిత

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిలా మహిళావిభాగం చైర్‌పర్సన్‌గా కాట్రగడ్డ రజిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సంఘం కార్యాలయంలో మంగళవారం సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం మహిళావింగ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా రజిత, జిల్లా కన్వీనర్‌గా వనజ, ట్రెజరర్‌గా ప్రసన్న, కో చైర్మన్లుగా శ్రీదేవి, అనుపమ, గురుదేవి, సునీత, కో కన్వీనర్లుగా సుజాత, నాగమణి, త్రివేణి, ప్రసన్న, జి.సుజాత, ప్రతిమలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రజిత మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల్లోని మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా కృషి చేస్తామని చెప్పారు. తనను జిల్లా చైర్‌పర్సన్‌గా ఎన్నుకోవడం పట్లపై ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లాకార్యదర్శి వరకుమార్, శ్రీనివాస్, మోటార్ శ్రీనివాసరావు, సురేష్‌బాబు, గోపీకృష్ణ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

● సీపీఎం నాయకుల డిమాండ్



పేర్నమిట్టలో నిరసన తెలుపుతున్న నాయకులు, గ్రామస్థులు

సంతనూతలపాడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ పేర్నమిట్ట పశువైద్యశాల సెంటర్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిరసన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు, అన్ను సుబ్బారావు, డి.చినబాబు, రామక్రిష్ణ, కోటేశ్వరరావు, వీరనారాయణ పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు తక్షణమే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మద్దిపాడు బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్‌పై రూ.50లు అదనంగా పెంచి ప్రజలపై భారం వేసిందని ఆరోపించారు. ఉచిత సిలిండర్ పథకం ద్వారా ఇస్తున్న డబ్బులు సగం మంది లబ్ధిదారులకు అందలేదని ఆయన విమర్శించారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తక్షణమే ఉపసంహరించాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి, ఉబ్బా వెంకటేశ్వర్లు, కాసిం, వెంకటరామిరెడ్డి, అనంతలక్ష్మి, కాకుమాను సుబ్బారావు, రామాంజనేయులు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో..

ఒంగోలు కలెక్టరేట్ : పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం జరిగిన ఐద్వా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ధరల భారాలను తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన పాలకులు మోసం చేస్తున్నారని విమర్శించారు. పెంచిన గ్యాస్‌ధరను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. నిత్యం పెరుగుతున్న ధరలతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. మరో వైపు నిత్యావసర ధరలు, ఇంకొక వైపు విద్యుత్ చార్జీల పెంపు వంటి కారణాలతో ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి వెంటనే పెంచిన ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మి, ఎన్.మాలతి, ఎస్‌కే.నాగూర్‌బీ, కె.రాజేశ్వరి, కె.లక్ష్మీప్రసన్న, బి.రాజ్యలక్ష్మి, బి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లు యూనిఫాం ధరించాలి



ఆశ కార్యకర్తలకు యూనిఫాంను అందజేస్తున్న వైద్యశాఖ ఉద్యోగులు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లు తప్పనిసరిగా యూనిఫాంలో విధులు నిర్వర్తించాలని డాక్టర్ సుందరప్రసాద్ పేర్కొన్నారు. ఒంగోలు మండలం కరవది ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఆశా వర్కర్లకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఆశా వర్కర్లు బాధ్యత ఎంతో ఉన్నదన్నారు. బాధ్యతలు క్రమం తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. ఈ సందర్భంగా వైద్యశాలలో గర్భవతికి రక్తం అవసరం కావడంతో వెంటనే డాక్టర్ సుందరప్రసాద్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న డాక్టర్ సుందరప్రసాద్

కార్లు ఢీకొని ఒంగోలువాసి దుర్మరణం

● 11 మందికి గాయాలు

నల్లగొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, 11 మందికి తీవ్రగాయాలయ్యాయి. నల్లగొండ టూ టౌన్ ఎస్ఐ ఎర్ర సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా దాచేపల్లి నుంచి అద్దె కారులో షేక్ ఫిరోజ్, అతడి కుటుంబ సభ్యులు హజ్ యాత్రకు బయలుదేరారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్తున్నారు. 11.30 సమయంలో నల్లగొండ పట్టణంలోని ఎ్రపీ కాలనీలోని పానగల్లు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో హైదరాబాద్ వైపు నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న కారు ఎదురెదురుగా ఢీకొని రెండు వాహనాలు పల్టీలు కొట్టాయి. ఈ ఘటనలో రెండు వాహనాల్లో ఉన్న వారికి బలమైన గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న 108 వాహనాలల్లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. హైదరాబాద్‌లోని బోడుప్పల్ నుంచి ఒంగోలుకు వెళ్తున్న కారులో ప్రయాణిస్తున్న పి.రఘురామమూర్తి(80) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఈ ప్రమాదంలో రఘురామమూర్తి సతీమణి స్వరాజ్యలక్ష్మి, కారు నడుపుతున్న ఆయన కుమారుడు అనిల్‌కు గాయాలయ్యాయి. రఘురామమూర్తి కుటుంబ సభ్యుల స్వస్థలం ఒంగోలు. ఇక్కడ పూజలు నిర్వహించేందుకు వెళ్తున్నట్లు తెలిసింది. అదేవిధంగా హజ్ యాత్రకు బయలుదేరిన షైమూదేకి తీవ్ర గాయాలు కావడం తో పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

రీసర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వే సమస్యలు, సిటిజన్స్ సర్వీసెస్, పీజీఆర్ఎస్ పరిష్కారంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సీసీఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి సూచించారు. మంగళవారం సీసీఎల్ఏ కార్యాలయం నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జిల్లాలో రీ సర్వే ప్రక్రియను పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్ దరఖాస్తులు ఎస్ఎల్ఏలోపు వెళ్ళకుండా గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్ల సమావేశంలో రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. అందుకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని చెప్పారు. పీజీఆర్ఎస్ఏ పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉందన్నారు. గ్రామ స్థాయిలో నీటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేషు, అధికారులు గౌస్‌బాషా, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

21న మోడల్ ఎంసెట్ : ఎస్ఎఫ్ఐ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 21న ఎంసెంట్ మాక్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరస్వామి తెలిపారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.వినోద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ విద్యారంగం సమస్యలపై ఒక వైపు పోరాటాలు చేస్తూనే మరో వైపు విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు స్పోకెన్ ఇంగ్లీషు, కెరీర్ గైడెన్స్ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఎంసెట్ రాసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్ష పట్ల అవగాహన పెంచేందుకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఒంగోలు క్రైం, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): రైలులో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. హౌరా ఎక్స్‌ప్రెస్‌లో మంగళవారం రాత్రి 12.15 సమయంలో ఒంగోలు రైల్వేస్టేషన్‌లో ఆగింది. జనరల్ బోగీలో సుమారు 40 ఏళ్ళ వయస్సు గల వ్యక్తి మృతి చెందడంతో మృతదేహాన్ని కిందకు దించి కేసు నమోదు రిమ్స్‌కు తరలించారు. మృతుడి వివరాలు లభించలేదని రైల్వే ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9440627647 సెల్ నంబరుకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

విద్యుత్‌శాఖ విజిలెన్స్ తనిఖీలు

● రూ.6లక్షల జరిమానా

ఒంగోలు క్రైం,ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.6లక్షలు జరిమానా విధించినట్లు ఈఈ మాకినేని హరిబాబు తెలిపారు. నగరంలోని గాంధీరోడ్డు, మంగమూరు డొంక, రాజీవ్‌నగర్, బండ్లమిట్ట తదితర ప్రాంతాలలో 40 బృందాలుగా ఏర్పడి 3020 సర్వీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాల్‌ప్రాక్టిస్ కింద 22 కేసులు నమోదు చేసి రూ95వేలు, అదేవిధంగా అదనపు లోడ్‌కు సంబంధించి 97 సర్వీసులకు రూ5,03,750 జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ దాడులలో ఈఈ టి.హైమావతి, డీఈ పాండురంగారావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మద్దిపాడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం గాజులపాలెంకు చెందిన పాత్రికేయుడు తెనాలి శేషగిరిరావుకు జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శేషగిరిరావు తల్లి క్యాన్సర్‌తో బాధపడుతుండగా అతని కుటుంబ పరిస్థితి బాగోలేనందున నగదును దాత నరహరి సాంబయ్య చేతులమీదుగా అందజేసినట్లు సంజీవకుమార్ తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి తంజావూరి శ్రీనివాసమూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యుడు లింగిశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఓంప్రకాష్‌గుప్తాకు నివాళి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ సంస్థలో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ప్రభుత్వ పింఛన్ సౌకర్యం కల్పించిన మహనీయుడు ఓంప్రకాష్‌గుప్తా అని పలువురు వక్తలు కొనియాడారు. ఒంగోలులోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఓప్రకాష్‌గుప్తా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్ఎఫ్‌టీయూ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వి.రామలింగం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు కర్లపూడి అంజయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.నాగేశ్వరరావు, అబ్దుల్‌రౌఫ్, బాలసుబ్రహ్మణ్యం, వెంకటయ్య, పెండ్యాల ఆంజనేయులు తదితరులు ఆయన సేవలను కొనియాడారు. అంతకు ముందు ఓంప్రకాష్‌గుప్తా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

ఒంగోలు క్రైం, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం మిషన్‌లో నగదు దొంగిలించేందుకు దొంగలు విఫలయత్నం చేశారు. ఈ సంఘటన ఒంగోలు నగరం దిబ్బలరోడ్డులో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం పగుల గొట్టేందుకు దొంగలు ప్రయత్నం చేశారు. అయితే నగదు ఉన్న బాక్స్ తెరుచుకోక పోవడంతో పరారీ అయారు. నిత్యం పోలీసులు గస్తీ తిరిగే కర్నూల్‌రోడ్డుకు దగ్గరలో ఉన్న చోట ఏటీఎంలో దొంగలు చోరీకి ప్రయత్నం చేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

నిత్యావసర వస్తువుల వితరణ



సామగ్రిని అందజేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో మహిళాభ్యుదయ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శక్తిసదన్‌కు ప్రీతం వర్షిత హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ నిర్వాహకులు కొమ్మి రమణయ్య, రాజేశ్వరి దంపతులు మంగళవారం నిత్యావసర సరుకులు, సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. ఈ సందర్భంగా నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో హోమ్ నిర్వాహకురాలు తేళ్ల అరుణ, వంకాయలపాటి సత్యవతి, సిటిజన్ ఫోరం అధ్యక్షుడు కొల్లా మధుబాబు, అసిస్ట్ డిప్యూటీ డైరెక్టర్ వడ్డెంపూడి సుజాతరావు, గాయకులు నూకతోటి శరత్‌బాబు, బీరం అరుణ తదితరులు పాల్గొన్నారు.

రుణాల పేరుతో మోసం చేసిన ఇరువురిపై కేసు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రుణాలు ఇప్పిస్తామంటూ, వ్యాపారాలలో పెట్టుబడి పెడితే బారీగా లాభాలు వచ్చేలా చేస్తామని పలువురిని నమ్మించి నగదు కాజేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శ్రీకాంత్ తెలిపారు. నాగులుప్పలపాడు గ్రామానికి చెందిన తండ్రీకుమార్తెలు కోటి విజయ్‌కుమార్, కోటి స్మైలీ పలువురి వద్ద నుంచి పీఎంఈజీపీ రుణాలు ఇప్పిస్తామని, బాతుల వ్యాపారం పేరుతో నమ్మబలికి పలువురు నుంచి రూ.లక్షల్లో నగదును వసూలు చేశారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

అవి.. ఇవి

వాటర్‌క్యాన్ల అందజేత

గిద్దలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్ఫూర్తి వెల్ఫేర్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలకు యువ ప్రగతిపథం స్వచ్ఛంద సంస్థ ప్లాస్టిక్ వాటర్ క్యాన్లను అందజేసింది. అలాగే పండ్లు, బ్రెడ్లు, మజ్జిగ ప్యాకెట్లను పిల్లలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు పి.వేణుగోపాల్, సభ్యులు సిద్ధయ్య, రత్నం, తదితరులతోపాటు పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులు తీసుకున్న శిక్షణను సద్వినియోగం చేయాలని జిల్లా డైట్ కార్యాలయం పర్యవేక్షకులు దామా సుబ్బారావు అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఒంగోలులో నిర్వహించిన ఎస్ఎల్‌డీపీ శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయుల నుంచి శిక్షణకు సంబంధించిన ఫీడ్‌బ్యాక్‌ను ప్రశ్నావళి ద్వారా సేకరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు రాందాస్‌నాయక్, కె.శర్వాణి తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధుల సర్వే సమగ్రంగా నిర్వహించాలి

- డీఆర్‌డీఏ పీడీ నారాయణ


వేములకోటలో సర్వే నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ పీడీ నారాయణ

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్వయంసహాయక సంఘాల సభ్యుల జీవనోపాధుల ప్రణాళిక సర్వే ఎన్యుమరేటర్లు, సిబ్బంది కలిసి సమగ్రంగా నిర్వహించాలని డీఆర్‌డీఏ వెలుగు పీడీ నారాయణ కోరారు. మండలంలోని వేమలకోట గ్రామంలో మంగళవారం సాయంత్రం సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 45 వేల సంఘాలలోని 4.50 లక్షల మంది మహిళా సభ్యుల నుంచి సమాచారం సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం పిచ్చయ్య, ఎల్‌సీనాగభూషణం, సీసీ మనోకుమారి, వీవోఏలు పాల్గొన్నారు.

రాళ్లవాగు ఆక్రమణల పరిశీలన


రాళ్లవాగు సమీపంలో పార్కును పరిశీలిస్తున్న తహసీల్దార్

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పుల్లలచెరువు రోడ్డులోని రాళ్లవాగుకు సంబంధించి సర్వేనంబరు 28లో ఆక్రమణలను తొలగించి ఆక్రమదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు సోమవారం ఎర్రగొండపాలేనికి చెందిన తూమాటి సాలమ్మ, గుర్రం లక్ష్మీనారాయణలు 'మీకోసం'లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కలెక్టర్ మార్కాపురం సబ్‌కలెక్టర్‌ను విచారణకు అదేశించారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు ఎర్రగొండపాలెం తహసీల్దారు శైలేంద్రకుమార్, వీఆర్‌వో దేవదానం, సిబ్బంది, ఫిర్యాదుదారులతో కలసి మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆక్కడ పరిశీలించిన ఆంశాలను జిల్లా అధికారులకు తెలియజేయన్నుట్లు ఆయన తెలిపారు. బుధ, గురువారాలలో హుడాపార్క్‌కు సంబందించిన అధికారులు వస్తారన్నారు.

రైల్వేలైన్‌ను పరిశీలించిన జేసీ


రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

పొదిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల మేరకు పొదిలి గ్రామంలోని నడికుడి-శ్రీకాలహస్తి రైల్వేలైన్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. సర్వేనెంబర్ 1059-2ఏ, 1067-2ఎఫ్, 1067-3 లోని భూములకు చెందిన రికార్డులను, హద్దులను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్‌డీవో కేశవర్ధన్‌రెడ్డి, పొదిలి తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికి ప్రజలు కటకట

- పశ్చిమ ప్రకాశంలో పడిపోయిన భూగర్భ జలాలు
- ట్యాంకర్లనే ఆశ్రయిస్తున్న ప్రజలు
- మే నాటికి మరింత పెరగనున్న సమస్య


తర్లుపాడులో బోరు నీటిని ట్యాంకర్‌తో పట్టుకుంటున్న రైతు


సుంకేసులలో నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు


వై.పాలెం మండలం తమ్మడపల్లిలో నీటిని పట్టుకున్న గ్రామస్థులు

గిద్దలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నీటిసమస్య నానాటికి తీవ్రమోతోంది. ఇప్పటికే 10కిపైగా గ్రామాలలో వివిధ కారణాలతో నీటి సమస్య నెలకొంది. భూగర్భజలాలు రోజురోజుకు అడుగంటుతుండడంతో రానున్న రోజుల్లో 30కి పైగా గ్రామాల్లో నీటిసమస్య ఎదురయ్యే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో నీటిసమస్య తీవ్రత లేనప్పటికీ, రాచర్ల రోడ్డులోని హోసన్న మందిర్ రోడ్డులో నీటిసమస్య కనిపిస్తోంది. మున్సిపాలిటీకి చెందిన రెండు ట్యాంకర్లు నిత్యం ఆ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి నీటిని అందిస్తున్నాయి. మండలంలోని ముండ్లపాడులో సైతం భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. సింగిల్ ఫేజ్ మోటార్లు ఉన్న బోర్లకు మినహా త్రీఫేజ్ మోటార్లకు నీరు రాని పరిస్తితి నెలకొంది. ఈ గ్రామ పరిధిలో 900 అడుగులు వేస్తే ఒక్క అంగుళం నీరు కూడా పడని బోర్లు చాలా ఉన్నాయి. ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీరు ఎక్కకపోవడంతో బోర్ల వద్దే అధికారులు నీటిని అందిస్తున్నారు. ప్రస్తుతానికి ఇబ్బంది లేనప్పటికీ వేసవి తీవ్రత దృష్ట్యా భూగర్భజలాలు మరింత లోతుకు పడిపోతే 5 వేల జనాభా ఉన్న ఈ గ్రామంలో ప్రజలు నీటికి పాట్లుపడాల్సి ఉంటుంది. కొమరోలు మండలం తాటిచెర్లమోటులో నీటి సమస్య ఉంది. కొమరోలు, రెడ్డిచెర్ల, ఇడమకల్లు, దద్దవాడ గ్రామాల పరిధిలో తరచూ బోరుమోటార్లు రిపేరుకు వస్తుండగా నిధుల కొరత కారణంగా మరమ్మతులలో జాప్యం జరుగుతోంది. రాచర్లలోని బస్టాండ్ సమీపంలో బోరు మోటారు పనిచేయకపోవడంతో గత రెండు, మూడు రోజులుగా సుమారు 200 కుటుంబాలు నీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి. అలాగే ఆకవీడు, అర వీటికోటలో కూడా భూగర్భజలాలు వేగంగా పడిపోతుండడంతో నీటి లభ్యత తగ్గిపోతోంది. బేస్తవారిపేట మండలం కొత్తపల్లి ఎస్సీకాలనీలో నీటిసమస్య తాండవిస్తోంది. సమీప పొలాల్లోని రైతుకు చెందిన వ్యవసాయ బోరు నుంచి తాత్కాలికంగా అధికారులు నీటిని అందిస్తున్నారు. అర్ధవీడు మండలం మాగుటూరు సమీపంలోని కృష్ణానగర్‌లో నీటిసమస్య నెలకొనగా పంచాయతీ అధికారులు ట్యాంకర్ ద్వారా ప్రజలకు నీటిని అందిస్తున్నారు. వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామం కావడంతో అక్కడ కొత్తగా బోర్లు వేసేందుకు నిబంధనలు అడ్డువస్తున్నాయి. ఇక కృష్ణానగర్ ప్రజలు నీటిసమస్యను ఎదుర్కొంటున్నారు. రంగాపురం, మాగుటూరు తాండా, తదితర గ్రామాలలో కూడా మోటార్ల రిపేరుకు వస్తుండడంతో నీటిసమస్య కనిపిస్తోంది. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు వెళ్లకపోతే మరో రెండు వారాల్లోనే 30కి పైగా గ్రామాలలో నీటిసమస్య తలెత్తే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

కంభం : ప్రస్తుత వేసవికాలంలో రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయి. అర్ధవీడు మండలంలోని రంగాపురం, మాగుటూరు, వెలగలపాయ గ్రామాలలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కృష్ణానగర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామాలలో భూగర్భజలాలు అడుగంటడంతో తాగునీటిని సరఫరా చేసే మోటార్లు రిపేరుకు వచ్చాయి. వాటిని రిపేరు చేయించేందుకు సర్పంచులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల వద్దకు వెళ్లి బిల్లులు పాస్‌చేయాలని కోరినా సంబంధిత అధికారులు స్పందించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల జరిగిన అర్ధవీడు మండల సర్వసభ్య సమావేశంలో కూడా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వేసవిలో ఎక్కడైనా తాగునీటి సమస్య వస్తే సర్పంచులు, అధికారులు తక్షణం స్పందించి నీటి సమస్య తీర్చేందుకు మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. అయినా అధికారులు స్పందించకపోవడం గమనార్హం.

మార్కాపురం రూరల్ : మండలంలోని గోగులదిన్నె గ్రామంలోని యల్లమ్మ బజారులో, ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. నీటి కోసం పనులు మానుకుని రోజంతా ఓ మనిషి ఇంటి వద్ద ఉండి వేరే ప్రాంతానికి వెళ్లి నీటిని తీసుకురావాల్సి వస్తోంది. మండలంలోని నాయుడుపల్లి గ్రామంలో రామాలయం పక్క బజారులో బోరు మోటార్ మరమ్మత్తులకు గురికావడంతో గ్రామ ప్రజాప్రతినిధులు అధికారులు పట్టించుకోలేదు. దీంతో ప్రజలు నీటి కోసం మరో ప్రాంతానికి ప్రజలు వెళుతున్నారు. మండలంలోని గజ్జలకొండ, పడమటిపల్లి, పెద్దనాగులవరం, తిప్పాయపాలెం, బిరుదులనరవ గ్రామాలలో తాగు నీటి సమస్య నెలకొంది.

తర్లుపాడు: మండలంలోని పోతలపాడు, గానుగపెంట, కేతగుడిపి, మేకలవారిపల్లెలో మంచినీటి సమస్య నెలకొంది. ప్రస్తుతం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పోతలపాడు, గానుగపెంటలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. గానుగపెంటలో ఎక్కువగా మంచినీటి సమస్య నెలకొనడంతో అధికారులు తోలుతున్న 10 ట్రిప్పులు సరిపోక రైతులు సొంత ట్యాంకర్ల ద్వారా దాహార్తిని తీర్చుకుంటున్నారు. పోతలపాడు, గానుగపెంటలో ఎక్కువగా పశుపోషణపై ఆధారపడి జీవనం వెళ్లదీస్తున్నారు. పొలాల్లోనే బోర్ల ద్వారా గొర్రెలు, మేకలకు నీరు అందిస్తున్నారు.

పొదిలి : వేసవి సందర్భంగా మండలంలోని కొండాయిపాలెం, జువ్వలేరు, ఈగలపాడు గ్రామాలలో నీటిఎద్దడి అధికంగా ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. అదే విధంగా కొండాయిపాలెం 7 ట్రిప్పులు, ఈగలపాడు 6 ట్రిప్పులు, జువ్వలేరు గ్రామాలలో 4 ట్రిప్పు లు ట్యాకర్ నీటిని అధికారులు తోలిస్తున్నారు. మూగచింతల, అక్కచెరువు, సూదనగుంట, దొండ్లేరు, సలకనూతల గ్రామాల్లో ఈ నెలాఖరుకు తాగునీటి సమస్య రావచ్చని ట్రాన్స్‌పోర్టేషన్ చేసేందుకు ఎస్టిమేట్స్ కలెక్టర్‌కు పంపినట్లు అధికారులు తెలిపారు.

పెద్దారవీడు : మండలంలో కరువు తాండవిస్తోంది. ఇప్పటికే తాగునీటి సమస్య ప్రారంభమైంది. భూగర్భజలాలు అడుగంటాయి. భూమిలోకి నీటి కోసం సుమారు 1000 అడుగుల మేర బోరుతవ్వినా, చుక్క నీరు కూడా పడని పరిస్థితి నెలకొంది. ఎండాకాలం ప్రారంభంలోనే మండలంలోని అన్ని గ్రామాలలో తాగునీటి ఎద్దడి ప్రారంభమైంది. రానున్న రోజుల్లో నీటి సమస్య తీవ్రరూపం దాల్చనుంది.

మండలంలోని వెలిగొండ ప్రాజెక్ట్ పునరావాస గ్రామాలైన సుంకేసుల, గుండంచర్ల, కలనూతలలలో, గుంటూరు-కర్నూలు జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పోతంపల్లి, చాట్లమడ అగ్రహారం, రేగుమానుపల్లి గ్రామాలలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉంది. పెద్దారవీడు, దేవరాజుగట్టు గ్రామాలలో నీటిలభ్యత ఉండటంతో పంచాయతీ కొళాయిల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు.

అరకొర ట్యాంకర్లతో అవస్థలు

కొనకనమిట్ల : మండలంలోని పలు గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టినప్పటికీ, తాగునీటి సమస్య రోజురోజుకు జఠిలమోతోంది. మండలంలో గొట్లగట్టు 8, సిద్ధవరం 8, వెలిగండ్ల 6, గనివినపాడులో 8 ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెప్పారు. గొట్లగట్టు గ్రామంలో తీవ్రనీటి సమస్య ఉంది. ప్రస్తుతం గ్రామంలో 8 ట్రిప్పులు నీటిని సరఫరా చేస్తుండగా, ఆ సంఖ్య 16కు పెంచాలని గ్రామస్థులు కోరుతున్నారు. బస్టాండ్ సమీపంలోని ఎస్సీ కాలనీ, పూర్తిగా ట్యాంకర్ నీటిపై ఆధారపడాల్సి వస్తోందని కాలనీవాసులు తెలిపారు. అంతే కాకుండా ఏప్రిల్ నెల చివరనాటికి తాగునీటి సమస్య మరింత జఠిలం అవుతుందని, అధికారులు ముందస్తు ప్రణాళికలు లేకపోతే తీవ్ర నీటిఎద్దడి ఎదుర్కొనే అవకాశం ఉంది. వేసవిని దృష్టిలో ఉంచుకొని అధికారులు, నాయకులు అప్రమత్తంగా ఉండాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : పట్టణంలో సాగర్ నీరు వస్తున్నప్పటికీ అన్ని ప్రాంతాలకు సరఫరా కావడం లేదు. పలు వీధులలో కొంత మంది మోటార్ల ద్వారా పైపుల్లోని నీటిని తోడేస్తున్నారు. దీంతో దిగువన ఉన్న సామాన్యులకు నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. వేసవిలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మండలంలోని తమ్మడపల్లి, బోయలపల్లి, రేగులపల్లి, అమానిగుడిపాడు, గుర్రపుశాల, మిల్లంపల్లి, కాశికుంట తండా, పిల్లికుంట తండా, బట్టువానిపల్లె, చిన్న కొలుకుల తదితర గ్రామాలలో ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి జాట్సన్‌పాల్ తెలిపారు.





కంభంలో ట్యాంకర్లతో నీటిని పట్టుకుంటున్న మహిళలు, గిద్దలూరులో హోసన్న మందిర్‌వద్ద, మార్కాపురం మండలంలో గోగులదిన్నె నీటి కోసం ప్రజల ఎదురుచూపులు, దోర్నాలలో ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలు

ఉపాధి సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలి

డ్వామా పీడీ జోసఫ్‌కుమార్


ఆడిట్ నిర్వహిస్తున్న జోసఫ్‌కుమార్

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది పారదర్శకంగా పనులు చేయాలని, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో బండారు శ్రీనివాసులు అధ్యక్షతన 2023-24 సంవత్సరానికి సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిట్ నిర్వహించిన సీఆర్‌పీలు పనులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. అయితే ఈ సమయంలో ఉపాధిహామీ పథకం ఎఫ్‌ఏలు, టీఏల నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో పీడీ మాట్లాడుతూ ఇచ్చిన పనులు సక్రమంగా చేస్తే ఇలా అధికారుల ముందు నటించాల్సిన అవసరం ఉండదన్నారు. పద్ధతి మార్చుకోకుంటే శాశ్వతంగా ఇంటికి వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. 2023-24 సంవత్సరానికిగాను మండలంలో మొత్తం సుమారు రూ.29 కోట్లవరకు పనులు జరిగి నట్లు ఆయన తెలిపారు. అందులో ఎక్కువగా పూడికతీతలలో కొలతలు తేడా ఉందని అలాగే వివిధ రకాల పండ్లతోటలు లేక పోవడం, వలంటీర్లకు, అంగన్వాడీ ఆయాలకు, ఇతర ప్రాంతాలలో ఉన్నవారికి, మృతి చెందిన వారికి మస్టర్ పేమెంట్ చేసినట్లు గుర్తించారు. కొన్ని పేమెంట్లకు సీవో, ఏపీవో సంతకాలు లేకుండా పేమెంట్ చేసినట్లు గుర్తించారు. బోయలపల్లి గ్రామంలో అయితే ఏకంగా మస్టర్‌ను కొట్టేసి మరీ, సుమారు రూ.44వేల పేమెంట్ చేసినట్లు గుర్తించారు. అలాగే అదేగ్రామంలో రైతుల వివరాలు తెలియకుండానే పనులు చేసి పేమెంట్ చేశారు. మండలం మొత్తం మీద ఈజీఎస్ రికవరీ రూ.4.95 లక్షలు వేసినట్లు ఆయన తెలిపారు. అలాగే పంచాయితీరాజ్‌కు సంబందించి రికార్డులు ఇవ్వకపోవడంతో అందుకు సంబందించి మొత్తం రూ.2,38,675 రికవరీ ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ తొకనేని వెంకటేశ్వర్లు, ఏపీవో శైలజ, ఐటీడీఏ ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్ల బలప్రదర్శన పోటీల విజేత అక్కలరెడ్డిపల్లె

శ్రీరామనవమి సందర్భంగా ఏర్పాటు

కంభం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కంభం మండలం లింగోజీపల్లి గ్రామంలో ఉపదేశ రామస్వామి శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మంగళవారం జరిగిన ఆరుపండ్ల విభాగం ఎడ్లపోటీల్లో గిద్దలూరు మండలం అక్కలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన దక్షిత్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి ఎడ్లజత 4876 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.40 వేలు గెలుచుకున్నాయి. అర్ధవీడు మండలం గన్నేపల్లికి చెందిన దూదేకుల కాశింవలి ఎడ్లు 4590 అడుగుల దూరం బండను లాగి ద్వితీయ స్థానం రూ.30వేలు, పెద్దారవీడు మండలం పైడిపాడుకు చెందిన ఆరంరెడ్డి వెంకటలక్ష్మమ్మ ఎడ్లు 4118 అడుగుల దూరం బండను లాగి మూడవ స్థానం రూ.20వేల నగదు, కనిగిరి గ్రామానికి చెందిన సానెకొమ్ము శ్రీనివాసరెడ్డి ఎడ్లు 4015 అడుగుల దూరం బండను లాగి 4వ స్థానం రూ.10వేలు, కంభం మండలం లింగోజీపల్లికి చెందిన రావూరి లక్ష్మీనారాయణ ఎడ్లు 3987 అడుగుల దూరం బండను లాగి 5వ స్థానం రూ.5వేల నగదు, బేస్తవారిపేట మండలం వంగపాడుకు చెందిన కత్తి రాజు ఎడ్లు 3986 అడుగుల దూరం బండను లాగి 6వ స్థానం రూ.3వేల నగదు గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎడ్ల యజమానులను అభినందించారు.

భక్తులకు మెరుగైన సేవలు అందించాలి

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

రాచర్ల (గిద్దలూరు), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మెరుగైన సేవలు అందించే ఏర్పాట్లను ప్రతిఒక్కరూ తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కోరారు. ఈ నెల 12వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం దేవాలయం వద్ద సమీక్ష నిర్వహించారు. దేవాదాయ, పోలీసు, అటవీ, రెవెన్యూ, రవాణా, ఫైర్, తదితర శాఖల అధికారులతోపాటు దేవస్థాన కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు, వివిధ కులసంఘాల ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వేల సంఖ్యలో భక్తులు వస్తారు కావున దైవదర్శనం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దైవదర్శనాన్ని చేయించాలని సూచించారు. తాగునీటి వసతులు ఏర్పాట్లు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల వద్ద, కల్యాణం వద్ద, తెప్పోత్సవం వద్ద ఎలాంటి తోపులాటలు జరుగకుండా ఎక్కడికక్కడ బారికేట్లు ఏర్పాటు చేయాలన్నారు. బస్సులలో, ఇతర వాహనాల్లో బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే వారిని పార్కింగ్ ప్లేస్ నుంచి దేవస్థానం వరకు ఉచిత ఆటో సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. ప్రతి విషయానికి కమిటీని వేసుకుని కమిటీల ద్వారా పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రామకోటయ్య, ఎస్సై కోటేశ్వరరావు, ఇఒ నాగయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలు సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

గిద్దలూరుటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రైతులు చిక్కుడు పంట సాగు చేసేందుకు సిద్ధపడుతున్నారని, విత్తనాల కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో వై.విజయభాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్సు పొందిన డీలర్ల వద్ద విత్తనాలు రైతులు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. ఒకవేళ మొలకశాతం తక్కువగా వచ్చినపుడు గాని, పూత దశలో పూత రాకపోయినా, కాయలు సరిగా రాకపోయినా సంబంధిత డీలర్ మీద చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. లైసెన్సు పొందిన డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి విత్తనాలు కొనాలన్నారు. ఎవరైనా రసీదు ఇవ్వని యెడల తన దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

- రూ. 69,125 నగదు, ద్విచక్రవాహనాలు స్వాధీనం

పెద్దారవీడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి నగదు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్న ఘటన మంగళవారం తెల్లవారుజామున మండలంలోని గుండంచర్లలో చోటు చేసుకుంది. ఎర్రగొండపాలెం సీఐ ప్రభాకరరావు, ఎస్సై అనిల్ కుమార్, ఎస్‌బి ఎస్సై మాల్యాద్రి, సిబ్బంది దాడులు నిర్వహించి ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.69,125లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రీసర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వే సమస్యలు, సిటిజన్స్ సర్వీసెస్, పీజీఆర్ఎస్ పరిష్కారంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సీసీఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి సూచించారు. మంగళవారం సీసీఎల్ఏ కార్యాలయం నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జిల్లాలో రీ సర్వే ప్రక్రియను పటిష్ఠంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్ దరఖాస్తులు ఎస్ఎల్ఏలోపు వెళ్లకుండా గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్ల సమావేశంలో రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. అందుకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని చెప్పారు. పీజీఆర్ఎస్ఏ పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉందన్నారు. గ్రామ స్థాయిలో నీటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.


నాలుగు రోడ్ల కూడలిలో ప్రమాదకరంగా ఉన్న వాల్

ప్రమాదకరంగా నీటి వాల్

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పంచాయితీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు భయపడుతూ తిరాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణంలోని ఎర్రగొండపాలెం నుంచి వీరభద్రాపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ఇజ్రాయిల్‌పేటకు, పోస్టాపీసు వెళ్లడానికి ఇదే ప్రధాన కూడలి. ఇక్కడ దారి మధ్యలో నీటి వాల్వ్ ఉండడంతో ప్రమాదభరితంగా మారింది. ఇక్కడ ఇటీవల మరమ్మతులు చేసిన అధికారులు మరమ్మత్తులు చేసి దానిని పూడ్చకుండ అలాగే వదిలేశారు. దీంతో ప్రమాద భరితంగా మారింది. తక్షణమే గుంతను పూడ్చాలని ప్రజలు వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయితీ కార్యదర్శిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

అస్తవ్యస్తంగా మంచినీటి సరఫరా

- పనిచేయని ఫిల్టర్‌బెడ్లు
- కాలంచెల్లిన పైపులైన్లు
- తరచూ మరమ్మతులు
- పలుగ్రామాలకు సక్రమంగా అందని మంచినీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

దర్శి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): దర్శి ఎన్‌ఏపీ రక్షిత మంచినీటి పథకం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఎంతో కాలంగా ఫిల్టర్‌బెడ్లు మరమ్మతులకు నోచుకోలేదు. గ్రామీణ ప్రాంతాలకు రావాటర్ విడుదల చేస్తున్నారు. సుమారు 45 సంవత్సరాల క్రితం నిర్మించిన పైపులైన్లు కాలం చెల్లిపోవటంతో సామర్థ్యం కోల్పోయి తరచూ పగిలిపోతున్నాయి. ఓవర్‌హెడ్ ట్యాంకులు కూలేదశకు చేరాయి. దీంతో మంచినీటి సరఫరాకు తీవ్ర ఆటంకం కల్గుతుంది.

దర్శి ఎన్‌ఏపీ మంచినీటి పథకం ద్వారా 120 గ్రామాలకు నీటిని సరఫరా చేయాల్సి ఉంది. అతిపెద్ద ప్రాజెక్టు అభివృద్ధి గురించి గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో అధ్వానంగా మారింది. ఫిల్టర్‌బెడ్లు ఎంతోకాలంగా మరమ్మతులు చేయక ఇసుక మట్టిగా మారిపోయింది. నిధులు లేక ఫిల్టర్‌బెడ్లు అలాగే ఉంచారు. వేసవి ప్రారంభమైనందున అధికారులు అప్రమత్తం కాకపోతే తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చే పరిస్థితి ఉంది. దర్శి ప్రాంతంలో కోర్లమడుగు, కృష్ణాపురం, త్రిపుర సుందరీపురం, సామంతపూడి, నిమ్మారెడ్డిపాలెం తదితర గ్రామాలకు సక్రమంగా మంచినీరు అందటం లేదు. ఆప్రాంతంలో పాత పైపులైన్లు దెబ్బతినటంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొత్త పైపులైను నిర్మాణం చేస్తున్నారు. ఎన్‌ఏపీ చెరువులో నిండుగా నీరు కనిపిస్తున్నప్పటికీ గత 40ఏళ్లుగా పూడిక తీయకపోవటంతో నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. శివారు గ్రామాలకు నీరు చేరటం లేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పథకం అభివృద్ధికి జిల్లా అధికారులు రెండుసార్లు పరిశీలించారు. వీలైనంత త్వరలో ఫిల్టర్‌బెడ్లు మరమ్మతులకు, పైపులైన్ల పునర్నిర్మాణానికి నిధులు విడుదల చేసి తాగునీటి సమస్య నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



కురిచేడు: నిరుపయోగంగా పొట్లపాడు మంచినీటి పథకం



దర్శి: దెబ్బతిన్న పైపులైన్ల మరమ్మతులకు గుంత తవ్వుతున్న సిబ్బంది



దొనకొండ: కొచ్చెర్లకోటలో ట్యాంకర్‌ను చుట్టుముట్టి నీళ్లు పట్టుకుంటున్న ప్రజలు

దొనకొండలో నీటి సమస్య తీవ్రం

దొనకొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్య తీవ్రమైంది. గ్రామాలకు సాగర్ జలాలు సరఫరా చేసే చందవరం-1 స్టోరేజీ నిర్మాణం చేపట్టి దాదాపు 40 ఏళ్లు గడుస్తుండటంతో పైప్ లైన్ తరచూ పగలటం, లీకేజీలు అవుతున్నాయి. దీంతో సక్రమంగా నీరు సరఫరా కావడంలేదు. మండలంలోని కొచ్చెర్లకోట, కట్టకిందపల్లి, పుల్లాయిపల్లి, సిద్దాయిపాలెం, బసిరెడ్డిపల్లి, నారపురెడ్డిపల్లి, అనంతవరం, రాగమక్కపల్లి, ఇండ్లచెరువు, రుద్రసముద్రం, సంగాపురం తదితర గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకర్లు ఏర్పాటు చేయటంతో ప్రజలు ట్యాంకర్ నీటిని పట్టుకొని మంచినీటి అవసరాలు తీర్చుకుంటున్నారు.

పొట్లపాడు మంచినీటి పథకం నిర్వీర్యం

కురిచేడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్లపాడు గ్రామంలో రూ.12 కోట్లతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం ఇంజనీరింగ్ లోపంతో ప్రారంభానికి నోచుకోకుండానే పనిచేయడంలేదు. 24 గ్రామాలకు రక్షిత నీరు అందించడానికి నిర్మించిన పథకం ఆదిలోనే ఆగిపోయింది. ఈపథకానికి 3 కి.మీ దూరంలోని సాగర్ కాలువ నుంచి నీటిని పంపింగ్ చేసేందుకు ఏర్పాటుచేసిన మోటార్ల సామర్థ్యం చాలక నీటిని అంత దూరం అందించలేకపోయాయి. రైల్వే లైన్ డబ్లింగ్ చేయడంతో పాటు అండర్‌పాస్ ఏర్పాటుచేస్తుండగా పైప్ లైన్ పగలడంతో పూర్తిగా పథకం మూలన పడింది. మండలంలో పెద్దవరం, దేకనకొండ, పడమరగంగవరం, గంగదొనకొండ, పొట్లపాడు గ్రామాలకు నేటికి రక్షిత నీరు అందడం లేదు. గతంలో ట్యాంకర్ల ద్వారా నీటిని తోలినా వారికి డబ్బులు సకాలంలో ఇవ్వకపోవడంతో ట్యాంకర్ల యజమానులు నీరు తోలడానికి ముందుకు రావడం లేదు. దీంతో గ్రామాలలో దాహం కేకలు వినపడుతున్నాయి.

వారం రోజులుగా సరఫరా కాని ఎన్‌ఏపీ నీరు

ముండ్లమూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు ఎన్‌ఏపీ ద్వారా వారానికి ఒక రోజే నీరు సరఫరా అవుతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి పూర్తిగా రాకముందే గ్రామాల్లో తాగునీటి కష్టాలు తప్పటంలేదు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ అడుగంటిపోవడంతో సక్రమంగా నీటిని సరఫరా చేయలేకపోతున్నామని అధికారులు తెలుపుతున్నారు. మండలంలోని నాయుడుపాలెం, తమ్మలూరు, పసుపుగల్లు, ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, భీమవరం, వేముల, రమణారెడ్డిపాలెం, సుంకరవారిపాలెం, నూజెండ్లపల్లి, శంకరాపురం, పోలవరం గ్రామాలకు ఎన్‌ఏపీ నీరు నిలిచిపోయింది. అనేక గ్రామాల్లోనూ తాగునీటి సమస్య తీవ్రమైంది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దొనకొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ నాగూర్‌వలి తెలిపారు. దొనకొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఈ అంతరాయం ఉంటుందన్నారు. రైతులకు రాత్రి 12 నుంచి ఉదయం 9 గంటల వరకు కరెంట్ సరఫరా చేస్తామని తెలిపారు. గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యానికి సహకరించాలని ఏఈ కోరారు.

వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతి కల్పించాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో నామినీ వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించి ఉద్యోగోన్నతి కల్పించాలని మంగళవారం తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. రాత్రి డ్యూటీలను రద్దు చేయాలని, టీఏ, డీఏలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు వరగాని ఏసు, సీఐటీయూ మండల కార్యదర్శి బోడపాటి హనుమంతరావు, పోట్లూరి జ్యోతి, తప్పెట కోటయ్య, జి.గంగరాజు, పి.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పుట్టంనాయుడుపల్లిలో స్వామివార్ల గ్రామోత్సవం

పామూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండంలలోని పుట్టంనాయుడుపల్లి గ్రామంలో శ్రీకోదండ రామస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి సీతారామ కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రాయవరపు మాల్యాద్రిచౌదరి, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, మాజీ జడ్పీటీసీ బి.మహాలక్ష్మమ్మ, మాజీ ఎంపీటీసీ రాయవరపు ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

పామూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు పామూరు పట్టణంలో మానవతా సంస్థ చలివేంద్రాన్ని ఏర్పాటుచేసింది. పట్టణంలోని కందుకూరు రోడ్డులోగల రమేష్ మెడికల్ షాపు వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆసంస్థ ఎం.ముసలయ్య, గౌరవాధ్యక్షుడు కె.రామిరెడ్డి, డాక్టర్ గద్దె ఏడుకొండలు, బైరెడ్డి జయరామిరెడ్డి, బోయిళ్ల నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి
- ప్రజాదర్బార్‌లో వెల్లువెత్తిన అర్జీలు

దొనకొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మంగళవారం దొనకొండలోని సచివాలయం-1 కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రజాదర్బార్‌లో ఆమె మాట్లాడారు. దర్శి నియోజకవర్గంలో ఏఒక్కరూ సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ఈకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. దొనకొండలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుచేయనున్నట్లు మంత్రి రవికుమార్ ఇప్పటికే ప్రకటించారన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో దొనకొండ అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీలను సాధ్యమైనవి తక్షణమే పరిష్కరిస్తామన్నారు. మిగిలినవి నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలపై 197 అర్జీలు అందజేశారు. వాటిలో పింఛన్ల కోసం 50, రెవెన్యూ సమస్యలపై 110, హౌసింగ్ 3, నీటి సమస్యపై 18, విద్యుత్ సమస్యలపై 16 అర్జీలు అందినట్లు సమాచారం.

కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో శ్రీదేవి, విద్యుత్ ఈఈ పి.శ్రీనివాసరావు, ఏడీఈ హరిబాబు, ఎంఈవో సాంబశివరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, జడ్పీటీసీ సుధాకర్, ఎస్‌ఐ త్యాగరాజు, వివిధశాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌లో అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

కార్యకర్తలకు అండగా ఉంటాం

దొనకొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మంగళవారం జరిగిన టీడీపీ మండల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండలంలో సిమెంట్ రోడ్ల ఏర్పాటు, రీసర్వేలో జరిగిన తప్పులను సవరించుకునేందుకు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగలేకపోతున్నామని పలువురు టీడీపీ కార్యకర్తలు సమావేశంలో ప్రస్తావించారు. ఈసందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుందనేందుకు మండలంలోని కలివెలపల్లి గ్రామానికి చెందిన కార్యకర్త శ్రీరాం వెంకటయ్య మృతిచెం దటంతో అతని భార్యకు రూ.5 లక్షలు అందించటమే అందుకు నిదర్శనమన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. కార్యకర్తల జోలికి ఎవరొచ్చినా ఊరుకునే ప్రసక్తేలేదన్నారు. పార్టీని బలోపేతం చేసుకునేందుకు విభేదాలు వీడి ప్రతిఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, నాయకులు మోడి వెంకటేశ్వర్లు, కామేపల్లి చెంచయ్య, మోడి ఆంజనేయులు, శృంగారపు నాగసుబ్బారెడ్డి, సింగమనేని హనుమంతు, వడ్లమూడి వెంకటాద్రి, వల్లపునేని వెంకటస్వామి, దుగ్గెంపూడి చెంచయ్య, విప్పర్ల లక్ష్మీరావు, వైకే చౌదరి, మన్నెం గాలయ్య, కుందుర్తి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆశీస్సులతో అభివృద్ధి చేస్తాం

దర్శి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అన్నీ రంగాల్లో అభివృద్ధి చేస్తానని టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. మండలంలోని రాజంపల్లి సమీపాన మునీనది తీరాన సోమవారం రాత్రి జరిగిన శ్రీప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల ఉత్సవాల్లో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాజంపల్లి, కుంచేపల్లి గ్రామాలకు చెందిన టీడీపీ వర్గీయులు ఏర్పాటు చేసిన ప్రభల వద్ద ప్రజలనుద్దేశించి మట్లాడారు. దర్శి నియోజకవర్గంలో నిలిచిపోయిన ప్రాజెక్టులు పునఃప్రారంభానికి నిధులు విడుదల అవుతున్నాయన్నారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు వారిని ఘనంగా సన్మానించారు.

మహిళల స్వయం ఉపాధికి ప్రాధాన్యం

దొనకొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు స్వశక్తిపై నిలచి, ఆర్థికంగా ఉన్నత స్థాయిలో నిలపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దొనకొండలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటుచేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాల్వల నిర్మాణానికి చర్యలు

- నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య

దర్శి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని అన్నీ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మిస్తామని నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తెలిపారు. మంగళవారం పదో వార్డులో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆ ప్రాంతవాసులు మురుగుకాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. మంచినీటి పైపులైన్లు సక్రమంగా లేక నీరందటం లేదన్నారు.

స్పందించిన చైర్మన్ పిచ్చయ్య మాట్లాడుతూ వెంటనే మురుగు కాల్వల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. పైపులైన్ల మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దత్తు, దినకర్, ఏఈ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



దర్శిలోని పదో వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యేనా!

- ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ
- నష్టపోతున్న రైతులు

దర్శి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఇప్పటివరకు అధికారులు కేంద్రాలను ఏర్పాటుచేయలేదు. గత కొన్ని రోజులుగా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరలకు కొనుగోలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. కొద్దిరోజుల క్రితం దర్శి ప్రాంతంలో తేలికపాటి వర్షం కురిసింది. ఆ వర్షాన్ని అసరాగా చేసుకొని ధాన్యంలో తేమ శాతం ఉందని ప్రైవేట్ వ్యాపారులు 75 కేజీల బస్తాను కేవలం రూ.1400కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. సివిల్ సప్లయ్ శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రతిసారి నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తున్నారు.

ఖరీఫ్ సీజన్‌లో కూడా చాలా ఆలస్యంగా, మొక్కుబడిగా కేంద్రాలు ఏర్పాటుచేశారు. రబీ సీజన్‌లో సాగుచేసిన వరి పంట దాదాపుగా నెలరోజుల నుంచి రైతుల ఇళ్లకు చేరుతుంది. ఇప్పటివరకు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు.



దర్శిలో ఆరబోసిన ధాన్యం

ప్రభుత్వం రైతులకు మద్దతు ధర 75 కేజీల బస్తా ఏ గ్రేడు రకం రూ.1740, సాధారణ రకం రూ.1725గా నిర్ణయించింది. కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేసి ఉంటే రైతులకు గిట్టుబాటు ధర లభించేది. ఇప్పటికే అధికశాతం రైతులు ధాన్యాన్ని విక్రయించారు.

ప్రైవేట్ వ్యాపారులు తక్కువగా కొనుగోలు చేస్తున్నందున బస్తాకు రూ.325 నుంచి రూ.340 వరకు రాబడి కోల్పోతున్నారు. ఉన్నతాధికారులు ఈ దోపిడీని గుర్తించి వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధర కల్పించాలని రైతుల సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి



గ్యాస్ ధరల పెంపుపై నిరసన తెలుపుతున్న సీపీఎం శ్రేణులు

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకుడు ఊసా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వంట గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ మంగళవారం సీఎస్‌పురం మండల కేంద్రంలోని బస్టాండు సెంటర్‌లో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన గ్యాస్ ధరలు తగ్గించే వరకు ప్రజలను సమీకరించి ఆందోళన బాట చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి, గుర్రం లక్ష్మయ్య, పొదిలి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, పామూరులోని మమ్మీడాడి సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా, కె.మాల్యాద్రి, వై.వీరనారాయణ, సయ్యద్ గౌస్‌బాషా, అల్లభక్ష్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతులు

ముండ్లమూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకంభంపాడు గ్రామంలో మొక్కజొన సాగుచేసిన రైతులు నకిలీ విత్తనాలతో మోసపోయారు. మూడురోజుల క్రితం 'మోసపోయిన మొక్క జొన్న సాగు రైతులు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దర్శి కేవీకే శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారులు మంగళవారం మొక్కజొన్న తోటలను పరిశీలించారు. బాపట్ల జిల్లా పంగులూరు మండలం ముప్పవరం గ్రామానికి చెందిన ఒక సీడ్స్ కంపెనీలో విత్తనాలు కొనుగోలు చేసినట్టు రైతులు తెలిపారు. కేవీకే హెడ్ ప్రిన్సిపల్ సైంటిస్టు రమేష్, ఏఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సంధ్యారాణి, ఏడీఏ బాలాజీ నాయక్, మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్‌లు వివరాలు తెలుసుకున్నారు. పూర్తి నివేదికను పరిశీలించి నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య

వెలిగండ్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఉరివేసుకుని మహిళ మృతి చెందింది. ఈఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఏఎస్‌ఐ జిలాని బాషా తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుమ్మలకర్ర గ్రామానికి చెందిన బాలవెంకటేశ్వర్లుకు హనుమంతునిపాడు మండలం దాసల్లపల్లి గ్రామానికి చెందిన రేణుక(29)తో పది సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. వెంకటేశ్వర్లు పని చేయకుండా మద్యానికి బానిసై తరుచూ భార్యతో గొడవలు పడుతూ ఉండేవాడు. ఈక్రమంలో మనస్తాపానికి గురైన రేణుక సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఫ్యాన్‌కి ఉరివేసుకుని మృతి చెందింది. గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం కోవిలంపాడులో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని గ్రామస్థులు పేర్కొన్నారు. ప్రశ్నించే దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ ఎంటీమానాయక్ దృష్టికి తీసుకెళ్లగా విచారించి న్యాయం చేస్తామన్నారని తెలిపారు. ఈ జిల్లా కలెక్టర్, తహసీల్దార్‌కు అర్జీలు ఇచ్చినా స్పందన లేదన్నారు. నిర్మాణాలు నిరాటంకంగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సర్వేను సక్రమంగా నిర్వహించాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో పొదుపు గ్రూపు మహిళలు నిర్వహిస్తున్న ఆర్థిక వార్షిక ప్రణాళిక సర్వేను సక్రమంగా నిర్వహించాలని వెలుగు పీడీ నారాయణ ఆదేశించారు. మంగళవారం మండలంలోని చింతలపూడిలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం చెందాలంటే ఈ సర్వే కీలకమన్నారు. సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా పొదుపు సంఘాల్లో సభ్యులు చేరకుండా ఉంటే అలాంటి వారిని తిరిగి చేర్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్వేలను పకడ్బందీగా చేపట్టిందన్నారు. ఆయన వెంట ఏపీఎం ఎం.హనుమంతరావు, సీసీలు కోటేశ్వరరావు, రత్నకుమారి ఉన్నారు.

రీసర్వేలో విస్తీర్ణం తగ్గిందంటూ రైతుల ఆందోళన

ముండ్లమూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు గ్రామంలో జరుగుతున్న రీసర్వేలో తమ భూముల విస్తీర్ణం తగ్గిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలా జరిగితే తాము ఊరుకొనేది లేదని రీసర్వే చేపట్టిన వీఆర్‌వోలు, గ్రామ సర్వేయర్లపై మంగళవారం రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పది రోజుల నుంచి రీసర్వే చేసిన భూముల వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తుండటంతో విషయం తెలుసుకొని బృందం వద్దకు వెళ్లి తమ పొలాలకు సంబంధించిన రికార్డులు చూపించాలన్నారు. ఒక్కో రైతుకు ఐదు సెంట్ల నుంచి పది నుంచి 20 సెంట్ల వరకు విస్తీర్ణం తగ్గినట్టు రికార్డుల్లో ఉండటంతో వీఆర్‌వోలు, సర్వేయర్లపై రైతులు మండిపడ్డారు. ఒక్క సెంటు కూడా తగ్గకుండా ఉంటేనే రీ సర్వేకు ఒప్పుకుంటామని రైతులు స్పష్టం చేశారు. దీంతో వీఆర్‌వోలు, గ్రామ సర్వేయర్లు చేసేదేమి లేక వెనుదిరిగి వచ్చారు.

వార్షిక ప్రణాళికలు సిద్ధం చేయాలి

తాళ్లూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళా గ్రూపుసభ్యులకు సంబంధించి 2025-2026 వార్షిక క్రెడిట్ ప్రణాళికల యాక్షన్ ప్లాన్ సర్వేలను వారం రోజుల్లో పూర్తి చేయాలని డీఆర్‌డీఏ పీడీ పి. నారాయణ తెలిపారు. శివరాంపురం గ్రామంలో వీవోఏలు, ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పొదుపు మహిళలు రానున్న సంవత్సరంలో ఆర్థిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. విద్యాసంవత్సరంలో పిల్లలకు చెల్లించాల్సిన ఫీజుల వివరాలను స్పష్టంగా నమోదు చేయించాలన్నారు. వార్షిక క్రెడిట్ ప్రణాళికలో అన్ని విషయాలు నమోదు చేయటం వల్ల ప్రభుత్వం తగిన నిధులు కేటాయించి సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం పి.దేవరాజ్, వీవోఏలు, యానిమేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్వారీ లారీ బోల్తా

కనిగిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): క్వారీ లారీ బోల్తాపడిన సంఘటన మండల పరిధిలోని గొల్లపల్లి చెరువు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. క్వారీ డస్ట్ రవాణా చేస్తున్న లారీ కనిగిరి నుంచి సీఎస్‌పురం రోడ్డులో వెళుతుంది. గొల్లపల్లి చెరువువద్ద మలుపుతిప్పే క్రమంలో అదుపుతప్పింది. లారీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రాణాపాయం తప్పింది. గొల్లపల్లి చెరువు వద్ద రోడ్డు బాగా ఎత్తుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఇదే ప్రాంతంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ట్రాక్టర్‌లు ఢీకొని ప్రాణాలు పోయిన సంఘటనలు కూడా జరిగాయి. ఈప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉంది. లారీ బోల్తా విషయంపై ఎలాంటి ఫిర్యా దు అందలేదని ఎస్ఐ శ్రీరాం తెలిపారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

పామూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక విద్యుత్ డీఈ కార్యాలయాన్ని మంగళవారం కనిగిరి ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.ఉమాకాంత్ తనిఖీచేశారు. కార్యాలయ రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వేసవి కాలంలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఏడీఈ డీవీ కృష్ణారెడ్డి, ఏఈ షేక్ జిలానిబాషా, టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సయ్యద్ అమీర్‌బాబు, జి.శ్రీనివాసులు, ఒంగోలు చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు మీదగా హుబ్లీ, కతిహార్‌కు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదుగా హుబ్లీ, కతిహార్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07325 హుబ్లీ - కతిహార్ ప్రత్యేక రైలు ఈ నెల 9 నుంచి 30వ తేదీ వరకు ప్రతీ బుధ వారం మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి గుంటూరు మీదగా గురువారం వేకువజామున 3.20కి గుంటూరు, శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు కతిహార్ చేరుకుంటుంది. నంబరు. 07326 కతిహార్ - హుబ్లీ రైలు ఈ నెల 12 నుంచి మే 3వ తేదీ వరకు ప్రతీ శనివారం మధ్యాహ్నం మధ్యాహ్నం 2.15కి బయలుదేరి ఆదివారం రాత్రి 9.10కి గుంటూరు, సోమవారం ఉదయం 10.50కి హుబ్లీ చేరుకుంటుందని శ్రీధర్ తెలిపారు.



గ్యాస్ వడ్డన.. రూ.90 కోట్లు

- వినియోగదారులపై పెరిగిన భారం
- రెండేళ్ల తర్వాత వంట గ్యాస్‌పై వడ్డన
- ఉజ్వల, దీపం లబ్ధిదారులనూ వదలని ప్రభుత్వం

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దాదాపు రెండేళ్ల తర్వాత వంట గ్యాసు సిలిండరు ధర పెంచారు. గ్యాసు ధర పెరగడంతో సామాన్య కుటుంబాలపై భారం పడింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 18 లక్షల కుటుంబాలకు వంట గ్యాసు కనెక్షన్లు ఉన్నాయి. ఒక్కో లబ్ధిదారుడు ఏడాదికి 8 నుంచి 10 సిలిండర్లు వినియోగిస్తారు. ఈ లెక్కన ఒక్కో కుటుంబంపై ఏటా రూ.500 భారం పడుతోంది. ఇలా 18 లక్షల మందిపై ఏడాదికి రూ.90 కోట్ల మేర అదనంగా భారం పడనున్నది. ఉజ్వల, దీపం పథకాల కింద కనెక్షన్లు తీసుకున్న వారిని కూడా ఈ సారి ప్రభుత్వం వదల్లేదు. దీంతో వారు కూడా ఈ గ్యాస్ భారం మోయాల్సి వస్తోంది. వంటగ్యాసు ధరల భారాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చి సామాన్యులపై భారం తగ్గిస్తోంది. కానీ కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై భారం మోపేలా చేస్తుండడంతో వినియోగదారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

సామాన్యులు గగ్గోలు..

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక పెట్రోల్, డీజిల్, వంటగ్యాసు ధరలు డజనుసార్లు పెరిగాయి. 2014 నాటికి 7 పదుల్లో ఉన్న ఆయిల్ ధరలు 2020 నాటికి 120 రూపాయల వరకూ వెళ్లింది. కరోనా కష్టాలతోపాటు, లాక్‌డౌన్ నష్టాలతో అల్లాడిపోయిన ప్రజలు ఆయిల్ ధరల పెంపుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో కేంద్రం ధరలు తగ్గించింది. వంటగ్యాసు ధర 2014 నాటికి రూ.430 ఉండగా, 2023కి రూ.1200కి చేరింది. దీంతో ప్రజాగ్రహం వెల్లువెత్తింది. 2024 ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం రూ.200 ధర తగ్గించి ప్రజల ఆగ్రహ జ్వాలను చల్లార్చింది. కాగా మళ్లీ ఇప్పుడు ధరలు పెంచడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ధరల పెంపుదల ఇంతటితో ఆగుతుందా.. లేక ఇంకా ఇంకా కొనసాగుతుందా.. అన్న భయం వారిని వెంటాడుతోంది. 2014- 16 మధ్య కేంద్రం 9 సార్లు ధరలు పెంచిన నేపథ్యంలో ఆ పరిస్థితిని తలుచుకుని సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు.



ఆస్తి పన్ను.. మళ్లీ పెరిగింది

- మున్సిపాల్టీల్లో 15 శాతం పెరుగుదల
- ఐదేళ్లలో రెట్టింపు అయిన ఆస్తి పన్ను
- 1 నుంచి అమలులోకి వచ్చిన పెంచిన పన్ను
- మూడు జిల్లాల్లో భారం రూ.60 కోట్లు పైగానే

మున్సిపల్ కేంద్రాల్లోని ఇళ్ల యజమానులపై మళ్లీ పన్ను భారం పడింది. మున్సిపాల్టీల్లో ఆస్తి పన్ను మరో సారి 15 శాతం పెరిగింది. ఈ పెంచిన పన్నులను ఈ నెల 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల మూడు జిల్లాల్లో పుర పౌరులపై దాదాపు రూ.60 కోట్లకు పైగానే ఆస్తి పన్ను భారం పడినట్లు అంచనా. ఆస్తి విలువ ఆధారంగా విధిస్తున్న పన్ను ఏటేటా పెరుగుతోంది. మార్కెట్ విలువకు సమానమయ్యే వరకు పన్ను పెరుగుతునే ఉంటుందని అధికారులు చెప్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో గృహ యజమానులపై పన్నుల రూపంలో మోయలేని పడుతున్న ఆర్థిక భారం మున్సిపాల్టీలకు కాసుల వర్షం కురిపిస్తోంది. పన్ను పెరుగుదలకు హద్దే లేకుండా పోతుండడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మున్సిపల్ ప్రజలపై మరోసారి ఆర్థిక భారం పడింది. ఏటా పన్నుల పెంపుదల పురపాలక సంఘాలకు కాసుల వర్షం కురిపిస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మున్సిపాల్టీలలో ఉన్న పన్ను విధానాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా మర్చేసింది. మార్కెట్ విలువ(రిజిస్ట్రేషన్ విలువ) ఆధారంగా ఆస్తి పన్నును విధించింది. ఆస్తి విలువను మార్కెట్ విలువ ప్రకారం మదింపు చేశారు. దీని ఆధారంగా మున్సిపాల్టీల్లో అధికారులు ఆస్తి పన్ను నిర్ణయించారు. గతంలో అద్దె విలువ, మున్సిపాల్టీలో జోన్ల వారీగా రేట్లు నిర్ణయించి పన్ను విధించేవారు. ఈ విధానం 1997 నుంచి అమలు అవుతోంది. భవన నిర్మాణ కొలతలను కూడా పరిగణనలోకి తీసుకునేవారు. మున్సిపాల్టీ గెజిట్ ప్రకారం జోన్ల వారీగా పన్ను నిర్ణయించే వారు. గతంలో భవనానికి మాత్రమే పన్ను విధించే వారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కొత్త విధానంలో భవనంతో పాటు, చుట్టూ ఖాళీ వదిలితే ఈ స్థలానికి కూడా పన్ను విధించారు. దీంతో పన్ను అమాంతం పెరిగింది. ప్రజల జేబును ఎన్ని విధాలుగా ఖాళీ చేయవచ్చో మున్సిపాల్టీలలో నూతన ఆస్తి పన్ను విధానం తెలియజేస్తున్నది. ఆస్తి విలువ ఆధారంగా గతంలో చెల్లిస్తున్న పన్నుకు కొత్త విధానంలో నిర్ణయించిన పన్నుకు మధ్య వ్యత్యాసాన్ని నిర్ధారించారు. తేడా ఉన్న ప్రకారం ఏటా 15 శాతం పన్ను పెంచుతూ వస్తున్నారు. ఈ పన్నుల విధానం సరైనది కాదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ఉదాహరణకు ఓ వ్యక్తి తన గతంలో ఇంటికి ఏటా రూ.492 పన్ను చెల్లించే వాడు.. దీనికి ఏటా ప్రభుత్వం 15 శాతం చొప్పున పెంచేస్తోంది. వరుసగా ఐదో ఏడాది కూడా పన్ను పెరిగింది. ఇలా పెరిగిన పన్నుతో అది రూ.990కి చేరింది. అంటే నాలుగేళ్లలో ఆ వ్యక్తిపై అదనంగా రూ.498 పన్ను భారం పడింది. గుంటూరు కార్పొరేషన్‌లో గత ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లు ఉంటే ఈ పన్ను ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.115కు పెరిగింది. అంటే మిగిలిన మున్సిపాల్టీల్లోనూ ఇదే స్థాయిలో పన్నులు పెరిగాయి.

50 శాతం వడ్డీ రాయితీ అమలు

పన్ను బకాయిదారుల నుంచి వసూలు చేసిన ఆస్తి పన్నుపై ప్రభుత్వం 50 శాతం వడ్డీ రాయితీని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్నుపై వడ్డీ చెల్లించిన వారికి దానిలో 50 శాతం తిరిగి ఇస్తోంది. అయితే ఈ మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలోని మొదటి ఆరు నెలలకు సంబంధించిన పన్నులో తగ్గించారు. వడ్డీ రాయితీను పన్నుదారులకు తిరిగి చెల్లించినట్లుగా పన్ను దారుల ఖాతాను పరిశీలిస్తే తెలుస్తోంది.

కొనసాగుతున్న వైసీపీ పన్ను విధానం

మున్సిపాల్టీల్లో పన్ను విధానాన్ని వైసీపీ ప్రభుత్వం 2020-21లో మార్చేసింది. ఆస్తి విలువ ప్రకారం పన్నును ఏటా 15 శాతం పెంచేలా నిర్ణయించింది. ఈ ప్రకారం గత నాలుగేళ్లు పన్ను పెంచుతూ వచ్చింది. కూటమి ప్రభుత్వంలో పన్నుల విధానాన్ని మారుస్తుందని ప్రజలు ఆశించారు. అయితే ఈ ప్రభుత్వం కూడా వైసీపీ పన్నుల పెంపు విధానాన్ని కొనసాగించినట్లు ఈ నెలలో పెరిగిన 15 శాతం పన్నుతో తేలింది. గత నాలుగేళ్లుగా పెంపుదలతో ఇప్పటికే పన్ను భారం ప్రతీ ఒక్కరిపైనా రెట్టింపు అయింది. ఆస్తి పన్ను విషయంలో వైసీపీ విధానాలనే ఈ ప్రభుత్వం కూడా అమలు చేస్తుండటంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పన్నులు పెరిగితే గృహ యజమానులు అద్దెలు పెంచుతున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

5 శాతం రాయితీ

పురపాలక సంఘాల్లో ఆస్తి పన్నుపై ప్రభుత్వం 5 శాతం రాయితీ అమలు చేస్తోంది. సోమ వారం నుంచి ఈ విధానం అమల్లోకి వచ్చింది. పన్ను రూ.100 ఉంటే రూ.5 రాయితీ ఇస్తారు. రాయితీపై ఆస్తి పన్ను చెల్లించేందుకు ఈ నెల 30 వరకు అవకాశం ఇచ్చారు. పన్ను రాయితీపై మున్సిపల్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీంతో పలువురు స్వచ్ఛందంగా వచ్చి పన్నులు కడుతున్నారు. దీంతో ఈ రెండు రోజుల్లోనే రూ.6.60 కోట్లు వసూలు కావడం గమనార్హం.



ఆస్తి పన్ను లక్ష్యం రూ.522.28 కోట్లు

గుంటూరు కార్పొరేషన్ సహా మూడు జిల్లాల్లోని మున్సిపాల్టీల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి పన్ను వసూలు లక్ష్యం రూ.522.28 కోట్లు. ఈ మొత్తంలో బకాయిలు భారీగానే ఉన్నాయి. పల్నాడు జిల్లా పన్ను వసూ లు లక్ష్యం రూ.77.03 కోట్లుగా ప్రభుత్వం నిర్ణ యించింది. గుంటూరు జిల్లాల్లో రూ.406.97 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.38.28 కోట్లు పన్ను వసూలు లక్ష్యంగా ఉంది.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పంపిణీ ప్రారంభం
- ఒక్కో విద్యార్థికి రూ.3 వేలకిపైగా భారం నుంచి ఊరట
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 వేల మందికి లబ్ధి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 8 ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించే విద్యార్థులకు ఈ ఏడాది కూడా ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 30 పైగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్లస్ టూ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో దాదాపు 15 వేల మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు. జూనియర్ ఇంటర్, సీనియర్ ఇంటర్ చదివే ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఈ నెల ఒకటో తేదీ నుంచి జూనియర్ కళాశాలల పునః ప్రారంభం కాగా కళాశాలకు వచ్చిన విద్యార్థులకు పుస్తకాలను అధ్యాపకులు అందజేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో అత్యధిక మంది పేద, దిగువ మధ్యతరగతి వర్గాల వారే. పుస్తకాలకు విద్యార్థులు రూ.3 వేలకు పైగా వెచ్చించాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రెండేళ్లుగా ఇంటర్ విద్యార్థులకు పాఠ్య నోట్ పుస్తకాల పంపిణీ చేపట్టింది. పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ రికార్డులు పంపిణీ వల్ల ఆర్థికంగా పేద, మధ్య తరగతి విద్యార్థులకు చేయూతగా మారింది. పుస్తకాలను ఉచితంగా అందజేయడం వల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉందని ప్రిన్సిపాళ్లు చెబుతున్నారు.

ఇంటర్ విద్యలో మార్పులకు శ్రీకారం

ప్రభుత్వం ఇంటర్ విద్యలో మార్పులకు శ్రీకారం చుడుతుంది. ఈ నేపథ్యంలోనే నూతన సంస్కరణలు ప్రవేశపెడుతున్నది. తొలుత ఇంటర్ విద్యార్థులకు కూడా కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ తర్వాత జేఈఈ అడ్వాన్స్‌తో పాటు ఎంసెట్ శిక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆయా శిక్షణలకు గుంటూరులోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలను నోడల్ సెంటర్‌గా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సంస్కరణలు విద్యార్థుల అడ్మి షన్లు పెంపుకోసమేనని ప్రిన్సిపాల్స్ చెబుతున్నారు.

200 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



పోలీసులకు పట్టుబడ్డ రేషన్ బియ్యం లారీ

కారంచేడు(పర్చూరు), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కారంచేడు పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం కారంచేడు రామానాయుడు కల్యాణ మండపం సమీపంలో ఎస్‌ఐ వెంకట్రావు తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో ఈ దందా బయట పడింది. లారీలో 200 బస్తాల పేదల బియ్యం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. చీరాల మండలం జాండ్రపేట నుంచి నరసరావుపేట తరలిస్తున్నట్లు తెలిసింది. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ సిబ్బందికి అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇటీవల రేషన్ బియ్యం దందాకు కారంచేడు, పర్చూరు అడ్డాగా మారుతున్నాయి.



శిశు గృహంలోని పిల్లల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళి, స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ డి.రాధామాధవి

అనాథలను కన్నబిడ్డల్లా చూసుకుంటా

- పిల్లల బాగోగులను స్వయంగా పర్యవేక్షిస్తా
- పిల్లలను కొట్టినా, తిట్టినా వెంటనే చర్యలన్న కలెక్టర్
- బాపట్లలోని శిశుగృహ, బాలసదన్‌లో ఆకస్మిక తనిఖీలు

బాపట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అనాథ శిశువులను సొంత పిల్లలను చూసుకున్నట్లే చూసుకుంటానని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. వారి బాగోగులను స్వయంగా పర్యవేక్షిస్తానన్నారు. బాపట్లలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహ, బాలసదన్‌లను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నలుగురు శిశువులే ఉండగా దస్త్రాలలో 9 మంది శిశువులు ఉండటం ఏమిటని ప్రశ్నించారు? ఏడాదిలోపు ఉన్న నలుగురు శిశువులను ఇక్కడే ఉంచామని మిగిలిన చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్నారని సంబంధితాధికారులు కలెక్టర్‌కు తెలిపారు. అనాథ శిశువులకు అందిస్తున్న పోషణ, వారి సంరక్షణ చర్యలు, ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. విధులకు ఆలస్యంగా వచ్చిన శిశు గృహ మేనేజర్, మరొక సిబ్బందికి చార్జిమెమో జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బలహీనంగా ఉన్న ఏడాది శిశువుకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ఏరియా వైద్యశాలలోని చిన్న పిల్లల వైద్యులు ప్రతిరోజు శిశు గృహాన్ని తప్పనిసరిగా సందర్శించాలన్నారు. శిశుగృహంలో సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఓ ఆయా విధుల్లో నిర్లక్ష్యం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. పిల్లలను ఆమె కొడుతున్నట్లు సమాచారం వచ్చిందని అలా చేస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. పిల్లల విషయంలో నిర్లిప్తంగా వ్యవహరిస్తే సహించేదిలేదన్నారు. బాలసదన్‌లో ఆశ్రయం పొందుతున్న అనాథ బాలికలు, పాక్షిక అనాథ బాలికల వివరాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ డి.రాధామాధవి, డీసీ పీవో పురుషోత్తం తదితరులు ఉన్నారు.

రూ.10 స్టాంప్.. రూ.60

- నాన్ జుడీషియల్ స్టాంప్‌లకు కొరత
- బ్లాక్‌మార్కెట్లోనూ రెండు నెలలుగా ఇబ్బందులు
- పరిస్థితి దారుణంగా మారినా స్పందించని రిజిస్ట్రేషన్ అధికారులు
- డీఆర్ కార్యాలయంలో ఉన్నా పంపిణీ చేయకపోవడంపై అనుమానాలు
- ఈ-స్టాంపింగ్ వారి ప్రయోజనం కోసమేనని ఆరోపణలు

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నాన్ జుడీషియల్ స్టాంపుల కోసం ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గడచిన నాలుగు నెలలుగా మార్కెట్‌లో కొరత తీవ్రంగా ఉంది. మొదటి రెండు నెలలు తమ వద్ద ఉన్న కొద్దిపాటి స్టాంప్‌లను వెండర్లు బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం బ్లాక్ మార్కెట్‌లోనూ నిండుకున్నాయి. అయితే రెండు నెలలుగా బ్లాక్‌లో కూడా స్టాంప్‌లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యధిక మంది స్టాంపు వెండర్ల వద్ద స్టాంపులు లేవు. ఉన్న వారు రూ.10 స్టాంప్‌ను రూ.60 చొప్పున విక్రయిస్తున్నారు. పరిస్థితి దారుణంగా తయారైన రిజిస్ట్రేషన్ అధికారులు స్పందించడంలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాన్ జుడీషియల్ స్టాంప్‌లను పూర్తిగా తొలగించి రిజిస్ట్రేషన్ 2.0 పేరుతో కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. నాన్ జూడీషియల్ స్టాంపులతో సంబంధం లేకుండానే ఈ-స్టాంపింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. చివరకు ఈ-స్టాంపింగ్‌ను కూడా ప్రైవేటు ఏజెన్సీకే కేటాయించారు. దీనిపై ప్రజల నుంచి నిరసన వ్యక్తం అయినా ప్రభుత్వం ముందుకే వెళ్లింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాన్ జుడీషియల్ స్టాంప్‌ల వినియోగాన్ని గతంలో మాదిరిగా కొనసాగించాలని ఆదేశించింది. అయితే ఇందుకు సంబంధించి నాన్ జుడీషియల్ స్టాంపులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలన్న విషయాన్ని విస్మరించింది. దీంతో గడచిన నాలుగు నెలలుగా గుంటూరులో నాన్ జుడీషియల్ స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి నాన్ జుడీషియల్ స్టాంపుల వినియోగం ఎక్కువైంది. ప్రజలు రూ.10, 20, 50, 100 స్టాంప్‌లను ఎక్కువగా వినియోగిస్తుంటారు. అయితే అవి అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆయా స్టాంపులను జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తెప్పిస్తున్నప్పటికీ వాటిని క్షేత్రస్థాయిలో వెండర్లకు అందజేయడంలో జాప్యం చేస్తున్నారు. రెండు నెలల క్రితమే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులు వచ్చినప్పటికీ వాటిని ఆయా వెండర్లకు పంపిణీ చేయకపోవడం గమనార్హం. ఇదంతా ఈ-స్టాంపింగ్ వారి ప్రయోజనాల కోసమే అన్న ఆరోపణలు వస్తున్నాయి. నాన్ జుడీషియల్ స్టాంపులను బ్లాక్ చేస్తే ప్రజలు ఈ-స్టాంపింగ్ వైపు మొగ్గు చూపుతారు. ప్రస్తుతం నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరతకు ఇదే కారణమని వెండర్లు ఆరోపిస్తున్నారు. దస్తావేజులు, ఒప్పందాలు మినహా మిగిలిన వాటికి ఈ-స్టాంపింగ్ వినియోగించుకుందాం అనుకున్నా సర్వర్ సమస్యల కారణంగా అవి కూడా సరిగా అందుబాటులోకి రావడం లేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

స్విమ్మింగ్‌లో చందోలు కానిస్టేబుల్ ప్రతిభ



స్విమ్మింగ్‌లో సత్తాచాటిన నాగబ్రహ్మారెడ్డిని మెడల్‌తో అభినందిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలలో చందోలు పీఎస్ కానిస్టేబుల్ పిట్టు నాగబ్రహ్మారెడ్డి సత్తాచాటాడు. మెడల్స్ సాధించిన కానిస్టేబుల్‌ని మంగళవారం ఎస్పీ తుషార్‌డూడీ ప్రత్యేకంగా అభినందించారు. విజయవాడలో ఇటీవల జరిగిన 25వ కృష్ణా రివర్ క్రాసింగ్ స్విమ్మింగ్ పోటీలో నాగబ్రహ్మారెడ్డి దుర్గాఘాట్ నుంచి 1.5 కిలోమీటర్ల దూరాన్ని 21నిమిషాలలో ఈది విజేతగా నిలిచారు. గత నెల 24 నుంచి 28 వరకు గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరిగిన 72వ ఆలిండియా పోలీసు ఆక్వాటిక్స్ క్లస్టర్ చాంపియన్‌షిప్ పోటీలోనూ సత్తా చాటారు. స్విమ్మింగ్‌లో రాణిస్తున్న నాగబ్రహ్మారెడ్డిని ఆదర్శంగా తీసుకొని పోలీసుసిబ్బంది క్రీడలలో సత్తాచాటాలన్నారు.

వినియోగదారులకు కేంద్రం షాక్

గ్యాస్ సిలిండర్ ధర పెంపు

ఒక్కొక్క కుటుంబానికి ఏడాదికి రూ.200 నుంచి భారం

ఏడాదికి జిల్లా ప్రజలపై రూ.15కోట్ల మేర భారం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వంట గ్యాస్ వినియోదదారులకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్‌కు ఒక్కసారిగా రూ 50 పెంచడంతో ప్రజానీకంపై భారీగా భారం పడనుంది. ధరలు పెంచిన వెంటనే వినియోగంలోకి తీసుకురావడంతో మరింత ఆందోళన నెలకొంది. జిల్లావ్యాప్తంగా మూడు కంపెనీల పరిధిలో సుమారు 7.5 లక్షల గ్యాస్ సిలిండర్లు ఉన్నాయి. ఒక్కొక్క కుటుంబం ఏడాదికి నాలుగు సిలిండర్ల వరకు వినియోగిస్తారు. అలా ఒక్కొక్క కుటుంబంపై ఏడాదికి రూ.200 వరకు ఖర్చు పెరగనుంది. ఆ విధంగా జిల్లావ్యాప్తంగా ప్రజానీకంపై ఏడాదికి రూ.15కోట్ల మేర భారం పడనుంది.

జిల్లాకేంద్రమైన ఒంగోలులో సోమవారం సిలిండర్ ధర రూ.848 ఉండగా మంగళవారం ఆ ధర రూ.898కి చేరింది. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏప్పుడు ధరలు పెరుగుతాయో కూడా అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినప్పుడు కూడా ఎక్సైజ్ సుంకాన్ని పెంచుతూ ప్రజలపై ఆర్థికభారం మోపుతుండటంతో ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

పశుసంవర్ధకశాఖ అధికారుల సంఘం నూతన కమిటీ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ పశుసంవర్ధశాఖ ఆఫీసర్స్ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పశుసంవర్ధకశాఖ సమావేశపు హాలులో మంగళవారం జరిగిన ఎన్నికలకు డాక్టర్ టి.మోహన్‌రావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ సీహెచ్.వెంకట్రామిరెడ్డి (ఏడీ , ఐఎస్‌డీపీ, ఒంగోలు), ప్రధానకార్యదర్శిగా కెజసుధీర్‌బాబు(ఏడీ, ఏవీహెచ్, టంగుటూరు), కోశాధికారిగా ఎన్.శ్రీరాములు (త్రిపురాంతకం), ఉపాధ్యక్షులుగా పి.శ్రీరాములు (ఏడీ, డిప్యూడీ డైరెక్టర్, కందుకూరు), జాయింట్ సెక్రటరీగా బి.బసవశంకరరావు (ఏడీ, ఏవీహెచ్ త్రోవగుంట)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పశుసంవర్ధకశాఖ సంచాలకులు డాక్టర్ బేబీరాణిని కలిసి బొకే అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా రజిత

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిలా మహిళావిభాగం చైర్‌పర్సన్‌గా కాట్రగడ్డ రజిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సంఘ కార్యాలయంలో మంగళవారం సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం మహిళావింగ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా రజిత, జిల్లా కన్వీనర్‌గా వనజ, ట్రెజరర్‌గా ప్రసన్న, కో చైర్మన్లుగా శ్రీదేవి, అనుపమ, గురుదేవి, సునీత, కో కన్వీనర్లుగా సుజాత, నాగమణి, త్రివేణి, ప్రసన్న, జి.సుజాత, ప్రతిమలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రజిత మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల్లోని మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా కృషి చేస్తామని చెప్పారు. తనను జిల్లా చైర్‌పర్సన్‌గా ఎన్నుకోవడం పట్లపై ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లాకార్యదర్శి వరకుమార్, శ్రీనివాస్, మోటార్ శ్రీనివాసరావు, సురేష్‌బాబు, గోపీకృష్ణ, బాబురావు తదితరులు పాల్గొన్నారు

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

ఒంగోలు క్రైం, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం మిషన్‌లో నగదు దొంగిలించేందుకు దొంగలు విఫలయత్నం చేశారు. ఈ సంఘటన ఒంగోలు నగరం దిబ్బలరోడ్డులో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం పగుల గొట్టెందుకు దొంగలు ప్రయత్నం చేశారు. అయితే నగదు ఉన్న బాక్స్ తెరుచుకోక పోవడంతో పరారీ అయారు. నిత్యం పోలీసులు గస్తీ తిరిగే కర్నూల్‌రోడ్డుకు దగ్గరలో ఉన్న చోట ఏటీఎంలో దొంగలు చోరీకి ప్రయత్నం చేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

జగనన్న పాపం..

స్థలమేకాదు.. ఇల్లు నిర్మించి తాళాలు చేతిలో పెడతామన్నారు...

గుడారాలకే పరిమితం చేశారు

ఆ స్థలాలు కూడా అందరికీ ఇవ్వలేదు

ఇదీ అద్దంకి పట్టణం గుండ్లకమ్మ నది ఒడ్డున ఉంటున్న యానాదుల కుటుంబాల ఆవేదన

ఇచ్చిన వాటిల్లో గుడిసె వేసుకుంటామంటే ఒప్పుకోని అధికారులు



పాత దర్శి రోడ్డులో యానాదుల ఇళ్లు

అద్దంకి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని పాత దర్శి రోడ్డులో గుండ్లకమ్మనది ఒడ్డున సుమారు 10 యానాది కుటుంబాల వారు సుమారు 4 దశాబ్దాల నుంచి తాత్కాలిక గుడారాలు వేసుకొని నివాసం ఉంటున్నారు. వారికి కనీసం విద్యుత్, తాగునీటి వసతి కూడా లేదు. వైసీపీ పాలనలో వారికి స్థలాలు కేటాయించి ఇంటిని నిర్మించి తాళాలు చేతకి ఇస్తామని జగన్ చెపితే.. ఇక గుడారాల బతుకులకు తెరపడినట్లేనని వారు భావించారు. కానీ వారి ఆశలు నెరవేరలేదు. ఇళ్ల స్థలాలైతే ఇచ్చారుగానీ, ఇంటి నిర్మాణం చేసి ఇస్తామని చెప్పి మడమ తిప్పారు. ఇళ్ల స్థలాలు ఇవ్వడంలోనూ ఐదారు కుటుంబాలకే ఇచ్చారు. మిగిలిన వారికి ఇవ్వలేదు.

ఇంటిని నిర్మించే స్థోమత లేదు

కడు బీదవారమైన తాము ఇంటిని కట్టుకునే స్థోమత లేదని, ఆ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటామంటే అధికారులు ఒప్పుకోవడంలేదని యానాదులు వాపోతున్నారు. ఇళ్ల స్థలాలు ఉన్నా.. పాత గుడారాలలోనే బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేసుస్తున్నారు. స్థలాలు ఐదారు కుటుంబాలకే ఇవ్వగా, మిగిలిన వారికి ఇవ్వలేదు. దీంతో అందరూ అక్కడే నివాసముంటున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మిగిలిన కుటుంబాలకు కూడా స్థలాలు కేటాయించడంతో పాటు ఇంటిని నిర్మించి ఇస్తే సొంత గూడు ఏర్పడుతుందని వారు ఆశిస్తున్నారు.

ఇళ్లు కట్టిస్తామని చెప్తే ఆనందించాం.. ఆశ నిరాశైంది



అంజమ్మ

స్థలం ఇచ్చి ఇంటిని కట్టించి ఇస్తామని జగనన్న చెప్తే ఆనందించాం. నాగులపాడురోడ్డులో ఉన్న లేఅవుట్‌లో స్థలం ఇచ్చారు. కానీ ఇంటిని కట్టివ్వలేదు. ప్రభుత్వం ఇచ్చే డబ్బుతోపాటు అదనంగా వేసుకుని ఇల్లు కట్టుకునే స్థోమత లేదు. కనీసం మాకిచ్చిన స్థలంలో గుడారమైనా వేసుకుంటామంటే అధికారులు ఒప్పుకోవడం లేదు. దీంతో ఇక్కడే ఉంటున్నాం.

ఇంటి స్థలం ఇవ్వలేదు



చెంచమ్మ

ఇళ్ల స్థలాలు కొంతమందికే ఇచ్చారు. ఇంకా కొన్ని కుటుంబాలకు స్థలాలు ఇవ్వలేదు. కనీసం కరెంట్, నీళ్లు కూడా లేకుండానే జీవనం సాగిస్తున్నాం. ఇంటి స్థలం కేటాయించి, కట్టిస్తే అందరితో కలిసి ఉంటాం. కనీసం మా పిల్లల జీవితాలైనా బాగుపడేలా చేయండి.

ఏడాదైనా వీడని కేసు మిస్టరీ!

బోయనవారిపాలెంలో ఇసుక డంప్ చేస్తుండగా టిప్పర్‌లో గుర్తుతెలియని మృతదేహం

నేటికీ లేని పురోగతి

చంపారా ? లేక పొరపాటున జరిగిందా?

విచారణ జరుగుతోందంటున్న పోలీసులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై శివకుమార్(ఫైల్)

ఈపూరుపాలెం(చీరాల), ఏప్రిల్ 8 : ఇంటి నిర్మాణం కోసం తోలించుకుంటున్న ఇసుక లోడ్‌లో గుర్తుతెలియని సుమారు 40 ఏళ్ల వ్యక్తి మృతదేహం ఉండడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. ఈ ఘటన జరిగి సరిగ్గా ఏడాదైంది. నేటికీ కేసు పురగోతి కనిపించలేదు. ఈపూరుపాలెం పంచాయతీ పద్మనాభునిపేటలో ఈ ఘటన చోటుచేసుకుంది. అప్పటి ఎస్పీ వకుల్ జిందాల్ దీనిపై స్పందించారు. ఇది ఎవరు చేశారనే కోణంతోపాటు అసలు మృతుడు ఎవరనే ఆధారాల కోసం ముమ్మర ప్రయత్నాలు సాగించారు. ఆ క్రమంలో కొందరు ఇసుకాసురుల పలుకుబడితో ఆ అంశం గాలిలో కలిసింది. బాధిత బంధువులు ఎవ్వరూ ముందుకు రాకపోవడం కూడా వాస్తవాలు కనుమరుగునకు కలిసొచ్చింది. ఈ కేసు గుట్టు ఇంకా ఎంత కాలానికి వీడుతుందో చూడాలి.

అసలేమి జరిగింది

ఈపూరుపాలెం పంచాయతీ పద్మనాభునిపేటకు చెందిన ఓ వ్యక్తి తన ఇంటి నిర్మాణం చేపట్టారు. అందుకు అవసరమైన ఇసుకను నింపేందుకు గతేడాది ఏప్రిల్ మొదటి వారంలో సుమారు 10 ట్రక్కుల ఇసుకను తోలించారు. ఆ ఇసుకను నాలుగు రోజుల అనంతరం ఎక్స్‌కవేటర్‌తో బేస్‌మట్టంలో నింపుతుండగా అందులో మృతదేహం కనిపించింది. దీంతో అవాక్కయిన యజమాని విషయాన్ని ఈపూరుపాలెం పోలీసులకు చెప్పారు. అప్పటి సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, ఎస్సై మర్రి శివకుమార్ సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని వెలుపలకు తీయించగా నుజ్జునుజ్జయిన సుమారు 40 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు.

విచారించి చర్యలు చేపడతాం



ఎండీ మొయిన్, డీఎస్పీ, చీరాల

అప్పట్లో మృతుని తలభాగం దెబ్బతినడం వలన ఆనవాళ్లు గుర్తించలేని పరిస్థితి. అతని బంధువులు ఎవ్వరూ ముందుకు రాలేదు. ఈక్రమంలో సమస్య పరిష్కారం జరగలేదు. అతడి కుడిభుజంపై పచ్చబొట్టు మాత్రమే ఉంది. పూర్తి విచారణ అనంతరం చర్యలు చేపడతాం. నేరస్థులు తప్పించుకోలేరు.

ఉపాధి వేతనాలు కోసం కూలీల ఎదురుచూపులు

3 నెలలులుగా వేతనాల బకాయి



మార్టూరులో జరుగుతున్న ఉపాధిపనులు(ఫైల్)

మార్టూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులకు వెళ్లిన కూలీలకు 3 నెలలుగా వేతనాలు రాకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చిలో పనిచేసిన కూలీలకు ఇంతవరకు కూలి డబ్బులు వారి బ్యాంక్ ఖాతాలకు జమ కాలేదు. ఈ మూడునెలలకు సంబంధించి ఒక్కొక్కరు కనీసం 30 రోజులకు పైగా పనిచేశారు. దాంతో ఒకరికి సుమారు రూ.10 వేల దాకా కూలి వచ్చే అవకాశం ఉంది. ఇతర పనులు లేకపోవడం, ఉపాధి కూలి డబ్బులు రాకపోవడంతో ఇబ్బందిగా ఉందని కూలీలు వాపోతున్నారు. దీంతో మండలంలో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య కూడా తగ్గుముఖం పట్టింది. మంగళవారం సుమారు 3500 మంది ఉపాధి పనులకు కూలీలు వెళ్లారు. వాస్తవంగా మండలంలో రోజుకు 7 వేల మందికి పైగా కూలీలు ఉపాధి పనులకు వెళతారు. ఇంకా పూర్తి స్థాయిలో పనులకు అనుమతి రాకపోవడం వలన పనులు తక్కువగా జరుగుతున్నాయని కూలీలు చెప్తున్నారు. ప్రస్తుతం పంటకాలువలు, చెరువులు పూడిక, వాగులు వద్ద ఉపాధి కూలీలు పని చేస్తున్నారు. మరో వారం రోజులలో మరిన్ని పనులకు అనుమతి లభిస్తుందని, తద్వారా మరింత మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సిబ్బంది చెప్తున్నారు. అదేవిధంగా ఎండలు ఎక్కువగా ఉండడంతో కూలీలు పనిచేసే సమయంలో వారికి మంచినీరు, మజ్జిగ తదితర వసతులను అధికారులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

కొనుగోళ్ల పరిశీలన.. రైతులతో భేటీ

పొగాకు వేలం కేంద్రాలను సందర్శించిన ఈడీ విశ్వశ్రీ

నోబిడ్లు లేకుండా చూడాలన్న రైతులు, ధరల పెంపునకు వినతి



ఒంగోలు-2 లో కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఈడీ విశ్వశ్రీ

ఒంగోలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు పొగాకు వేలంకేంద్రాలను బోర్డు ఎగ్జిక్యూటి వ్ డైరెక్టర్ (ఈడీ) బి.విశ్వశ్రీ మంగళవారం సందర్శించారు. పొగాకు కొనుగోళ్ల తీరును పరిశీలించడంతో పాటు రైతులతో సమావేశాలు నిర్వహించారు. పక్షంరోజుల క్రితం పొగాకు బోర్డు ఈడీగా బాధ్యతలు స్వీకరించిన విశ్వశ్రీ తొలిసారి జిల్లాలోని వేలంకేంద్రాలు సందర్శనకు రాగా పొగాకు రైతులు ఘన స్వాగతం పలకడంతోపాటు ప్రస్తుతం మార్కెట్లో ఉన్న సమస్యలను కూడా ఆమె దృష్టికి తీసుకెళ్లారు. తొలుత త్రోవగుంట సమీపంలోని ఒంగోలు-2 వేలం కేంద్రానికి వచ్చిన విశ్వశ్రీకి అక్కడి రైతు ప్రతినిధులు వడ్డెళ్ళ వరప్రసాద్, మండవ శివన్నారాయణ, పెనుబోతు సునీల్, యర్రంనేని శేషయ్య, ఇతర అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వేలంకేంద్రంలో పొగాకు కొనుగోళ్లను పరిశీలించారు. ఆ తర్వాత టంగుటూరు, కొండపి, ఒంగోలు-1, వెల్లంపల్లి వేలం కేంద్రాలను కూడా సందర్శించారు. పొగాకు వేలం జరుగుతున్న తీరు, మార్కెట్‌లోకి వస్తున్న పొగాకు బేళ్ల నాణ్యత, లభిస్తున్న ధరలు, ఏ కంపెనీ బయ్యర్లు ఏ తరహా పొగాకు కొనుగోలు చేస్తున్నారు. ధరలు ఎంతమేర లభిస్తున్నాయి తదితర అంశాలను ఆయా వేలంకేంద్రాల్లో పరిశీలించారు. పలుచోట్ల తిరస్కరణకు గురైన బేళ్లను, వాటి గ్రేడ్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా వేలం కేంద్రాల్లో రైతులతో నిర్వహించిన సమావేశాల్లో పలువురు రైతు ప్రతినిధులు మాట్లాడుతూ కొన్నిరకాల బేళ్ల తిరస్కరణకు గురవుతున్న విషయాన్ని ఈడీ విశ్వశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఇస్తున్న ధరలు బాగా ఉన్నట్లుగా కనిపిస్తున్నా ఈ ఏడాది ఉత్పత్తి ఖర్చులు గణనీయంగా పెరిగాయన్నారు. ఈ నేపథ్యంలో ధరలు మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సగటు ధరలు పెరిగేలా చూడటంతోపాటు నోబిడ్‌లు లేకుండా చూడాలని కోరారు. రైతులు వినతిపై స్పందించిన ఈడీ విశ్వశ్రీ వచ్చే వారం వ్యాపార ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి ధరల విషయమై చర్చిస్తామని హామీ ఇచ్చారు. నోబిడ్ బేళ్లపై స్పందిస్తూ ప్రస్తుతం మార్కెట్లో కొనుగోళ్లు జరుగుతున్న గ్రేడ్ల రకం బేళ్లను వేలంకు తీసుకు రావాలని సూచించారు. పొగాకు బోర్డు వైస్‌చైర్మన్ బ్రహ్మయ్య, బోర్డు సెక్రటరి దివి వేణుగోపాల్, సభ్యుడు పొద వరప్రసాదరావు, ఆర్‌ఎం లక్ష్మణరావుపాల్గొన్నారు.

వాదులాట.. ఆపై సర్దుబాట

రెవెన్యూ, అటవీ శాఖాధికారుల చర్చలు

- సీబీజీ ప్లాంట్ స్థలం ప్లాంటు స్థలం వద్ద పరిశీలన



చర్చలు జరుపుతున్న రెవెన్యూ, అటవీ శాఖాధికారులు

కురిచేడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలం గంగదొనకొండ గ్రామం సర్వే నంబర్లు 88, 90 లలో ఏర్పాటుచేస్తున్న రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కుకు కేటాయించిన స్థలం వద్ద మంగళవారం రెవెన్యూ, అటవీ శాఖాధికారులు చర్చించారు. ఎవరి హద్దులు వారు చెక్ చేసుకున్నారు. వారి వారి రిపోర్టులు తయారు చేసుకుని ఉన్నతాధికారులకు పంపారు. తహసీల్దార్ రజనీకుమారి, సర్వేయర్లు, ఆర్ఐ, వీఆర్వోలతో రాగా, అటవీ శాఖ జిల్లా అధికారి వినోద్ కుమార్ తమ సిబ్బందితో వచ్చారు. ప్రారంభంలో ఇరు శాఖాధికారులు స్థలం మాదంటే మాదని వాదులాడుకొని చివరకు సర్దుకుపోయారు. ఉన్నతాధికారులు ఏం చెప్తే అదే చేద్దామనే నిర్ణయానికి వచ్చారు. మంగళవారం ఉదయం నుంచి ఎక్స్‌కవేటర్లతో చిల్లచెట్లను తొలగించే పనులు చేపట్టారు. పనులు జరుగుతుండగానే అధికారులు చర్చించుకున్నారు. అటవీ శాఖకు చెందిన డీఎఫ్‌వో వినోద్ కుమార్, అసిస్టెంట్ డీఎఫ్‌వో పి.శ్రీనివాసరావు, ఎఫ్‌ఆర్‌వో నరసింహారావు, డిప్యూటీ ఆర్‌వో బి.నాయక్, ఎఫ్‌బీవో ధనలక్ష్మి, తహసీల్దార్ రజనీకుమారి, ఆర్ఐ నాగరాజు, వీఆర్వో హనుమంతరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

అవీఇవీ

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య



సీతారాములకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేట లక్ష్మీ శ్రీనివాస కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ విజయ గణపతి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా స్వామి కల్యాణం, పట్టాభిషేకం, ఏకాంత సేవను తిలకించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మునిసిపల్ కమిషనర్‌పై పోలీసులకు ఫిర్యాదు

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని జరగనివ్వకుండా వ్యవహరించిన మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్‌పై చర్యలు తీసుకోవాలని వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు పలువురు వైసీపీ కౌన్సిలర్‌లు కోరారు. ఈమేరకు మంగళవారం వన్‌టౌన్ సీఐ నూరేపల్లి సుబ్బారావును కలిసి ఫిర్యాదు చేశారు.

నివేశన స్థలాలపై వివాదం

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : 1999లోనే ప్రభుత్వం తమకు పట్టాలు మంజూరు చేసిందని, ఆ స్థలాలను ఇప్పుడు ఖాళీ చేయమంటున్నారని మండల పరిధిలోని సాయికాలనీలోని కొందరు వ్యక్తులు తెలిపారు. ఇక్కడ కొంత స్థలానికి సంబంధించి నెలకొన్న వివాదంలో మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. ఇక్కడ నివాసముంటున్న వారిని ఖాళీ చేయించాలని కొంతమంది కక్షబూనినట్లు ఆరోపించారు. కోర్టు ఇప్పటికే మరొకరికి అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, ఆమేరకు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అంతా మా ఇష్టం

పట్టణంలో ఇష్టారీతిగా పార్కింగ్‌లు చేస్తున్న హైర్ బస్‌లు

రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



చీరాల - పేరాల రహదారిలో రోడ్డును ఆక్రమించి పార్కింగ్

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో రాత్రి వేళల్లో ఎక్కడ పడితే అక్కడ హైర్ బస్సులు పార్కింగ్ చేస్తున్నారు. చీరాల - పేరాల ప్రధాన మార్గంతోపాటు పట్టణంలోని పలు ప్రధాన మార్గాల్లో సైతం ఇష్టానుసారంగా బస్సులను నిలిపి ఉంచుతున్నారు. మమ్మల్ని అడిగేవారెవరు అన్నట్లుగా బస్సు డ్రైవర్లు పార్కింగ్ చేస్తున్నారు. సాధారణంగా హైర్ బస్సు సర్వీసు ముగిశాక వారు నిర్దేసించిన లేక నిర్ణయించుకున్న ప్రదేశాలలో మాత్రమే బస్సులను పార్కింగ్ చేయాల్సి ఉంది. కానీ డ్రైవర్‌లు మాత్రం ప్రధాన రహదారుల్లో వాహనాలు నిలిపి ఉంచడంతో మిగతా వాహనాలకు, ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్సీ కార్పొరేషన్‌కు పూర్వవైభవం

ఐదేళ్ల తర్వాత తిరిగి ప్రారంభమైన రుణాలు

ఎస్సీల్లో చిగురిస్తున్న ఆశలు

జగన్ హయాంలో మూలనపడ్డ పథకాలు

రుణాల మంజూరుకు 11 నుంచి దరఖాస్తులు



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

ఒంగోలు నగరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా మూలనపడ్డ ఎస్సీ కార్పొరేషన్‌కు కూటమి ప్రభుత్వం పూర్వవైభవాన్ని తేనుంది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటివరకు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా అమలు చేసిన అన్ని పథకాలను మూలన పడేసింది. ఒక్క ఎస్సీ కార్పొరేషన్ మాత్రమే కాదు బడుగుల ఆర్థికాభివృద్ధి కోసం పనిచేసే బీసీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లకు కూడా నిధుల లేకుండా చేసింది. వైసీపీ అధికారంలో ఉండగా కార్పొరేషన్ల ద్వారా ఎన్నో ఏళ్లుగా అమలు జరుగుతున్న అన్నిరకాల పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దుచేసింది. ఒక్క పైసా కూడా కేటాయించలేదు. దీంతో రాష్ట్రంలోని బడుగు వర్గాల ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి టీడీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిది నెలల కాలంలోనే కార్పొరేషన్లకు జవసత్వాలు తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే బీసీ కార్పొరేషన్ ద్వారా వేలాదిమందికి యూనిట్లును అందించేందుకు లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తిచేసింది. ఇదేవిధంగా బడుగుల కార్పొరేషన్లలో అగ్రగామిగా నిలిచే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కూడా పేదలకు రుణాలను అందించేందుకు రాష్ట్రప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది.

11నుంచి రుణాలకు దరఖాస్తులు

గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా ఉన్న అన్ని పథకాలను అమలు చేసేందుకు సిద్ధమైంది. ముందుగా బ్యాంకు లింకేజితో ఎస్సీలకు పెద్దఎత్తున రుణాలను అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకోసం ఈనెల 11వతేదీ నుంచి ఎస్సీల నుంచి రుణాల మంజూరుకు దరఖాస్తులను ఆహ్వానించింది. రాష్ట్రవ్యాప్తంగా రూ.800కోట్లకుపైగా రుణాల రూపంలో ఎస్సీలకు అందజేయనున్నారు. ఈనెల 11వతేదీ నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమై మే నెల 10వ తేదీతో గడువు ముగుస్తుంది. మే 20వ తేదీలోగా లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తవుతుంది. 60శాతం, 40శాతం సబ్సిడీతో యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం రుణాలను మంజూరు చేయనుంది. రూ.10లక్షలకుపైగా యూనిట్ విలువతో ఎస్సీలకు ప్రభుత్వం నుంచి రుణాలు మంజూరు కానున్నాయి. ఇందులో లబ్ధిదారుల వాటాగా 5శాతం చెల్లించాల్సి ఉంది. సబ్సిడీ గరిష్ఠంగా రూ.లక్ష అందజేయనున్నారు. రాష్ట్రప్రభుత్వం ముందుగా బ్యాంకు లింకేజి రుణాలకు దరఖాస్తులను ఆహ్వానించగా కొద్దిరోజుల్లోనే వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన అన్ని పథకాలను తిరిగి పునఃప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

రుణాల పేరుతో మోసం చేసిన వ్యక్తులపై కేసు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రుణాలు ఇప్పిస్తామంటూ, వ్యాపారాలలో పెట్టుబడి పెడితే బారీగా లాబాలు వచ్చేలా చేస్తామని పలువురిని నమ్మించి నగదు కాజేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు యస్ఐ బి.శ్రీకాంత్ తెలిపారు.నాగులుప్పలపాడు గ్రామానికి చెందిన తండ్రి కుమార్తెలు కోటి విజయ్‌కుమార్, కోటి స్మైలీ పలువురి వద్దనుండి పిఎంఇజిపి రుణాలు ఇప్పిస్తామని, బాతుల వ్యాపారం పేరుతో నమ్మబలికి పలువురు అమాయకుల వద్ద నుండి లక్షల్లో నగదును వసూలు చేయడంతో బాధితుల పిర్యాదు మేరకు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు యస్ఐ తెలిపారు.

నాడు ముద్దు.. నేడు వద్దు..!

» జిల్లా మార్పుతో కొత్త ఇబ్బందులు

» పోలీస్ సిబ్బంది అయిష్టంగా విధులు

అద్దంకి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు అద్దంకి పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కి పోస్టింగ్ అంటే ఎంతో ఇష్టంగా ఉండేది... అయితే ప్రస్తుత పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా మారింది. దీనికి కారణం అప్పుడు జిల్లా కేంద్రమైన ఒంగోలుకు సమీపంలో ఉండడంతో పాటు ఎప్పుడూ రవాణా సౌకర్యం ఉండేది. అయితే వైసీపీ నిర్వాకంతో జిల్లాల పునర్విభజనతో అద్దంకి నియోజకవర్గం కాస్తా బాపట్ల జిల్లాలోకి చేరింది. దీంతో మిగితా శాఖలతో పాటు ఆ షాక్ మరింత ఎక్కువగా పోలీస్ శాఖపై పడింది. బాపట్లకు అద్దంకి నుంచి సరైన రవాణా సౌకర్యం లేకపోవడం, సొంత వాహనం ఉంటే తప్ప త్వరగా చేరుకోలేని పరిస్థితి ఉంది. దీంతో అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో విధులు అంటే పనిష్‌మెంట్‌గా భావించే పరిస్థితి నెలకొంది. దీంతో సిబ్బంది కేటాయింపు జరిగినా బలవంతంగా వచ్చి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. తప్పని పరిస్థితులలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే విద్యాపరంగా, ఇతర వసతుల కోసం సిబ్బంది అత్యధిక శాతం బాపట్ల పరిసర ప్రాంతాలలో స్థిరపడి ఉండడంతో ప్రస్తుతం అక్కడ నుంచి అద్దంకి వచ్చి విధులు నిర్వహించడం కష్టంగా మారిందనే అభిప్రాయం నెలకొంది. ఇక అత్యవసరంగా విధులకు వెళ్లాల్సి వస్తే సిబ్బంది కోసం వెతుక్కోవాల్సి వస్తుందనే అభిప్రాయం నెలకొంది. అద్దంకి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా ఉండడంతో ప్రొటోకాల్‌కు సిబ్బంది వెళ్లాల్సి ఉంటుంది. ఇక అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ కూడా అస్తవ్యస్తంగా ఉండడంతో గాడిలో పెట్టేందుకు సీఐ సుబ్బరాజు అష్టకష్టాలు పడుతున్నారు. దీంతో సాయంత్రం, ఉదయం సమయాలలో సిబ్బంది అందరూ ట్రాఫిక్ విధులు నిర్వహించాల్సి



అద్దంకి పోలీస్ స్టేషన్

ఉంది. దొంగతనాలు అరికట్టేందుకు కూడా రాత్రి సమయాలో గస్తీ మరింత పెంచాల్సిన అవసరం కూడా ఉంది. పగలు సమయంలో అడపాదడపా బ్యాంక్‌లు, ఆర్టీసీ బస్టాండ్, రామాటాకీస్ రోడ్డు తదితర ప్రాంతాలలో కూడా గతంలో జరిగి ఉండడంతో పగలు సమయంలో కూడా సిబ్బంది నిఘా పెట్టి ఉంచాల్సిన అపసరం ఉంది. ఇలా సిబ్బంది మొత్తం పూర్తి సమయం విధులు నిర్వహించాల్సి రావడంతో వీలైనంత వరకు తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో ఆ ప్రభావం మిగిలిన సిబ్బందిపై పడి వాళ్ల కూడా ముఖం చాటేసే పరిస్థితి వచ్చినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో అద్దంకి పోలీస్ స్టేషన్‌కు మరింత ఎక్కువ మంది సిబ్బందిని కేటాయించే విధంగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాల పునర్విభజన చేసి మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేస్తామని ఇటీవల మార్కాపురం పర్యటనలో సీఎం చంద్రబాబు చెప్పారు. దీంతో అద్దంకి నియోజకవర్గం మరలా ప్రకాశం జిల్లా పరిధిలోకి చేరే అవకాశం ఉంది. అప్పుడు మరలా సిబ్బంది అద్దంకిలో విధులు అంటే పరుగెత్తే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.


బైటమంజులూరులో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్

రీ-సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

పంగులూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రీ-సర్వే ద్వారా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ వీ సింగారావు అన్నారు. మండలంలోని బైటమంజులూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వేలో సిబ్బంది గుర్తించిన నిర్దేశిత భూ వివరాలను తహసీల్దార్ సింగారావు మంగళవారం పరిశీలించారు. ల్యాండ్ వ్యాలిడేషన్‌తో పాటు, జారీ చేసిన 9 - 2 నోటీసుల గురించి తెలుసుకున్నారు. రీసర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద ఉండి సర్వే నిర్వహించే సిబ్బందికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

మే 19న శింగరకొండలో మహాకుంభాభిషేకం

ఏర్పాట్లను పరిశీలించిన శృంగేరి పీఠం శిష్య బృందం

అద్దంకి,ఏ ప్రిల్8(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి ముఖమండపం పనులు పూర్తయి మే 19వ తేదీన శృంగేరి పీఠాధిపతి పర్యవేక్షణలో మహాకుంభాభిషేకం జరుగనుంది. ఈ నేపథ్యంలో శృంగేరి పీఠం శిష్యబృందం మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. శమంతకశర్మ, విద్యాశంకర్ రాతి మండపం పనులు, మహాకుంభాభిషేకం సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో తిమ్మానాయుడు, వేదపండితులు హరిశంకరావధాని ఉన్నారు.

ముఖమండపానికి విరాళాల అందజేత


విరాళాన్ని అందజేస్తున్న గోపాలరావు, బసవమ్మ దంపతులు

అద్దంకి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో రాతి ముఖ మండపం నిర్మాణానికి రెండు కుటుంబాలు లక్ష రూపాయలు చొప్పున మంగళవారం అందజేశారు. అద్దంకి పట్టణంలోని నర్రావారిపాలెంకు చెందిన న ర్రా వెంకటరావు, రంగనాయకమ్మ జ్ఞాపకార్థం కుమారుడు రిటైర్డ్‌పీఈటీ గోపాలరావు, బసవమ్మ దంపతులు రూ.1,00,116, నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రానికి చెందిన నాయుడు వీరయ్యచౌదరి రాజ్యలక్ష్మి దంపతులు రూ.1,00,116 ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయాభివృద్ధికి రూ.5లక్షల విరాళం

పర్చూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వై.జంక్షన్‌లో ఏర్పాటు చేసిన 92 అడుగుల శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకొస్తున్నారు. ఇప్పటికే దాదాపు రూ.4కోట్ల వ్యయంతో ఆలయం రూపుదిద్దుకుంది. భక్తులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలన్న సంకల్పంతో ఆలయ కమిటీ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఆలయాభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మంగళవారం మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రావి రంగనాథబాబు ధర పత్ని నాగవర్ధిని రూ.5,25,116లక్షల విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా దంపతులను కమిటీ సభ్యులు అభినందించారు. కోటా హరిప్రసాద్, కఠారి సురేంద్రబాబు, రంగిశెట్టి ఆంజనేయులు, మంగళగిరి కోటేశ్వరరావు, క్రిష్ణంశెట్టి శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి నరసింహం, రంగిశెట్టి రామాంజనేయులు, తులసి శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోషణ పక్వాడా పక్షోత్సవంపై ర్యాలీ

చినగంజాం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామంలో పోషణ పక్వాడా పక్షోత్సవంపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆయాలు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్ పక్వాడా పక్షోత్సవ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వెబ్ కాస్ట్ లింక్ ద్వారా సిబ్బంది వీక్షించారు. మంగళవారం నుంచి ఈ నెల 22 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తెలిపారు. వంద రోజుల సంరక్షణ, లబ్ధిదారులు స్వయంగా పోషణ్ ట్రాకర్‌లో నమోదు చేసుకునే విధానం, కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ కార్యక్రమం, పిల్లలలో ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు అనే నాలుగు థీమ్‌లపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కె.వాణిశ్రీ, ఎన్.సుమలత, కె.ఉషాకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు అమృతం

పంగులూరు : తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని, ప్రతి తల్లి బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు శిశువుకు అందించాలని ఐసీడీఎస్ ముప్పవరం సెక్టార్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. పంగులూరులోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తల్లిపాల ప్రాధాన్యతను సూపర్‌వైజర్ పద్మావతి అంగన్‌వాడీ కార్యకర్తలకు వివరించారు. పోషణ్ పక్వాడా కార్యక్రమం ఈ నెల 8 నుంచి 22 వరకు జరగుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయమ్మ, జ్యోతిర్మయిబాబు, విశ్రాంత బ్యాంక్ అధికారి గుడిపూడి రామారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు సుకన్య, లత, అన్నమ్మ, రజని, పీరాబి, సులోచన పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో-2 సుధాకరరావు, ఉపాధ్యాయులు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు, విద్యార్థులకు అవసరమైన వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగపర్చుకోవాలని ఎంఈవో-2 బూదాటి సుధాకరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని సత్రంబడి పరిధిలోని గౌడపాలెం, గానుగపాలెంలో ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రత్యేక నమోదు కార్యక్రమంలో ఎంఈవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గృహాలను సందర్శించి 5 ఏళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా విద్యార్థులకు తల్లిదండ్రులు అవగాహన కల్పించారు. ఇద్దరు చిన్నారులను 1వ తరగతిలో చేరేలా నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వం విద్య కోసం ఎంతో ఖర్చు చేస్తుందన్నారు. ఉచిత పుస్తకాలు, యూనిఫాం, బ్యాగు, తల్లికి వందనం కింద రూ.15వేలను అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఈ రామారావు, ఉపాధ్యాయులు, సీఆర్పీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే గుర్రవారిపాలెంలో, బొమ్మనంపాడు, శంఖవరప్పాడు, తిమ్మాయపాలెం, వెంపరాల గ్రామాల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక నమోదు కార్యక్రమం నిర్వహించారు.

ఓటర్ ఎన్‌రోల్‌మెంట్‌పై అభ్యంతరాలు తెలపండి

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు


మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, పక్కన తహసీల్దార్ గోపీకృష్ణ

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఓటు కార్డు నవీకరణ (ఎన్‌రోల్‌మెంట్)లో అభ్యంతరాలు ఉంటే వెంటనే పరిష్కారం పొందాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో అన్ని పార్టీల రాజకీయ ప్రతినిధులతో, ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. నూతన, తొలగింపులు, మార్పులు, చేర్పులపై సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గ పరిధిలోని 218 పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఇప్పటి వరకు వచ్చిన సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీఎల్‌వోలతో మాట్లాడుతూ వచ్చిన అర్జీల్లో సమస్యలు ఉంటే నేరుగా అధికారి దృష్టికి తెచ్చి, సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, మునిసిపల్ డీఈ రఘురామ్, ఎలక్షన్ డీటీ సుశీల పాల్గొన్నారు.


మొండితోకపాలెంలో డ్రైన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

అద్దంకి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అన్ని ప్రాంతాలలో క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. పట్టణంలోని మొండితోకపాలెం, గు ర్రాలకాలనీ తదితర ప్రాంతాలలో కమిషనర్ పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరాను పరిశీలించారు. గుండ్లకమ్మ నదిలో ఊట బావుల వద్ద మంచినీటి పంపింగ్‌ను పరిశీలించారు.

22న మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన


చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈనెల 22న ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బత్తుల శామ్యేల్, నాగేశ్వరరావు, షైదయ్య, వెంకటేశ్వరమ్మ, విజయ, చాముండేశ్వరి, భారతి, అంజనికుమారి పాల్గొన్నారు.


విద్యార్థికి జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

టెక్నాలజీతో ఉన్నతంగా రాణించండి

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : విద్యాభ్యాసం చేసిన అంశాల్లో ముఖ్యమైన ఆధునిక టెక్నాలజీ, ఎలక్ట్రికల్ వెహికల్స్, సోలార్ ఎనర్జీ వంటి వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలని సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో బీటెక్ ఆఖరి సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సభ ఘనంగా జరిగింది. ఈసందర్భంగా వారికి స్ఫూర్తి దాయకమైన అంశాలపై పలు సూచనలు చేశారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. విద్యార్థులకు ప్రతినిధులు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.జగదీష్, డా.అనిల్‌కుమార్, డా.సీఎస్ రావు పాల్గొన్నారు.

శనగల తేమ శాతం 14కి మించరాదు


రైతులకు నిబంధనలు తెలియచేస్తున్న ఏవో, సీఈవో

పంగులూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):పంగులూరు మార్కెట్ యార్డ్ నందు శనగల కొనుగోలు కేంద్రంలో జేజే-11 రకం శనగలు కొనుగోలు చేస్తున్నట్లు వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి తెలిపారు. శనగల విక్రయంలో పాటించాల్సిన నిబంధనలను మంగళవారం ఏవో సుబ్బారెడ్డి, పీఏసీఎస్ సీఈవో లక్ష్మి రైతులకు వివరించారు. శనగ రైతులు తమ పంట విక్రయానికి రైతు సేవా కేంద్రాలలో తమ పేరు నమోదు చేసుకుని నిర్దేశిత సమయంలో పంటను అమ్ముకునే అవకాశం ఉందని తెలిపారు. క్లీనింగ్ కోసం డీ స్టోన్ చేయించాలని, తేమ శాతం 14కి మించకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం లో జేజే 11 రకం క్వింటాకు రూ.5,650 ధర నిర్ణయించినట్లు తెలిపారు. జె.పంగులూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారి పర్యవేక్షణలో శనగలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రారంభానికి సిద్ధంగా ప్రజారోగ్య కేంద్రం


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రజారోగ్య కేంద్రం

బల్లికురవ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నూతన భవనాలను ఏర్పాటు చేసింది. ఈ భవనం పనులు పూర్తి కావడంతో ప్రారంభం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50లక్షలను గుంటుపల్లి పీహెచ్‌సీలో క్షేత్ర స్థాయి ప్రజా ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన భవనాలకు మంజూరు చేసింది. ఈ నిధులతో 4 గదులు ఏర్పాటు చేశారు. ఈ గదులలో అన్ని రకాల పరీక్షలు చేసేందుకు ల్యాబ్, కంప్యూటర్ ఏర్పాటు చేయనున్నారు. ఈ భవనాలను అన్ని రకాల వసతులతో నిర్మాణం చేయడంతో ప్రభుత్వం త్వరలో నూతన పరికరాలను ఏర్పాటు చేసే అవకాశం ఉందని ప్రజలు తెలిపారు. ఈ భవనం ఈ నెలాఖరులో మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా ప్రారంభం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.


శింగరకొండలో ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద ధ్వజస్తంభం తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న ఈవో

కొనసాగుతున్న ధ్వజ స్తంభం తొలగింపు

మే 19న తిరిగి ప్రతిష్ఠ

అద్దంకి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో 1984లో ఏర్పాటు చేసిన ధ్వజ స్తంభాన్ని మంగళవారం తొలగింపు చర్యలు చేపట్టారు. 4 దశాబ్దాల కిందట పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ శంకరారెడ్డి సహకారంతో ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరిగింది. పూర్తిగా దెబ్బతినడంతో కొత్త ధ్వజ స్తంభం ఏర్పాటుకు వీలుగా సోమవారం పూజలు నిర్వహించి మంగళవారం ఈవో తిమ్మానాయుడు, ఆర్ఐ శంకర్, శింగరకొండపాలెం పంచాయతీ కార్యదర్శి చెన్నయ్య, ఏఎస్సై వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కార్యక్రమం సాగింది. అయితే ధ్వజ స్తంభం అడుగుభాగాన ఉన్న కాంక్రీట్ దిమ్మె పగలకపోవడంతో బుధవారం కంపర్సన్ ద్వారా తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు రూ.7కోట్ల రాతి ముఖ మండప నిర్మాణం పనులు పూర్తి చేసి మే నెల 19వ తేదీ కుంభాభిషేకం జరగనుంది. అదే రోజు మేదరమెట్ల శంకరారెడ్డి సహకారంతో సుమారు రూ.15 లక్షల వ్యయంతో కొత్త ధ్వజ స్తంభం ప్రతిష్ఠ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ధ్వజ స్తంభం చుట్టూ రాతి శిలామండపం నిర్మాణానికి శింగరాయకొండ మండలం కనుమళ్లకు చెందిన కాట్రగడ్డ అనిల్‌కుమార్ రూ.8లక్షలు ఇప్పటికే అందజేశారు.

కేజీబీవీలో వసతి గృహాల నిర్మాణం ప్రారంభం

బల్లికురవ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం రూ.1.20కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో విద్యార్థినుల వసతి గదులను నిర్మాణం చేయనున్నారు. మంగళవారం నుంచి నూతన భవనాల పనులను కాంట్రాక్టర్ ప్రారంభించారు. పిల్లర్ల ఏర్పాటుకు గుంతలు తీసి పనులు ప్రాంభించారు. ఆరు నెలల వ్యవధిలో పూర్తి స్థాయిలో పనులు చేయిస్తామని ఏఈ రాజన్‌బాబు తెలిపారు.

గోశాలకు తవుడు అందజేత

అద్దంకిటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో అద్దంకిలోని హరి హర గోశాలకు మంగళవారం తవుడును అందజేశారు. అమృతాహార క్యాంటీన్ యజమాని మంగరావు, రోటరీ మిత్రుల సహకారంతో హరిహర గోశాలకు 7 బస్తాల తవుడును అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, కురిచేటి చిన్ని, గోశాల నిర్వహకుడు సుబ్బారావు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపుపై నిరసన

మార్టూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరను రూ.50కి పెంచడంపై రైతు సంఘం నాయకులు ఆధ్వర్యంలో మంగళవారం మహిళలు కట్టెలతో వంటచేసి తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో బత్తుల హనుమంతరావు, బి సూరిబాబు, లక్ష్మి పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

పర్చూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రైతులు ముందుగా ప్రతి మూడు సంవత్సరాలకోసారి భూసార పరీక్షలు తప్పక చేయించుకునే విధంగా సిబ్బంది అవగాహన కల్పించాలని ఏడీఏ ఎన్.మోహనరావు అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో మంగళవారం పర్చూరు సబ్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై త్వరలో మహిళా సమాఖ్య భవనాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఏడీఏ చెప్పారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఏవోలు, ఏఈవోలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కోలలపూడి విద్యార్థినికి ఏపీ మోడల్ స్కూల్‌లో సీటు

మార్టూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్‌లో 5 వతరతగతి చదువుతున్న యడవల్లి లాస్య ఏపీ మోడల్ స్కూల్‌లో 6 వతరగతిలో ప్రవేశానికి సీటు సాధించినట్లు మంగళవారం ప్రధానోపాధ్యాయులు గోగినేని బాలకృష్ణ తెలిపారు.

హోమియో వైద్యంతో శాశ్వత పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పలు రోగాలకు హోమియో మందులతో శాశ్వత పరిష్కారం ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం రోటరీ కమ్యూనిటీ భవనంలో హోమియో పితామహుడు, శాస్త్రవేత్త డా.శామ్యూల్ హానిమూన్ జయంతి వేడుకలను ముందస్తుగా నిర్వహించారు. చీరాల హోమియో ఫిజిషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హానిమూన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళల నెలసరి, చిన్నారుల ఎదుగుదల, సీజనల్ వ్యాధులపై హోమియో మందుల ప్రభావాన్ని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు డా. శ్రీనివాస్, డేగల శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సురేష్‌బాబు, పోలుదాసు రామకృష్ణ, గవీష్, మురళీకృష్ణ, డా.ప్రదీప్, డా.అశోక్ పాల్గొన్నారు.


మోటార్ సైకిల్ ఢీకొని వ్యక్తికి గాయాలు

అద్దంకి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై నడిచి వస్తున్న వ్యక్తిని వెనుక నుంచి మోటార్ సైకిల్ ఢీకొనడంతో గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తిమ్మాయపాలెం సమీపంలో ఇటుక బట్టీల వద్ద పనిచేసే కట్టమూరి అప్పన్న సోమవారం రాత్రి సమీపంలోని టీ దుకాణంలో మరో వ్యక్తితో కలిసి టీ తాగి వస్తుండగా శంకరాపురం వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని మోటార్‌సైకిలిస్టు ఢీకొని వెళ్లిపోయాడు. క్షతగాత్రుడిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఒంగోలు రిమ్స్ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు. అద్దంకి సమీపంలోని కలవకూరు రోడ్డులో మంగళవారం సాయంత్రం మొక్కజొన్నల బస్తాలతో వెళ్తున్న ట్రాక్టర్‌కు ఎక్స్‌కవేటర్ తగలడంతో కొన్ని బస్తాలు రోడ్డుపై పడ్డాయి. అయితే ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవటంతో ఊపిరిపీల్చుకున్నారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

అవిశ్వాసం నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కౌన్సిల్ హాల్లో బుధవారం సాధరణ సమావేశం జరుగనుంది. ఆ సమాచారాన్ని కమిషనర్ అబ్దుల్ రషీద్ అధికారికంగా తెలియజేశారు. ఇటీవల జరిగిన అవిశ్వాసం అంశం తార స్థాయికి చేరిన క్రమంలో జరిగే ఈ సమావేశం ఉత్కంఠగా మారనున్నట్లు తెలుస్తోంది. అజెండాలో పొందు పరిచిన అంశాలతో పాటు ఎలాంటి పరిస్థితులు చోటుచేసుకుంటాయోనని అందరి కళ్లూ కౌన్సిల్ వైపు మారాయి.



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	37	28
కావలి	34	26
ఆత్మకూరు	36	25
ఉదయగిరి	38	25
కందుకూరు	36	27

విద్యారంగ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన సమగ్రశిక్షా భియాన్(ఎస్ఎస్ఏ)లో అసలేం జరుగుతోందో కూడా తెలియని పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి.. సెక్టోరియల్ అధికారులు, ప్రాజెక్ట్ పర్యవేక్షించే అధికారులు ఎవరికివారు ఇష్టానుసారంగా అందినంత దోచుకుంటుండడంతో ఈ శాఖ అవినీతికి అడ్డాగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సమగ్రశిక్షలో ఏం జరుగుతోంది!?

- అక్రమార్జనకు అడ్డాగా ఎస్ఎస్ఏ
- కొందరు అధికారుల తీరుపై విమర్శల వెల్లువ
- అన్నీ తెలిసినా ఉన్నతాధికారుల కునుకు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : అందరికీ విద్య అందించడం, విద్యాహక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం సమగ్రశిక్ష ఉద్దేశం. ఇందులోని విభాగాలకు సెక్టోరియల్ అధికారులుగా గెజిటెడ్ హోదా ఉన్న సీనియర్ ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై రాత పరీక్ష ద్వారా నియమిస్తారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వంలో లాబీయింగ్‌లకు పాల్పడే వారికి, రాజకీయ పలుకుబడి ఉన్న వారే ఈ పోస్టులకు వచ్చారన్న విమర్శలు ఉన్నాయి. ప్రత్యామ్నాయ పాఠశాలల విభాగం, ఐఈఆర్‌టీ (విలీన విద్య, పాఠశాల ఆరోగ్య విద్య)లో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఇష్టానుసారంగా వ్యవహరి స్నారని కార్యాలయంలో తీవ్ర చర్చ లు జరుగుతున్నాయి. విలీన విద్య విభాగంలోని భవిత కేంద్రాల నిర్వహణకు వచ్చే నిధులు, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వచ్చే అలవెన్స్‌లు, ఎస్కార్ట్ అలవెన్స్‌లు బాధితులకు సక్రమంగా అందడం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

ప్రత్యామ్నాయ పాఠశాలల్లో అక్రమాలు

పొరుగు ప్రాంతాలకు వలస వెళ్లే వారి పిల్లల కోసం ఏర్పాటు చేస్తున్న ప్రత్యామ్నాయ పాఠశాలల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అవుట్ సోర్సింగ్ నియామకాల దగ్గర నుంచి వారి బదిలీలు, వేతనాలు ఇవ్వడంలోనూ భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు సమాచారం. ఆ స్కూళ్ల నిర్వాహకులతో ఒప్పందం చేసుకుని వచ్చిన ఆదాయంలో నిర్వాహకులు, సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు వాటాలు పంచుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే బడిబయట పిల్లలను బడిలో చేర్పించినట్లు లెక్కలు చూపించడం, నామమాత్రంగా తనిఖీలు చేయడం, ఎక్కడా తిరగకుండానే బిల్లులు పెట్టుకోవడం ఆనవాయితీగా మారింది. నగరంలో ఓ పోలీసు ఉన్నతాధికారి ఏర్పాటు చేసిన కేంద్రాన్ని కూడా ఎస్ఎస్ఏకు అప్పగించడంతో దీన్ని కూడా ఎస్ఎస్ఏ అధికారులు తమ ఆదాయవనరుగా మార్చుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కేంద్రానికి విడుదల చేసే నిధులు సంబంధిత శాఖ సిబ్బంది జేబుల్లోకి వెళుతున్నాయన్న ఆరోపణలూ వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అయినా ఈ శాఖను ప్రక్షాళన చేస్తారనుకున్నా నేటికీ ఎవరూ దృష్టి సారించక పోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా పాలనాధికారి దృష్టి సారించాలని విద్యా ప్రముఖులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎలక్ట్రిక్ బస్సులు.. మనకు 100

- పీఎం ఈ-బస్ సేవ కింద జిల్లాకు కేటాయింపు
- 2027 చివరికల్లా రానున్న బస్సులు
- నెల్లూరు-2వ డిపోలో భారీ చార్జింగ్ పాయింట్లు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పీఎం ఈ-బస్ సేవ కింద మొదటి దశలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 750 ఎలక్ట్రికల్ బస్సులు మంజూరు చేసింది. ఈ క్రమంలో నెల్లూరు ఆర్టీసీ-2వ డిపోకు 100 బస్సులను రాష్ట్రం కేటాయించింది. మొదటి విడత టెండర్లలో పూణెకు చెందిన పిన్నాకిల్ మొబిలిటీ సొల్యూషన్స్ అనే సంస్థ బస్సుల కాంట్రాక్టు దక్కించు కుంది. 2027 సంవత్సరం చివరికల్లా ఈ ఎలక్ట్రికల్ బస్సులు పూర్తిస్థాయిలో జిల్లాకు చేరుకోనున్నాయి. నెల్లూరు నగరంతో పాటు చెన్నై, తిరుపతి ఇతర ప్రాంతాలకు కూడా ఎలక్ట్రికల్ ఏసీ బస్సులను నడపనున్నారు. కాగా, నెల్లూరు-2వ డిపోకు బస్సులను కేటాయించినా జిల్లావ్యాప్తంగా పది డిపోలకు ఈ బస్సులను కేటాయించి ఆయా ప్రాంతాల్లో తిప్పేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

రూ.1.5 కోట్లతో చార్జింగ్ స్టేషన్

ఇప్పటిదాకా నెల్లూరు-2వ డిపో ఆధ్వర్యంలో తిరుపతి డిపోకు చెందిన ఎలక్ట్రికల్ బస్సులను నెల్లూరు-తిరుపతి మధ్య నాన్‌స్టాప్ సర్వీసులుగా నడుపుతున్నారు. ఈ బస్సుల కోసం రెండవ డిపోలోని గ్యారేజ్‌లో చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా జిల్లాకు రానున్న 100 ఎలక్ట్రికల్ బస్సుల కోసం రెండవ డిపో గ్యారేజీలోనే 25 చార్జింగ్ పాయింట్లతో భారీ చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులు అడుగులు ముందుకు వేస్తున్నారు. 25 చార్జింగ్ పాయింట్లతో ఏర్పాటు చేసే ఈ భారీ చార్జింగ్ స్టేషన్‌కు రూ.1.50 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.



బండ భారం రూ.3.9 కోట్లు

- ఏడాది తర్వాత సిలిండర్‌పై రూ.50 పెంపు
- రేపు నగరంలో సీపీఎం భారీ నిరసన

నెల్లూరు (హర నాథ పురం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : సరిగ్గా ఏడాది తర్వాత గ్యాస్ విని యోగదారులపై కేంద్రప్రభుత్వం ధరల మోత మోగించింది. 14.2 కిలోల సబ్సిడీయేతర సిలిండర్‌పై రూ.50 పెంచగా, మంగళవారం నుంచే అమలులోకి వెచ్చింది. నిత్యా వసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటిన తరుణంలో గ్యాస్ ధర పెంపు సామాన్యులకు పెనుభారంగా మారింది. 2024, ఫిబ్రవరిలో సిలిండర్ ధర రూ.940 ఉండగా, మార్చిలో రూ.100 తగ్గించింది. దీంతో సిలిండర్ ధర రూ.840లకు చేరింది. అప్పటి నుంచి అదే ధర కొనసాగు తోంది. ప్రతినెలా వంట గ్యాస్ ధర పెంపుదలపై చర్చించే గ్యాస్ కంపెనీ లు ఒకటో తేదీనే పెంపు నిర్ణయం తీసుకుంటుంటాయి. ఈసారి 7వ తేదీన ఆ నిర్ణయం తీసుకున్నాయి. జిల్లాలో ఎల్‌పీజీ వినియోగదారులకు ఇండేన్, హెచ్‌పీ, భారత్ గ్యాస్ ఏజెన్సీల ద్వారా సిలిండర్లు సరఫరా అవు తున్నాయి. రూ.50 పెరగడంతో సిలిండర్ ధర రూ.890లకు చేరింది. ప్రభుత్వం మాత్రం ఒక్కో సిలిండర్‌కు రూ.18.74 సబ్సిడీ ఇస్తోంది.

జిల్లాలో 7.87 లక్షల కనెక్షన్లు

జిల్లావ్యాప్తంగా 7,87,484 గ్యాస్ కనెక్షన్లు ఉండగా, వీటిలో 2616 వాణి జ్య కనెక్షన్లు ఉన్నాయి. ఇవిపోనూ జిల్లాలో సబ్సిడీయేతర సిలిం డర్లు 7,84,867 ఉన్నాయి. ఒక్కో సిలిండర్‌పై రూ.50 పెరగడం వల్ల వినియోగ దారులపై నెలకు రూ.39.24కోట్ల అదనపు భారం పడింది. ఇదిగాక డెలివరీ డెలివరీ బాయ్‌కు రూ.30 నుంచి 50 చెల్లించాల్సి వస్తోంది.

భగ్గుమన్న సీపీఎం

నెల్లూరు (వైద్యం) : వంటగ్యాస్ ధర పెంపుపై సీపీఎం శ్రేణులు భగ్గుమన్నాయి. మంగళవారం నగరంలోని 23, 24, 30, 36వ డివిజన్లలో మహిళలతో కలిసి సీపీఎం నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై సిలిండర్లు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పెంచల నర్సయ్య మాట్లాడుతూ ఇప్పటికే ప్రజల్లో కొనుగోలు శక్తి కోల్పోతున్న స్థితిలో గ్యాస్ ధర పెంపు సామాన్యుల నెత్తిన బండ మోపడమేనని మండిపడ్డారు. అంతర్జాతీయ ముడిచమురు ధరలు తగ్గుతున్నా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి భారాలు మోపటం ఏమిటని ప్రశ్నించారు. వంటగ్యాస్ ధరల పెరుగుదలకు నిరసనగా 10వ తేదీన గాంధీబొమ్మ వద్ద భారీ నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ఆందోళనలో సీపీఎం నాయకులు అజీజ్, కండె కోటేశ్వరరావు, మాలకొండయ్య, సుధీర్, షాహినాబేగం, వీర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



నగరంలో రోడ్డుపై సిలిండర్లు ఉంచి మహిళలతో కలిసి ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పీఎంజేఏవై వైద్యకార్డులకు పేరు నమోదు చేసుకోండి

70 ఏళ్ల పైబడిన వారికి మంజూరు

ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కో ఆర్డినేటర్ సుధీర్‌కుమార్

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) కార్డుద్వారా దేశంలో ఏ నెట్‌వర్క్ ఆసుపత్రులలో అయినా వైద్యసేవలు పొందే అవకాశం ఉందని ఎన్టీఆర్ వైద్యసేవ పథకం జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం నెల్లూరు జీజీహెచ్‌లోని ఆరోగ్యశ్రీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 70 ఏళ్లపైబడిన వృద్ధులు ఈ కార్డు పొందేందుకు అర్హులని తెలిపారు. ఈ కార్డు కలిగిన వృద్ధుడి కుటుంబ సభ్యులకు కూడా రూ.5 లక్షల వరకు వైద్యసేవలు పొందే అవకాశం ఉంటుందని వెల్లడించారు. ప్రస్తుతం సచివాలయాల్లోని ఏఎన్ఎంలు వృద్ధుల పేర్లు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. తెల్లరేషన్ కార్డు ఉండాలని, ప్రభుత్వ ఉద్యోగ పెన్షనర్లు అనర్హులుగా తెలిపారు. జిల్లాలో 1,40,846 మంది వృద్ధులు ఉండగా ఇప్పటికే 10,064 మందిని ఈ పీఎంజేఏవై కార్డు కోసం నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం జిల్లా మేనేజర్ వెంకట మురళి పాల్గొన్నారు.

భూసార పరీక్ష కేంద్రానికి జాతీయ గుర్తింపు

నెల్లూరు (వ్యవసాయం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని భూసార పరీక్ష కేంద్రానికి (ఎస్‌టీఎల్) జాతీయ స్థాయి ప్రయోగశాలగా గుర్తింపు లభించిందని ఆ కేంద్రం ఏడీఏ కన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ సంస్థ అయిన బోర్డ్ ఆఫ్ టెస్టింగ్, కాలిబ్రేషన్ ప్రయోగశాల సంస్థ నెల్లూరు భూసార పరీక్షా కేంద్రంలో జరుగుతున్న ప్రయోగ పరీక్షలు, వాడే పరికరాలు, పరీక్షలు చేసే విధానం వంటి వివిధ రకాల పరిశీలనలు జరిపి జాతీయస్థాయి ప్రమాణాలు కలిగిన ప్రయోగశాలగా గుర్తింపు ధ్రువీకరణ పత్రం అందించినట్లు పేర్కొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక


రూ.51.81 కోట్లతో 1,240 యూనిట్లు

ఈ నెల 14 నుంచి దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్‌తో ఈ ఏడాది రూ.51.81 కోట్లతో 1240 మంది లబ్ధిదారులకు పలు యూనిట్లు మంజూరు చేయడానికి కార్యాచరణ రూపొందించినట్లు కలెక్టర్ ఆనంద్ ప్రకటనలో తెలిపారు. మంజూరైన యూనిట్లలో రూ.20.46 కోట్లు సబ్సిడీగా, రూ.28.75 కోట్లు బ్యాంకు రుణాలుగా, రూ.2.59 కోట్లు లబ్ధిదారుల వాటాగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 14 (అంబేడ్కర్ జయంతి) నుంచి మే 10వ తేదీలోగా ఆన్‌లైన్ (ఓబీఎంఎంఎస్) దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మే 11 నుంచి మే 20వ తేదీ వరకు మండల సెలక్షన్ కమిటీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని వివరించారు. మే 21 నుంచి 27వ తేదీ వరకు లబ్ధిదారుల జాబితాను ఎంపీడీవోలు బ్యాంకులకు పంపుతారని తెలిపారు. మే 28 నుంచి జూన్ 12వ తేదీ వరకు బ్యాంకులో రెండు ఖాతాలు ఓపెన్ చేసుకోవాలని తెలిపారు. జూన్ 13 నుంచి 20వ తేదీ వరకు లబ్ధిదారులకు పరిపాలనాపరమైన ఉత్తర్వులు ఇస్తామని, ఆగస్టు 9 లోగా యూనిట్లు గ్రౌండ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రూ.3లక్షలలోపు యూని ట్లు 226, రూ.10లక్షలలోపు యూనిట్లు 628 ఉన్నట్లు వివరించారు.

ఇళ్ల క్రమబద్ధీకరణ అవకాశాన్ని వినియోగించుకోవాలి

నిరభ్యంతరం లేని భూముల్లో 2019 అక్టోబరు 10వ తేదీ కంటే ముందు ఇళ్లు నిర్మించుకున్న వారి ఇళ్లను క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని కలెక్టర్ ఆనంద్ చెప్పారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయన అధికారులతో మాట్లాడారు. మీసేవ, సచివాలయాల్లో అన్ని ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరుతో జారీ చేసి రెండేళ్ల తరువాత యాజమాన్య హక్కులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



రెండేళ్ల తర్వాత ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రొయ్యల మార్కెట్‌కు ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశీ ఉత్పత్తులపై సుంకం విధించే క్రమంలో భారత్ నుంచి ఎగుమతయ్యే రొయ్యలపై సుంకాన్ని 26 శాతం చేశారు. ఈ నిర్ణయంతో ఆక్వారంగం కుదేలవుతోంది. ఇదేఅదునుగా దళారులు ధరలు తగ్గించేసి చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వాస్తవంగా 16 దేశాలకు భారత్ నుంచి రొయ్యలు ఎగుమతి అవుతుండగా అమెరికా మినహా ఎక్కడ సమస్య లేకున్నా అమెరికా బూచిన చూపుతున్నారు. దీంతో ధరలు పతనమై వంద కౌంట్ రొయ్యలను కొనుగోలు చేసే వారే కరువయ్యారు. అయితే, రొయ్యల సాగుదారుల పరిస్థితిని గమనించిన సీఎం చంద్రబాబు కేంద్రమంత్రులకు లేఖలు రాయడంతో ధరలు కొంతమేర పెరిగి స్థిరత్వాన్ని చూపాయి.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)

ట్రంప్ బూచి.. దళారులు దోచి!

- సుంకం పెంపు పేరుతో ధరల పతనం
- వంద కౌంట్ రొయ్యలు కొనేవారే కరువు
- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో స్థిరపడిన రేట్లు

జిల్లాలో తీరప్రాంతంలో కావలి నుంచి మనుబోలు వరకు ఆక్వా రంగం ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ రంగంలో రాష్ట్రంలోనే జిల్లా ప్రత్యేక స్థానం కలిగి ఉంది. రెండేళ్ల క్రితం వరకు ధరలు పతనం కావడంతో సాగుదారులు ఆర్థికూబి లో కూరుకుపోయారు. అయితే, ఆ తర్వాత నుంచి కొంతమేర ధరలు స్థిరత్వాన్ని సంతరించుకోవడంతో ఈ దఫా అత్యధికమంది రైతులు రొయ్యల సాగు చేపట్టారు. ఈసారి దాదాపు 23 వేల హెక్టార్లకుపైగా రొయ్యల గుంతలు ఉన్నాయి. అప్పులు చేసి రేయింబవళ్లు చెపటోడ్చి సాగు చేసిన రొయ్యలపై డొనాల్డ్ ట్రంప్ నూతన విధి విధానాల్లో భాగంగా సుంకం వేయడంతో సాగుదారులకు మరో దెబ్బ తగిలింది.

విదేశీ నగదు జిల్లాకు

జిల్లాలో చేపట్టే రొయ్యల పెంపకం ద్వారా దాదాపు రూ.వెయ్యి నుంచి రజా.1500 కోట్ల వరకు ఆదాయాన్ని తెచ్చిపెడుతుంది. ఇంత మొత్తంలో అంతర్జాతీయస్థాయిలో రొయ్యల ద్వారా విదేశీ నగదును మన దేశానికి రప్పించే రంగంగా ఆక్వా రంగం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ క్రమంలో అమెరికాలో జరిగిన మార్పుల కారణంగా దళారీ వ్యవస్థ ఇదే అదునుగా వారి పనితనాన్ని చూపుతోంది.

ధరలు ఇలా

జిల్లాలో అత్యధికంగా వెనామీ రకం రొయ్యలు సాగులో ఉన్నాయి. 100 కౌంట్‌కు తక్కువగా ఉన్న రొయ్యలకు మాత్ర మే జాతీయ మార్కెట్లో ఎగుమతికి అవకాశం ఉంటుంది. 100 కౌంట్ నుంచి 20 కౌంట్ వరకు రొయ్యలకు గిరాకీ కూడా ఉంటుంది. ఈ క్రమంలో సైజులను బట్టి ధరలు పెరుగుతూ ఉండటంతో 30 కౌంట్ రొయ్యలు గతంలో రూ.460 ఉండగా ప్రస్తుతం రూ.360లకు, 40 కౌంట్ ధర రూ.405 నుంచి రూ.340లకు, 50 కౌంట్ రూ.370 నుంచి రూ.320లకు, 60 కౌంట్ రొయ్యలు రూ.340 నుంచి రూ.290లకు, 70 కౌంట్ రూ.320, 70 కౌంట్ రూ.285 నుంచి 260లకు పలుకుతోంది. అదేవిధంగా 100 కౌంట్ రొయ్యల గతంలో రూ.260 ఉండగా ప్రస్తుతం తీసుకునే నాథుడు కరువయ్యాడు. 100 కౌంట్ సైజుకు రొయ్యల పెంపకం చేపట్టాలంటే రూ.220 ఖర్చు కాగా మార్కెట్లో వీటి ధర రూ.240 మాత్రమే ఉంటోంది. అంటే రైతుకు రూ.20 మిగులుతుంది.



అమెరికా బూచీ.. దళారుల దోపిడీ

అమెరికాలో సుంకం చెల్లించాలనే ఒకే ఒక్క కారణంతో దళారులు రైతులను దోచుకునేందుకు సిద్ధపడుతు న్నారు. అమెరికానే కాకుండా భారత్‌లోని రొయ్యలు దాదాపు 16 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అక్కడ ఇటువంటి సమస్యలు లేకున్నా అమెరికా బూచిని చూపించి దళారులు ఎంచక్కా రైతులను తీవ్రంగా దోచుకుంటున్నారు. దీనినే మార్కెట్ మాఫియా అని కూడా అంటుంటారు.

తగ్గని మేత ధర

రోజులో మూడు దఫాలు రొయ్య పిల్లలకు మేతను అందించాల్సి ఉంటుంది. ఈ మేత కిలో రూ.84 వరకు ధర పలుకుతోంది. ముడిసరుకులు కొనాలంటే కిలోకు రూ.35 నుంచి 45 వరకు ఖర్చవుతుండగా రైతులకు మాత్రం రూ.84 నగదు చెల్లింపుతోనూ రూ.92 వరకు అప్పుగానూ ఇవ్వడం పరిపాటిగా మారింది. దీనిని ప్రభుత్వాలు ఎందుకు నిలువరించలేకున్నాయంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.



గుంతల్లో పట్టిన వెనామీ రకం రొయ్యలు



సంపద ఉత్పత్తి సమయంలోనే సమస్యలు

నలువైపులా రొయ్యల సంపద ఉత్పత్తి అయ్యే సమయంలోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ధరలను దిగజార్చి కృత్రిమ మార్కెట్‌ను సృష్టిస్తున్నారు. రైతులు అంటేనే మార్కెట్ మాఫియాకి పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణసంకటం అన్న చందంగా మారిపోయింది

- చిరంజీవి, ఆక్వా రైతు, అల్లూరు పేట, అల్లూరు మండలం



సీఎం చొరవతో నిలకడగా ధరలు

ధరలు పతనమైన క్రమంలో వెంటనే అప్రమత్తమైన రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకున్న చర్యలతో నేడు ధరలు నిలకడగా మారాయి. 100 కౌంట్ ధర రూ.220 ఉండటంతో అనుకున్న మేర నష్టం వాటిల్లే పరిస్థితి లేదు కానీ రైతులకు ఆదాయం మాత్రం ఉండదు. మేత ధరలు తగ్గితే రైతులను ఆదుకునే అవకాశం ఉంటుంది. ఈ దిశగా ముఖ్యమంత్రి, ఆక్వా రంగ ప్రభుత్వ సంస్థలు పనిచేస్తే మరింత మేలు చేకూరుతుంది.

- నీలపరెడ్డి హరీశ్‌రెడ్డి, ఆక్వా రైతు, అల్లూరు

దళారులు దోచేస్తున్నారు



అమెరికాలో సుంకం విధిస్తున్నారంటూ ధరలు తగ్గించి దళారులు దోచుకుంటున్నారు. ఒక్క అమెరికాకే కాకుండా ఇతర దేశాలకు కూడా ఎగుమతులు జరుగుతుండగా కేవలం అమెరికాలో సుంకం అనే పేరుతో దళారీ వ్యవస్థ ధరలు తగ్గించడం దారుణం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా చర్యలు తీసుకొని విదేశాల్లోని కొనుగోలుదారులను పిలిపించి చర్యలు జరిపి నేరుగా విక్రయిస్తే రైతులకు, కొనుగోలుదారులకు మేలు చేకూరుతుంది. ఈ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలి.

- బిట్రగుంట రమేష్‌రెడ్డి, ఆక్వా రైతు, అల్లూరు

కష్టపడి పెంపకం చేపడితే నష్టాలు

కష్టపడి పెంచిన రొయ్యలకు విదేశీ మార్కెట్లో గిరాకీ ఉన్నా స్థానికంగా తక్కువ ధరలుకు కొనుగోలు చేస్తున్నారు. దళారులకే మా ఆదాయాన్ని దోచిపెట్టాల్సి వస్తోంది. ఈ పరిస్థితి నుంచి రైతులకు విముక్తి ఎప్పుడు లభిస్తుందో అర్థం కాకుండా పోయింది. అమెరికాలో సుంకం అనే పేరుతో దళారులు తమ ఇష్టానికి ధరలు తగ్గించేసి సాగుదారులను దోచుకుంటున్నారు. ఈ పద్ధతిని మార్చే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకొని నూతన ఒరవడిని తీసుకురావాలి.



- కత్తుల విజయ్ కుమార్, ఆక్వా రైతు, అల్లూరు.

నలుగురు సబ్ రిజిస్ట్రార్లపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశం

వివరాలు 8లో..

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	110
స్కిన్ చికెన్	198
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 440

సీతారాములకు ఏకాంత సేవ

కావలిటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని రామాలయాల్లో నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. దక్షిణంపేట కోదండరామ స్వామి ఆలయంలో సీతారాములకు ఏకాంత సేవలు, వైకుంఠ దర్బార్ అలంకారం పూజలు కనుల పండువగా జరిగాయి. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. ఏకాంత సేవకు ఉభయదాతలుగా సువర్ణహోమ్‌నీడ్స్ శ్రీనివాసులు, సువర్ణ దంపతులు వ్యవహరించారు. జనతాపేట బ్రిడ్జిడౌన్‌లోని సీతారామస్వామి దేవస్థానంలో మధ్యాహ్నం వసంతోత్సవం రాత్రి ఏకాంత సేవ తదితర పూజాకార్యక్రమాలు జరిగాయి. ఐదు లాంతర్ల సెంటర్‌లోని పట్టాభిరామస్వామి దేవస్థానంలో విశేష పూజలు, గరుడ సేవలు జరగగా మహిళా భక్తులు వివిధ రకాల ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు షరాబు సుబ్రహ్మణ్యం, కోశాధికారి అమరా వేదగిరి, మాజీ కౌన్సిలర్ అమర విజయలక్ష్మి పాల్గొన్నారు.

క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు వేగవంతం చేయాలి



కిట్లు అందజేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత

కలిగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏప్రిల్ నెల చివరికల్లా ప్రజలందరికీ క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షల ప్రక్రియ పూర్తిచేయాలని కావలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బ్రిజిత సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ఆమె సమీక్ష నిర్వహించారు. అనంతరం మండల పరిధిలో ఉన్న లింఫాటిక్ ఫైలేరియాసిస్(ఎలిఫెంట్ యాసిస్) వ్యాధి గ్రస్థులకు ఎంఎండిపి కిట్స్ (మార్బిడిటి మేనేజ్‌మెంట్ అండ్ డిజేబిలిటి ప్రీవెన్షన్‌కిట్స్)ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వి నాగార్జున, సబ్‌యూనిట్ అధికారి లక్ష్మీనరసయ్య, సీహెచ్‌వో సాయిలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న ఫ్లైవోవర్ బ్రిడ్జిని పరిశీలించిన మంత్రి



కలుగోళశాంభవి ఆలయం వద్ద అసంపూర్తిగా నిలిచిన ఫ్లైవోవర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ పెద్దపవని రోడ్డులో కలుగోళ్ల శాంభవి ఆలయం వద్ద అసంపూర్తిగా ఉన్న ఫ్లైవోవర్ బ్రిడ్జిని మంగళవారం రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డితో కలిసి పరిశీలించారు. సుమారు 18 ఏళ్ల కిందట ఆ మార్గంలో ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం కలుగోళ్ల శాంభవి ఆలయం వద్ద ఉన్న రైల్వే గేట్‌ను శాశ్వతంగా మూసివేశారు. రైల్వే స్థలం వరకు రైల్వేశాఖ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి వదిలేసింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాల్సిన బ్రిడ్జి పనులు చేపట్టలేదు. అప్పటి నుంచి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని మంత్రికి ఎమ్మెల్యే వివరించారు. ఆ మార్గంలో ఫ్లైవోవర్ నిర్మాణం కన్నా అండర్ పాస్ వంతెన నిర్మాణం చేపడితే పట్టణ ప్రజలకు అనుకూలంగా ఉండడమే కాక రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక భారం తగ్గుతుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి ప్రతిపాదనలు పంపితే పరిశీలిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్, పోతుగంటి అలేఖ్య, పొట్లూరు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను కుళ్లబొడుస్తున్న

మట్టి మాఫియా!

- రామన్నచెరువులో యథేచ్ఛగా తవ్వకాలు
- అక్రమంగా ప్రైవేట్ వెంచర్లకు తరలింపు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ అధికారులు
- రూపురేఖలు మారుతున్న ప్రభుత్వ భూములు, చెరువులు, కొండలు, గుట్టలు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెంలో మట్టి మాఫియా దందా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ భూములు, చెరువులు, కొండలు, గుట్టలను ఇష్టనుసారంగా కుళ్లబొడుస్తుండడంతో రూపురేఖలు మారిపోతోన్నాయి. అక్రమంగా తవ్విన మట్టిని లేఅవుట్లకు తరలిస్తూ రియల్టర్లు లక్షలు గడిస్తుంటే సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో మట్టి అక్రమ రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోయింది. గత 15 రోజులుగా రేయింబవళ్లు తేడా లేకుండా వలేటివారిపాలెం రామన్న చెరువులోని మట్టిని రెండు ఎక్స్‌కవేటర్లుతో తవ్వి 30కి పైగా ట్రాక్టర్లతో యథేచ్ఛగా జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ ప్రైవేట్ వెంచరుకు తరలిస్తున్నారు. రోజూ వందల యూనిట్లు లెక్కన ఇప్పటి వరకు సుమారు 3 వేల యూనిట్లుకు పైగా మట్టి తరలించినట్లు సమాచారం. జమీన్‌ఉప్పలపాడు రెవెన్యూలో హైవే పక్కన వేస్తున్న వెంచరుకు ఈ మట్టి తోలి జాతీయ రహదారికి సమానంగా ఎత్తు పెంచేందుకు శ్రీకారం చుట్టారు. అంతే కాకుండా వెంచరులో అంతర్గత రహదారుల ఏర్పాటుకు అవసరమైన మట్టిని వెంచరుకు అతి సమీపంలో ఉన్న రామన్నచెరువులోని గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. స్థానికులు ఎవరైనా ప్రశ్నిస్తే అధికారులకు ఆమ్యామ్యాలు ముట్టజెప్పామని బుకాయిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో గండిపడుతోంది. చెరువుల్లో, ప్రభుత్వ భూముల్లో మట్టి తీసుకెళ్లాలంటే రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ అధికారులు అనుమతులు తప్పనిసరి. చెరువుల్లో గ్రావెల్ కావాలంటే క్యూబిక్ మీటర్లు చొప్పున ప్రభుత్వానికి రుసుం చెల్లించి ఇరిగేషన్ అధికారులు అనుమతులు తీసుకోవాలి. ఇరిగేషన్ అధికారులు మార్కింగ్ ఇచ్చిన ప్రదేశంలోనే మట్టిని తీసుకెళ్లాలి. అయితే అలాంటి నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వానికి పైసా కూడా రుసుం చెల్లించకుండానే అక్రమంగా మట్టి తరలించుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. రామన్నచెరువులో నిబంధనలకు విరుద్ధంగా చెరువుకట్ట ఆనుకొని మట్టిని తరలిస్తున్నారు. దీంతో చెరువు కట్ట మన్నిక కోల్పోయి దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని ఆయకట్టుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రామన్నచెరువులోని అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేయాలని స్థానికులు కోరుతున్నారు.



హైవే పక్కన వెంచరుకు తోలిన చెరువు మట్టి



వలేటివారిపాలెం రామన్న చెరువులో చేపట్టిన మట్టి తవ్వకాలు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

రామన్నచెరువులో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. దీంతో గత వారం దాడులు చేసి జరిమానా వేశాం. అయినప్పటికీ మట్టి తవ్వకాలు ఆపలేదు. వెంటనే పరిశీలించి తవ్విన మట్టిని కొలతలు తీసి రికవరీ చేయిస్తాం.

- త్రివిక్రమ్, ఇరిగేషన్ ఏఈ, వలేటివారిపాలెం

న్యూస్ బాక్స్

వ్యవసాయ పరికరాలకు దరఖాస్తుల స్వీకరణ

కలిగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుల నుంచి ప్రభుత్వం రాయితీపై అందించే వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల కోసం రైతు సేవాకేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వ్యవసాయాధికారి ఎం సురేష్‌బాబు ఒ ప్రకటనలో తెలిపారు. అవసరమైన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం, ట్రాక్టర్ ఆర్‌సీ పుస్తకం, సంబంధిత పత్రాలు, ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీలతో రైతు సేవాకేంద్రంలో రిజిస్ట్రేషన్ ప్రకియ పూర్తి చేయించుకోవాలని పేర్కొన్నారు. యాంత్రీకరణ పరికరాలు మంజూరైన రైతులు రాయితీ నగదు పోను మిగిలిన సొమ్ము రైతు తన వాటాగా చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. మండలంలోని అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీలను పొందాలని ఆయన తెలిపారు.

పెంచిన గ్యాస్ ధర తగ్గించాలి : సీపీఎం

కావలిటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒకే సారి గ్యాస్‌పై రూ.50, పెంచడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు, విద్యుత్ చార్జీలు, రకరకాల పన్నులు కట్టలేక ప్రజలు అల్లాడిపోతుంటే మళ్లీ ప్రజలపై అదనపు భారం మోపడం ఎంతవరకు సమంజసమన్నారు. పాలకులు ఎన్నికల హామీలు గద్దెనెక్కాక తుంగలో తొక్కి, పేద, మధ్య తరగతి ప్రజలను మోసం చేస్తూ ఆర్థికంగా దెబ్బతీస్తున్నారన్నారు. ప్రధాని మోదీ చెప్పే వికసిత్ భారత్ ఇదేనా అని ప్రశ్నించారు. పెంచిన గ్యాస్ ధర తగ్గించకపోతే ప్రజాపోరాటాలు తప్పవన్నారు. సమావేశంలో కృష్ణప్రసాద్, మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

మా ఆస్తికి, ప్రాణాలకు రక్షణ కల్పించండి

- తహసీల్దారు కార్యాలయం వద్ద బైఠాయించిన తల్లీకూతుళ్లు



తహసీల్దారు కార్యాలయం వద్ద బైఠాయించిన లక్ష్మీకుమారి, గాయత్రి

ఉలవపాడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పూర్వీకుల కాలం నాటి ఆస్తికి, తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతూ ఉలవపాడుకు చెందిన తల్లీకూతుళ్లు బాపనపల్లి లక్ష్మీకుమారి, గాయత్రి మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద సుమారు 3 గంటలపైగా బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ ఉలవపాడు ప్రధాన రహదారి పక్కన సర్వే నెంబరు 88లో సుమారు 130 గదుల ఖాళీ స్థలం తాతల కాలం నుంచి మా కుటుంబ సభ్యుల అనుభవంలో ఉందన్నారు. భీమవరం పంచాయతీ ఎల్ రాజుపాలెంకు చెందిన ఓ వ్యక్తి సర్వే నెంబరు 92లో 56 గదులకు సంబంధించి ఆ స్థలం వారసుల్లో ఒకరైన బాపనపల్లి సత్యనారాయణ తనకు రిజిస్ట్రేషన్ చేశారంటూ ఆయన మరణాంతరం 2021లో నకిలీ పత్రాలతో తమ ఆస్తిని కాజేయాలని కుట్రపన్నారన్నారు. స్థానిక ఓ మాజీ రౌడీ షీటర్ వెంటపెట్టుకొని స్థలం వద్దకు వచ్చి మమ్ములి ద్దరిని కొట్టి, చంపేందుకు ప్రయత్నించి తిరిగి మామీదనే అట్రాసిటీ కేసు నమోదు చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మావద్ద ఉన్న స్థల ధ్రువీకరణ పత్రాలతో రెవెన్యూ, పోలీసు అధికారులకు రాత పూర్వక ఫిర్యాదు చేశామని, మా స్థలం సర్వే నెంబరు 88కి, ఆ వ్యక్తి చెప్తున్న సర్వే నెంబరు 92కు పొంతన లేక పోవడంతో అప్పటి తహసీల్దారు వివాద స్థలంగా ఇరువురు ఆ స్థలంలోకి వెళ్లవద్దని 145 సెక్షన్ జారీ చేశారన్నారు. ఈనిపై కందుకూరు కోర్టులో కేసు వేశామన్నారు. మళ్లీ గత నెల 28వ తేదీన మందీమార్బలంతో అదే మాజీ రౌడీ షీటర్ సహకారంతో స్థలంలో మట్టిని తోలించాడని, దీనిపై రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీంతో ఈనెల 1వ తేదీన కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజకు ఫిర్యాదు చేశామని, ఆమె ఉలవపాడు తహసీల్దారును కలవమని చెప్పారన్నారు. అప్పటి నుంచి తహసీల్దారు కార్యాలయం, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దారు శ్రీనివాసులు వివరణ కోరగా ఎస్‌ఐ అంకమ్మకు 145 సెక్షన్ విధించే విషయంపై అవకాశాలను పరిశీలించాలని ఆదేశించామని, నివేదిక వచ్చాక ఎలాంటి సంఘటనలు జరగకుండా చూస్తామని, దీనికి కొంత సమయం పడుతుందని బాధితులకు వివరించామని తెలిపారు.

గ్రంధి సేవలకు శాశ్వత గుర్తింపు





గ్రంధి యానాదిశెట్టి విగ్రహం ఆవిష్కరణలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ రవిచంద్ర, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, అలేఖ్య తదితరులు, కార్యక్రమానికి హాజరైన ప్రజలు

- కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రులు

కావలి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ మాజీ చైర్మన్, టీడీపీ నేత గ్రంధి యానాదిశెట్టి పార్టీలకు అతీతంగా ప్రజలకు అందించిన సేవలకు శాశ్వత గుర్తింపు ఆయన కాంస్య విగ్రహాన్ని కావలిలో ఏర్పాటు చేయడమేనని రాష్ట్ర మంత్రుల బీసీ జనార్దన్‌రెడ్డి, అనగాని సత్యప్రసాద్‌లు పేర్కొన్నారు. పట్టణంలోని ట్రంకురోడ్డు పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్‌లో కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన గ్రంధి కాంస్య విగ్రహాన్ని మంగళవారం సాయంత్రం ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే కృష్ణారెడ్డిలతో కలిసి మంత్రులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ జోనల్, పార్లమెంట్ ఇన్‌చార్జిలుగా కావలి నియోజకవర్గానికి వచ్చినప్పుడు గ్రంధిని కలిశామని, పార్టీ పటిష్టతకు ఆయన మాకు ఎన్నో సలహాలు, సూచనలు ఇచ్చారన్నారు. 30 ఏళ్లుగా కావలి రాజకీయాలో ఉండిన ఆయన కుల, మత, పార్టీలకతీతంగా ప్రజలకు సేవలందించి ప్రజా మన్ననలను పొందారన్నారు. ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి, గ్రంధి మంచి స్నేహితులు కావడంతో ఆయన మరణానంతరం తన సొంత నిధులతో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రంధి తన రాజకీయ వారసత్వం తన కూతురు అలేఖ్యకు ఇచ్చారని, ఆమె కూడా తండ్రి బాటలో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేసి సేవలు అందించిందన్నారు. కావలి పట్టణ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్యవైశ్యులకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ గ్రంధి 2014 వరకు తమకు రాజకీయ ప్రత్యర్థిగా ఉన్నారని, ఆయనను ఓడించేందుకు తాము ఎన్ని ప్రయత్నాలు చేసినా కావలి పట్టణంలో మెజార్టీ తేలేకపోయామన్నారు. ఎమ్మెల్యే, ఎంపీగా టీడీపీ అభ్యర్థులు గెలిచినా మున్సిపల్ చైర్మన్‌గా ఆయనే గెలిచారన్నారు. ప్రజలతో ఆయనకు ఉన్న బాంధవ్యం అలాంటిదన్నారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ తాను జలదంకి సొసైటీ అధ్యక్షుడిగా తొలుత రాజకీయ రంగ ప్రవేశానికి ఆయనే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధి తనయ పోతుగంటి అలేఖ్య, టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, జనసేన నేత అళహరి సుధాకర్, బీజేపీ నేత జీ.భరత్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు తటవర్తి రమేష్, గ్రంధి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో రైల్వే అభివృద్ధికి ఆటంకం



స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నేతలు

కావలిటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ల నిర్లక్షంతో కావలి రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని బీజేపీ నేతలు ఆరోపించారు. మంగళవారం బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ సందర్శించి పలు సమస్యలను అసంపూర్తిగా నిలిచిన అభివృద్ధి. పనులను పరిశీలించి స్టేషన్ మాస్టర్ కు వినతిపత్రం అందించారు. నేతలు మాట్లాడు తూ తాము అనేక పర్యాయాలు కావలి రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ ఏర్పాటు చేయాలని బీజేపీ నేతల ద్వారా ఉన్నతాధికారులను కోరగా మంజూ రైన లిఫ్ట్ పనులు ప్రారంభించి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అసంపూర్తిగా మిగిలిపోవడంతో పిల్లలు వృద్ధులు, దివ్యాంగులకు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. జనతాపేట వైపు బుకింగ్ కౌంటర్ ఏర్పాటు కలగానే మిగిలిందని వాపోయారు. స్టేషన్‌లో మంచి నీటి సౌకర్యం కల్పించాలని కోరినప్పటికీ ఆచరణకు నోచుకోలేదన్నారు. స్టేషన్‌లో లైట్లు, ఫ్యాన్లు, డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మంద కిరణ్, జిల్లా నాయకులు కె బ్రహ్మానందం. సుజి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష

వలేటివారిపాలెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని కందుకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శర్మిష్ట తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి మంగళవారం 7వ జాతీయ పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్, సీహెచ్‌వో శివరామయ్య, సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పౌష్టికాహార పక్షోత్సవాల అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న సీడీపీవో శర్మిష్ట

మ్యుటేషన్ విధానంలో మార్పులు!

- పట్టాదారు పాసుపుస్తకం జారీలో ఇబ్బందులు



కలిగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత నుంచి మ్యుటేషన్ విధానంలోని మార్పులు రైతులకు ఇబ్బందికరంగా మారాయి. దీంతో భూహక్కు(పట్టాదారు పాసుపుస్తకం)పత్రాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓ రైతు తాను కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన రిజిస్టర్ డ్యాకుమెంట్లతో మీసేవా కేంద్రాల ద్వారా పట్టాదారు పాసుపుస్తకానికి దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత కాలంలో వెబ్‌ల్యాండ్‌లో భూమి కొనుగోలు చేసిన రైతు పేరుతో 1బి, అడంగల్ కాపీలు నమోదు కావడం, కొద్దిరోజులకు సంబంధిత రైతుకు పట్టాదారు పాసుపుస్తకం పోస్టాఫీసు ద్వారా నేరుగా ఇంటికి వచ్చేది. అదేవిధంగా రైతువారి కుటుంబంలో భూయజమాని చనిపోయినప్పుడు ఆ కుటుంబంలోని వారసులు చనిపోయిన వ్యక్తి మరణ ధ్రువీకరణ పత్రంతో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకొని మీసేవలో మ్యుటేషన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే పట్టాదారు పాసుపుస్తకం వచ్చేది. అయితే గత రెండేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం భూములు కొనుగోలు చేసే సమయంలో రిజిస్ట్రేషన్ పూర్తవగానే ఆటో మ్యుటేషన్ విధానం ప్రవేశపెట్టింది. ఈ విధానంలో భూమి కొనుగోలు చేసిన వ్యక్తిపేరు వెబ్‌ల్యాండ్‌లో ఇంగ్లీషు భాషలో 1బి, అడంగల్ వస్తోంది. ఈ కారణంతో పట్టాదారు పాసుపుస్తకం కోసం మళ్లీ గ్రామ సచివాలయం లేదా మీ సేవ కేంద్రాల వద్దకు వెళ్లి తిరిగి మ్యుటేషన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటేనే పట్టాదారు పాసుపుస్తకం వచ్చేది. దీంతో ఆటో మ్యుటేషన్‌తో అడంగల్, 1బిలు వచ్చినా తిరిగి పట్టాదారు పాసుపుస్తకం కోసం తహసీల్దారు కార్యాలయంకు వెళ్లి సొమ్ములు ముట్టజెప్పడంతోపాటు రెవెన్యూ సిబ్బంది చుట్టూరా తిరగాల్సివస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలల కాలం నుంచి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ద్వారా మ్యుటేషన్ చేస్తుంటే ఎర్రర్ మెసేజ్ వస్తోంది. నూతనంగా సచివాలయ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఉంటేనే మ్యుటేషన్ ప్రక్రియ జరిగితోంది. దీనివలన గతంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కలిగి ఉన్నా అది చెల్లుబాటు కాకపోవడంతో తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. రెవెన్యూ కార్యాలయంలో మ్యుటేషన్ ప్రక్రియ సజావుగా పూర్తయితే వెబ్‌ల్యాండ్‌లో 1బి, అడంగల్‌లో పేరు నమోదైనప్పటికీ పట్టాదారు పాసుపుస్తకం రావడానికి రెండు, మూడు నెలలకుపైగా కాలం పడుతోంది. పట్టాదారు పాసుపుస్తకం ఉంటేనే తప్ప బ్యాంకుల్లో రైతు రుణాలు ఇవ్వరు. భూమిని నమ్ముకున్న రైతుకు ఆ భూమి హక్కుతో కూడిన వివరాలతో పట్టాదారు పాసుపుస్తకం పొందాలంటే నెలల కాలం ఎదురుచూపులు చూడాల్సివస్తోందని, మ్యుటేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పాసుపుస్తకం వచ్చే లాగున ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ధ్వంసం!

- పొంచిఉన్న ప్రమాదం



వలేటివారిపాలెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెంలోని విద్యుత్ కార్యాలయానికి అతి సమీపంలోని పొలాలకు వెళ్లే దారిలో పొలం గట్టుపై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫారం దిమ్మె ధ్వంసం అయింది. దీంతో ఏ క్షణంలోనైనా ట్రాన్స్‌ఫార్మర్ కిందపడిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో అటు వైపు పొలాలకు వెళ్లే కూలీలకు ప్రమాదం పొంచి ఉంది. ధ్వంసం అయిన దిమ్మెపైన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని రైతు పరిటాల శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రతినిత్యం ఆ దారిలో పొలాలకు రైతులు, కూలీలు వ్యవసాయ పనుల నిమ్మితం వెళ్తూనే ఉంటారని అలాంటి సమయాల్లో ట్రాన్స్‌ఫార్మర్ కింద పడి ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆ రైతు చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ సిబ్బంది స్పందించి ఒరిగిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేసి విద్యుత్ ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.





నాడిలా... మంచాలపల్లి వద్ద గతంలో రోడ్డు దుస్థితి

నేడిలా !

మరమ్మతులు పూర్తయ్యాక ప్రస్తుతం ఉన్న రోడ్డు

ఆత్మకూరు-సోమశిల రోడ్డు వైసీపీ హయాంలో అధ్వానంగా ఉండేది. చిరుజల్లులు కురిసినా ఈ రహదారిపై గుంతలు ఏర్పడి, ప్రమాదాలు జరిగేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టారు. మరమ్మతులకు రూ.20 లక్షలు మంజూరు చేయడంతో ప్యాచ్ పనులు పూర్తి చేశారు. దీంతో ప్రజలకు గత నెలరోజులుగా ప్రయాణ కష్టాలు తీరాయి.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

నలుగురు సబ్‌రిజిస్ట్రార్లపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశం

కోవూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో వేర్వేరు కాలాల్లో పనిచేసిన నలుగురు సబ్ రిజిస్ట్రార్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్య దర్శి ఆర్పీ సిసోడియా మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. గతంలో కోవూరులో సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసిన లలితమ్మ రూ.14.91లక్షలు, సయ్యద్ సిత్రాజ్ రూ.64వేలు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు. టీఎల్ కాంతారావు రూ.7.11లక్షలు, సయ్యద్ మహబూబ్‌బాష రూ 22.75లక్షల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోయింది. న్యాయవాది కేవీ పెంచలరెడ్డి ఫిర్యాదు మేరకు విషయం వెలుగులోకి వచ్చింది. పూర్తి వివరాలు అందాల్సి ఉంది.

ఓటరు నమోదుకు సహకరించండి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 18 ఏళ్ల వయసు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని, ఈ క్రమంలో యువత ఓటరు నమోదుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి జే ఉదయ భాస్కర్ రావు కోరారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్ లో ఉన్న ఫారం-6లను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు సదరు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నుంచి రసూల్, వైసీపీ నుంచి కోటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నుంచి బాలసుధాకర్, బీజేపీ నుంచి శ్రీనివాస్, బీఎస్పీ నుంచి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో ఉదయభాస్కర్ రావు

పలారమేస్తే పనుండదు !

- చేనేత కుటుంబాల్లో ప్రత్యేక ఆచారం
- శుభాకార్యాల్లో చేదోడుగా పనులు
- నేత కార్మికుల ఐక్యతకు నిదర్శనం
- సౌత్‌మోపూరు, ములుముడి గ్రామాల్లో అమలు ● వందల ఏళ్లుగా కొనసాగింపు

నెల్లూరు రూరల్లోని సౌత్‌మోపూరు గ్రామంలో పిచ్చయ్య (పేరు మార్పు)ది చేనేత కుటుంబం. ఆయన ఒక్కగానొక్క కూతురు రమణమ్మ (పేరు మార్పు)కు పెళ్లి నిశ్చయ మైంది. పెళ్లిరోజుకు ముందు రోజు రాత్రి చౌడేశ్వరీదేవీకి పూజలు చేసి పద్యాల రూపంలో అమ్మవారిని శాంతింపచేసి పలారం వేస్తున్నట్లు మైక్‌లో ప్రకటించారు. అంతే గ్రామంలోని 150 చేనేత కుటుంబాలు మగ్గం నేయడం ఆపేశాయి. ఒకరోజంతా పనిజోలికి పోకుండా పిచ్చయ్యకు చేదోడుగా ఉంటూ రమణమ్మ పెళ్లి వేడుకను ఘనంగా జరిపించి అత్తారింటికి పంపారు. ఈ సంప్రదాయం వందల ఏళ్ల నుంచి సౌత్‌మోపూరుతో పాటు పక్కనే ఉన్న ములుముడి గ్రామంలోనూ కొనసాగుతోంది. ఈ ఆచారం ఆసక్తికరంగా ఉన్నా నేత కార్మికుల ఐక్యతను చాటుతోందన్న ప్రశంసలు అందుకుంటోంది.

- నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)



సౌత్‌మోపూరు గ్రామంలోని చౌడేశ్వరీ దేవీ ఆలయం

నెల్లూరు నగరానికి పడమర దిక్కున 24 కి.మీ. దూరాన సౌత్‌మోపూరు, దానికి నాలుగు కి.మీ. ముందు ములుముడి గ్రామం ఉన్నాయి. ఇక్కడ వ్యవసాయం తరువాత చేనేత పరిశ్రమే పెద్దది. సౌత్ మోపూరులో 150 కుటుంబాలు నేతపై ఆధారపడి జీవిస్తుం డగా, ములుముడిలో సుమారు 80 కుటుంబాలు మగ్గాలు నేస్తున్నాయి. వీళ్ల కుల దైవం చౌడేశ్వరీదేవి. ఏ శుభ కార్యం మొదలుపెట్టాలన్నా అమ్మవారిని పూజించాకే అడుగు ముందు కేస్తారు. పెళ్లి చేసినా ఇదే వరస. ముహూర్తానికి ముందు రోజు రాత్రి ఇంట్లో, గుడిలో అమ్మ వారికి ప్రత్యేక పూజ లు చేస్తారు. పద్యాల రూపంలో ఆ దేవిని కీర్తించి ప్రసన్నం చేసుకుంటారు. అనంతరం పొంగలి, పండ్లను పలారం(ఫల హారం)గా నివేదిస్తారు. ఈ విషయాన్ని మైక్‌లో ప్రకటిస్తారు. ఆ వెంటనే గ్రామంలో ఉన్న చేనేత కుటుంబాలన్నీ మగ్గం పనులకు సెలవు ప్రకటించేసి పెళ్లింట సందడి చేస్తారు. పెళ్లి పనుల్లో ఒకరికొకరు సహకరించు కుంటూ తమ ఐక్యతను చాటుతారు. సౌత్‌మోపూరు లో చౌడే శ్వరీ దేవీ ఆలయాన్ని నిర్మించుకున్న చేనేత కార్మిక కుటుం బాలు అక్కడే పూజలు చేస్తాయి. ములుముడిలో మాత్రం అమ్మవారికి ప్రత్యేకించి ఆలయం లేకపోయినా ఎన్నో ఏళ్లగా ఓ గదిలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్దే పూజలు చేస్తున్నారు.

పౌర్ణమికీ పనుండదు

చేనేత కార్మిక కుటుంబాలలో ప్రధానంగా రెండు తెగలు న్నాయి. ఇందు లో దేవాంగులు, పద్మశాలీ యులు. వీరిలో పద్మశాలీయులు ప్రతీనెల అమా వాస్య రోజు పని జోలికి వెళ్లరు. అదేవిధంగా దేవాం గులు పౌర్ణమి రోజు పని చేయరు. సౌత్‌మోపూరు, ములుముడి గ్రామాల్లోని నేత కార్మిక కుటుం బాలన్నీ దేవాంగులే కావడంతో ప్రతీ నెల పౌర్ణమి నాడు వారు పని చేయరు. పౌర్ణమికి ముందు రోజు చౌడేశ్వరీ అమ్మవారి ఆలయం వద్ద పూజలు చేసి పలారం (ఫలహారం) వేస్తున్నట్లు కులపెద్దలు మైక్ ద్వారా ప్రకటిస్తారు. ఇక ఆ రోజు నేత పని ఆపేసి మరుసటి రోజు తిరిగి పనిలోకి వెళ్తారు. పూరాతన కాలం నుంచి వస్తున్న ఈ ఆచారాలను ఆ రెండు గ్రామాల్లోని చేనేత కార్మిక కుటుంబాలు ఇప్పటికీ అనుసరిస్తుండటం విశేషం.

కమ్యూనిస్టులు.. కట్టుబాట్లు

సౌత్‌మోపూరు, ములుముడి గ్రామాలు కమ్యూనిస్టు భావాలున్న పల్లెలు. అలాగని అభ్యుదయమేకాదు ఇక్కడ కట్టు బాట్లు కూడా ఎక్కువే. ఒక నిర్ణయం తీసుకుంటే ఊరంతా దానికి కట్టుబడుతుంది. ధనిక, పేద తేడా లేకుండా ఆచారాలను ప్రతీ ఒక్కరు గౌరవిస్తారు, ఆచరిస్తారు.

ములుముడి గ్రామ వ్యూ



మా చేనేతల్లో గొప్పతనం



ఈ సంప్రదాయం మా చేనేతల్లో గొప్పతనాన్ని సమాజా నికి చూపుతుంది. అందరూ ఐక్యంగా ఉండటానికి దోహద పడుతోంది. మేమంతా ఉమ్మడిగానే నిర్ణయాలు తీసుకుంటాము.

- పముజుల హరి, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

ఫలహారమేస్తే పని జోలికి వెళ్లం



మా కుటుంబాల్లో పెళ్లిళ్లకు ముందు ఫలహారమేస్తారు. అప్పుడిక పనిచేయం. శుభకార్యం జరిగే కుటుంబానికి సహా యంగా అందరం అండగా నిలిచి కార్యం గట్టెక్కిస్తాం. బయట ఊర్లకు వెళ్లినప్పుడు ఈ ఆచారం గురించి గొప్పగా చెప్తుంటారు. చాలా సంతోష మేస్తుంది.

- జక్కల సుబ్బయ్య, నేత కార్మికుడు, సౌత్‌మోపూరు

చాలా గొప్పగా అనిపిస్తుంది



ఈ సంప్రదాయాన్ని నా చిన్నప్పట్నుంచి చూస్తున్నాను. చాలా గొప్పగా అనిపిస్తుంది. పలారం వేశారని తెలియగానే పని ఆపేసి శుభకార్యం జరిగే ఇంటి వారికి సహాయం చేయడం సంతోషంగా ఉంటుంది. ఇప్పటికీ దీనిని పాటించడం గొప్ప విషయం.

- బొగ్గల నవనీత, నేత కార్మికురాలు, ములుముడి

'సోమశిల' నీటిమట్టం

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల డ్యాంలో మంగళవారం నాటికి 52.510 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కండలేరుకు 100 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కారు ఢీకొని తండ్రీకొడుకులకు తీవ్రగాయాలు

- కుమారుడి పరిస్థితి విషమం

ఉలవపాడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగొల్లు సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ అంకమ్మ కథనం మేరకు.. ఉలవపాడు అంబేడ్కర్ నగర్‌కు చెందిన పెదపూడి అజయ్‌కుమార్, అతని కుమారుడు అభిషేక్‌సాత్విక్‌లు స్కూటీపై కావలికి బయలుదేరారు. చాగొల్లు సమీపంలోకి వచ్చే సరికి వెనుక నుంచి వస్తున్న కారు ముందు వెళుతున్న స్కూటీని వేగంగా ఢీకొనడంతో తండ్రీకొడుకులు ఇద్దరు రోడ్డుపై పడ్డారు. దీంతో తీవ్రగాయాలైన వారిని చికిత్స నిమిత్తం 108లో ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కుమారుడు అభిషేక్‌సాత్విక్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారుని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ

కందుకూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సౌజన్యంతో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 10 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరిం గ్ పూర్తి చేసిన వారంతా ఈ ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులకు హాజరయ్యేందుకు అర్హులేనని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో శిక్షణ తరగతులు జరుగుతాయని, నిరు ద్యోగ యువతీయువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీడీపీలో అందరికీ మార్గదర్శకుడు బీద

- రవిచంద్రకు పౌరసన్మాన కార్యక్రమంలో మంత్రి సత్యప్రసాద్

కావలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కష్టాల్లో పార్టీకి అండగా ఉండి టీడీపీలో అందరి నేతలకు మార్గదర్శకుడిగా ఎమ్మెల్సీ బీద రవిచంద్ర నిలిచారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని సెల్ఫీపాయింట్ వద్ద రెండవసారి ఎమ్మెల్సీగా బీద రవిచంద్రకు పౌరసన్మానం జరిగింది. ముందుగా మంత్రి అనగానితోపాటు మరో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద, ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి తదితరులు గ్రంది యానాదిశెట్టి విగ్రహం నుంచి ర్యాలీగా సెల్ఫీ పాయింట్ వద్దకు చేరుకుని సెల్ఫీలు దిగారు. అనంతరం జరిగిన సభలో మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ ఎన్ని కష్టాలు ఉన్నా పార్టీ మారకుండా జెండా మార్చకుండా సూర్యచంద్రులులా పార్టీకి అండగా ఉన్నారంటూ కొనియాడారు. మరో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో పరిశ్రమలు జగన్‌ను చూసి భయపడి పారిపోయాయని కూటమి పాలనలో తండ్రీకొడుకులైన చంద్రబాబు, లోకేష్‌లను చూసి రాష్ట్రానికి పరుగుల పెడుతున్నాయన్నారు. కావలి ప్రాంతానికి బీపీసీఎల్, ఇండోసెల్ కంపెనీలు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. ట్రబుల్ షూటర్‌గా ఎక్కడ పార్టీకి ఇబ్బందులు ఉంటే అక్కడ వాలి వాటిని పరిష్కరించటంలో రవిచంద్ర ముందుంటారన్నారు.

● ఎవరికీ భయపడే వాడ్ని కాదు : బీద

గత ఎన్నికలలో పోటీ చేయనందుకు తనపై అనేక ఊహలు వచ్చాయని రాజకీయాలలో తాను ఎవరికి భయపడే వాడిని కాదని ఎమ్మెల్సీ రవిచంద్ర అన్నారు. చంద్రబాబుకు మాట ఇచ్చానని ఓపిక ఉన్నంత వరకు సైకిల్ తొక్కుతూ టీడీపీతోనే ఉంటానని స్పష్టం చేశారు. తనకు ఈ రోజు పౌరసన్మానం చేసినా, మంత్రులుగా సత్యప్రసాద్, జనార్ధన్‌రెడ్డిలు పదవులు పొందినా చంద్రబాబు ఆదరణతోనే ఈ గౌరవం దక్కిందన్నారు. కావలి మున్సిపాల్టీకి త్వరలో జరుగబోయే ఎన్నికలలో 40కి 40 వార్డులు కూటమికి గెలిపించే బాధ్యత ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిపై ఉందన్నారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ బీద త్యాగం చేయటం వల్లే తాను ఎమ్మెల్యే అయ్యానన్నారు. అనంతరం సర్వమత ప్రార్థనలు నిర్వహించి రవిచంద్రను ఆశీర్వదించారు. బీద రవిచంద్రను సన్మానించి వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.



బీద రవిచంద్రను సత్కరిస్తున్న మంత్రులు అనగాని, బీసీ జనార్దన్, ఎమ్మెల్యే కావ్య తదితరులు

మే 15 నుంచి రెండో పంటకు నీరివ్వాలి

కలువాయి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సోమశిల దక్షిణ కాలువ ఆయకట్టులో రెండో పంట సాగుకు మే 15 నుంచి సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతు సంఘా లు ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు సోమశిల ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వేలూరు కేశవ చౌదరి తెలిపారు. రెండో పంటకు సాగునీరు విడుదలపై మంగళవారం కలువాయిలో రైతు సంఘాల ప్రతినిధులు, రైతులతో సోమశిల ప్రాజెక్టు అధికారులు సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలువకు మే 15 నుంచి నీరిస్తే సకాలంలో రైతులకు పంట చేతికి వస్తుందన్నారు. కాలువకు నీరు విడుదల చేసేందుకు ఇప్పటి నుంచి నెల మాత్రమే సమయం ఉందని, వెంటనే అధికారులు చర్యలు తీసుకుని కాలువలను సిద్ధం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమా వేశంలో సోమశిల ఆరో డివిజన్ ఈఈ ఈ.మల్లికార్జునరావు, డీఈలు ఎన్.సురేష్ కుమార్, ఎన్.అంకమరావు, సీహెచ్.సుధీర్, నీటి సంఘాల ప్రతినిధులు చల్లా విజయభాస్కర్‌రెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, టీడీపీ నా యకులు జీ.వెంకటేశ్వర్లు నాయుడు, చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేలూరు కేశవచౌదరి

మాలకార్పొరేషన్ చైర్మన్ నేడు రాక

నెల్లూరు(హరనాథపురం) : రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ బుధవారం నెల్లూరుకు వస్తున్నారని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ, నగర అధ్యక్షుడు కమతం అశోక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 10గంటలకు జరిగే చలి వేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొం టారని తెలిపారు.

సారా రహిత రాష్ట్రం ప్రభుత్వ లక్ష్యం

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నితీష్‌కుమార్



ఎక్సైజ్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ నితీష్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

కావలిరూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దటమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు సారా నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నితీష్‌కుమార్ పేర్కొన్నారు. కావలి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మతో కలిసి ఆయన అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారీ, అమ్మకాల నియంత్రణకు ప్రభుత్వం నవోదయం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని, ఆ మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టీ.శ్రీనివాస రావు, అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్, జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాసు లునాయుడు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రమేష్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జగదీశ్వర్‌రెడ్డి, కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ దేవిక, సబ్ ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ప్లాట్ ఫారంపై మహిళ మృతదేహం

కావలి రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కావలి రైల్వే స్టేషన్‌లోని 2-3 నెంబరు పాట్ ఫారంపై మంగళవారం సుమారు 35 ఏళ్ల గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ రమాదేవి తెలిపిన వివరాల మేరకు.. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో యాచకురాలిగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ రమాదేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మహిళ మృతదేహం

'ఉపాధి హామీ'లో రూ.91.46 లక్షల స్వాహా

- సామాజిక తనిఖీలో బహిర్గతం ● రూ.1.18 లక్షల రికవరీకి డ్వామా పీడీ ఆదేశం

లింగసముద్రం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో రూ.91.46 లక్షల స్వాహా చేసినట్లు సామాజిక తనిఖీలో బహిర్గతం అయ్యింది. అయితే కేవలం రూ.1.18 లక్షల రికవరీకి ఉన్నతాధికారులు ఆదేశించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. వివరాల మేరకు... మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు ఉపాధి పథకం కింద రూ.11.50 కోట్లతో పనులు చేశారు. అలాగే పంచాయతీరాజ్ పరిధిలో రూ.2 కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో రూ.16 లక్షలతో పనులు చేశారు. ఈ పనులపై గత నెల 18వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సామాజిక తనిఖీ అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేశారు. సదరు విచారణ నివేదికను మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో కే.శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదికలో డీఆర్‌పీలు వివరించారు. బోగస్ మస్టర్లు, భార్యాభర్తలకు, వివాహం కాని వారికి జాబ్ కార్డులు, పనుల కొలతల్లో తేడాలు, గ్రామాల్లో లేని వారి పేర్లతో నిధులు స్వాహా చేశారని గుర్తించి బహిర్గతం చేశారు. ఈ విధంగా సుమారు రూ.91,46,342 స్వాహా చేశారని తనిఖీ అధికారులు తేల్చారు.



ప్రజా వేదికలో ఉపాధి హామీ సిబ్బందిని విచారిస్తున్న డ్వామా పీడీ గంగాభవాని, ఇతర అధికారులు

● పంచాయతీల వారీగా అక్రమాలు

మండలంలోని ఎర్రారెడ్డిపాలెంలో రూ.19,45,897, చినపవనిలో రూ.18,60,758, మొగిలిచెర్లలో రూ.11,97,369, లింగసముద్రంలో రూ.8,67,589, పెదపవనిలో రూ.5,33,188 అక్రమాలు జరగ్గా, మిగిలిన పంచాయతీల్లో రూ.1.50 లక్షల నుంచి నాలుగు లక్షల వరకు అవకతవకలు ఉన్నట్టు తేల్చారు. అలాగే చినపవనిలో ఫ్లడ్ బండు వేయకుండానే 3 పనులకు రూ.13 లక్షల చెల్లించనట్లు గుర్తించారు. అక్కడ జామాయిల్ తోట ఉన్నట్లు తేల్చారు. ఇదే గ్రామంలో ఒక ఫీడర్ చానల్‌లో 892 మీటర్ల పనులు చేయకుండానే పనులు చేసినట్లు సృష్టించి రూ.94,367 చెల్లించినట్లు గుర్తించారు. అలాగే లింగసముద్రంలో లలిత, సుభద్రమ్మ, శ్రీనివాసులు, సుశీలమ్మలకు పనులకు వెళ్లకుండానే 24 రోజులకు రూ.10 వేలు చెల్లించినట్లు గుర్తించారు. అలాగే ఎర్రారెడ్డిపాలెంలో కూడా 6 పనులకు కొలతల్లో తేడాలతో సుమారు రూ.15 లక్షల వరకు అక్రమాలు జరిగినట్టు తేల్చారు. ఇంకా పలు గ్రామాల్లో బోగస్ మస్టర్లతో నిధులు స్వాహా చేసిన ఘటనలు కోకొల్లలుగా వెలుగు చూశాయి. లింగసముద్రంలో రూ.1,15,691 ఖర్చు చేసి వేసిన మొక్కలు చనిపోయాయి. వీటన్నింటిపై స్పందించిన డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవాని చనిపోయిన మొక్కలను తిరిగి నాటాలని సిబ్బందిని ఆదేశించారు. ఇందుకు గాను వారికి రూ.65,700 జరిమానా విధించారు.

● రూ.1,18,450 రికవరీకి ఆదేశం

సామాజిక తనిఖీ విచారణ అనంతరం పీడీ గంగాభవానీ ఉపాధి హామీ అక్రమాలకు సంబంధించి సిబ్బంది నుంచి రూ.1,18,450 రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. సక్రమంగా లేవని రికార్డులు వారం రోజుల్లో సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోజుకు రూ.5 వేల మంది కూలీలు పనులకు వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్ బాబు, ఏపీడీ బాబూరావు, ఎస్ఆర్పీ బుజ్జి, ఏపీ వోలు అబ్దుల్లా, సమీర్‌బాషా సిబ్బంది పాల్గొన్నారు.